తెలుగు వారియ దినపత్రిక
వార్త
ఆదివారం
నవంబరు 15, 2026



లైబ్రరీలే దారి దీపాలు



‘కింగ్ 100’లో మహంతి ఝాన్సీరాణిగా టబు

అక్కినేని నాగార్జున హీరోగా నటిస్తున్న ‘కింగ్ 100’ చిత్రంపై ఆసక్తి పెరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో టబు పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రంలో మహంతి ఝాన్సీ రాణిగా కనిపించనుంది టబు. రాజసం, రాజకీయ నేపథ్యం, గంభీరమైన వ్యక్తిత్వంతో ఈ పాత్ర ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ప్రపంచంలో రెండు రకాల మనుషులుంటారని ఆమె పాత్ర నమ్ముతుంది. ఒకరు కష్టాన్ని నమ్మేవారు, మరొకరు అదృష్టాన్ని నమ్మేవారు. అయితే అదృష్టాన్ని నమ్మే వ్యక్తులంటే మహంతి ఝాన్సీ రాణికి అస్సలు పడదట. ఈ చిత్రంలో ఆమె రాజకుటుంబానికి చెందిన వ్యక్తిగా, రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే నాయకురాలిగా కనిపించనుంది. డిసెంబరు 24న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు.



డబ్బున్నవారు, డబ్బులేనివారు.. ప్రపంచంలో మనుషులు రెండే రకాలుగా ఉంటారని నాగార్జున తన పాత్ర ద్వారా చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. డబ్బులేనప్పుడు తనను ఓడిపోయిన వ్యక్తిగా చూశారని, డబ్బు వచ్చాక రాజుగా గుర్తించారని ఆయన చెప్పే మాటలు పాత్ర స్వభావాన్ని తెలియజేశాయి. అయితే డబ్బు కంటే తన గుర్తింపే శక్తిమంతమైనదని, దాన్ని నిలబెట్టుకోవడానికి నిరంతరం పరుగెత్తాల్సి ఉంటుందని చెప్పే డైలాగ్ సినిమాపై అంచనాలు పెంచింది.

ఆర్.ఏ. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. రాజా మహదేవన్ ఛాయాగ్రహణం, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వెండితెరపై నాగార్జున, టబు పాత్రలు ఎలా సందడి చేస్తాయో చూడాలంటే డిసెంబరు 24 వరకు వేచి చూడాల్సిందే మరి.

తారాతీరం

రామ్‌చరణ్ కొత్త సినిమా

రామ్ చరణ్ – సుకుమార్ కలయికలో రాబోతున్న ‘ఆర్‌సి 17’ ఘనంగా ప్రారంభమైంది. ‘రంగస్థలం’ తర్వాత వీరిద్దరూ కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. కథలో డివోషనల్ టచ్ ఉంటుందని, చరణ్ పాత్రలో సరికొత్త మేకోవర్, విభిన్నమైన బాడీ లాంగ్వేజ్ ఉండేలా సుకుమార్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ, సుకుమార్ రైటింగ్స్, టిసిరీస్ ఫిలిమ్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. చరణ్ సుక్కు ద్వయం గతంలో ‘రంగస్థలం’ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని అందించిన నేపథ్యంలో, ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.

‘ధర్మన్’ సినిమాలో శ్రీలీల

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా ‘జైలర్ 2’ సెన్సేషనల్ సక్సెస్ తర్వాత తన నుంచి రాబోతున్న నెక్స్ట్ సినిమా ‘ధర్మన్’.

యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న ఈ సినిమా శరవేగంగా షూటింగు జరుపుకుంటోంది. అయితే ఈ చిత్రం టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల కూడా ఉన్నట్టుగా ఆ మధ్య వార్తలు వినిపించాయి.



ఆమెపై మేకర్స్ ఫైనల్‌గా తన పుట్టినరోజు సందర్భంగా ఆమె ప్రైజెన్స్‌ని సినిమాలో ఈ చిత్రంలో కన్ఫర్మ్ చేశారు. ఇందులో ఆమె ఒక లవ్లీ రోల్‌లో కనిపించనున్నట్టుగా అనిరుధ్ ప్లెజెంట్ సంగీతంతో చిన్నపాటి ప్రోమో కట్ చేసి ప్రకటించారు. ఇక ఈ బిగ్ కాంబినేషన్‌లో శ్రీలీల ఎలా కనిపించబోతుందో చూడాలి మరి.

ఇక ఈ చిత్రంలో రాశిఖన్నా, రామ్ పోతినేని తదితరులు కూడా నటిస్తుండగా యూనివర్సల్ హీరో కమల్ హాసన్ నిర్మాణం వహిస్తున్నారు.

ఆదివారం వార్త

15 నవంబరు, 2026

కదంబం

'సంఘీ'భావం....5

ఎల్ నినో ప్రభావంతో
తాగునీటి కష్టాలు

కవర్ స్టోరీ..6

లైబ్రరీలే
దారి దీపాలు

ఆలోచనే ఆరంభం.. 13

ఈ వారం కవిత్వం.. 15

జీవితం

కథ..18

కీడు చేసిన మేలు

చిన్ని హృదయాల .. 20

ఆటలతో ఆరోగ్యం .. 24

ఇంకా...

మొగ్గ
పుస్తక సమీక్ష
వాస్తు
వారఫలం
వగైరా.. వగైరా..

మంచి ముత్యాలు

– నాలుక వలన సంపదలు కలుగుతాయి; చుట్టాలు, స్నేహితులు వస్తారు, సంకెళ్ళు ప్రాప్తిస్తాయి, చావు కూడా ప్రాప్తం కావచ్చు. – ముకుందమాల

– ప్రపంచంలోని అన్ని తలకాయల కన్నా ఒక మంచి హృదయం మిన్న.

సమాచారం

బ్రూనైలో..బాటిల్ నీళ్ల కంటే పెట్రోల్ చౌక!

ప్రపంచంలో ఎక్కడికెళ్లినా బాటిల్ వాటర్ కంటే పెట్రోల్ ధరే ఎక్కువగా ఉంటుంది. కానీ, ఆగ్నేయాసియాలోని ఓ చిన్న దేశంలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నం. అక్కడ లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలు.. బాటిల్ వాటర్ ధర కంటే చాలా తక్కువ. ఆ దేశమే బ్రూనై. ప్రపంచంలోని అత్యంత సంపన్న దేశాల్లో బ్రూనై ఒకటి. ముడి చమురు, సహజ వాయువు నిల్వలే ఈ దేశ సంపదకు ప్రధాన ఆధారం. ఈ సంపద ఫలాలను ప్రభుత్వం తన పౌరులకు నేరుగా అందిస్తోంది. బ్రూనై పౌరులు ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. వారికి విద్య దాదాపు ఉచితం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటే కేవలం ఒక డాలర్ (సుమారు రూ. 83) చెల్లిస్తే చాలు. ప్రభుత్వం ఇంధనంపై భారీగా సబ్సిడీ ఇవ్వడంతో ధరలు అత్యంత చౌకగా ఉంటాయి.

అయితే, ఓ ప్రముఖ ట్రావెల్ క్రియేటర్ అంకితా కుమార్ ప్రకారం.. తాను చూసిన ప్రదేశాల్లో ఇది అత్యంత ప్రశాంతమైన దేశం. ఇక్కడ నగరాల్లో ఉండే సందడి, నైట్ లైఫ్ లాంటివి దాదాపుగా కనిపించవు. స్థానికులకు మద్యం అమ్మకాలపై నిషేధం ఉంది. రోడ్లపై ట్రాఫిక్ జామ్‌లు గానీ, జనసమూహాలు గానీ ఉండవు. దేశంలో 70 శాతం భూభాగం పచ్చని వర్షారణ్యాలతో నిండి ఉంటుంది.



ఇక్కడి సుందరమైన మసీదులు, ప్రకృతి అందాలు పర్యాటకులను ప్రధానంగా ఆకర్షిస్తాయి. ప్రశాంత వాతావరణాన్ని కోరుకునే వారికి బ్రూనై ఒక చక్కటి పర్యాటక కేంద్రం. భారత్ నుంచి బ్రూనై వెళ్లాలనుకునే వారు చెన్నై నుంచి రాయల్ బ్రూనై ఎయిర్‌లైన్స్ ద్వారా నేరుగా వెళ్లొచ్చు. ప్రయాణ సమయం సుమారు ఐదు గంటలు పడుతుంది. ఇతర నగరాల నుంచి సింగపూర్ ఎయిర్‌లైన్స్, ఎయిర్‌ఏషియా, మలేషియా ఎయిర్‌లైన్స్ ద్వారా కనెక్టింగ్ విమానాలు అందుబాటులో ఉన్నాయి. ప్రయాణించే సీజన్‌ను బట్టి ఉంటుంది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com



మానేసాను..

అమ్మ: రవీ, మూడు రోజుల నుండి పాలు తాగడం మానేశావేంటి?

రవి: మా టీచర్ "పరుగెత్తి పాలు తాగడం కన్నా నిలబడి నీళ్లు తాగడం మిన్న" అని చెప్పారమ్మ. అందుకే నేను నీళ్లు తాగుతున్నాను.

– సయ్యద్ షఫీ, హన్మకొండ

ఎర్రగా..

అమ్మ: రామూ, పరీక్షకి వెళ్లేప్పుడు దేవుడికి దండం పెట్టుకోమని చెప్పాను, మరి దండం పెట్టుకున్నావా?

కొడుకు: దేవుడికి మొక్కానమ్మా.

అమ్మ: ఏమని మొక్కుకున్నావు?

కొడుకు: నా పక్కన ఎవరు కూర్చున్నా నాకు రాని జవాబులు అన్నీ వాళ్లు చూపించాలని.

అమ్మ: ఆ...???

ఆఫీసులో వీలవదుగా!

మోహన్: డాక్టర్‌గారూ, నాకు ఈ మధ్య సరిగ్గా నిద్ర పట్టడం లేదు అన్నాడు.

డాక్టర్: నేను రాసిన టాబ్లెట్స్ వేసుకొని లైట్లన్నీ ఆఫ్ చేసి పడుకుంటే చక్కగా నిద్ర పడుతుంది.



మోహన్: మరి మా ఆఫీసులో లైట్లు ఆఫ్ చేస్తే మిగతావాళ్లు పని ఎలా చేసుకుంటారు?

కంప్లీట్-ఫినిష్

పల్లెటూరి భార్య కావాలని పట్టుబట్టి పెళ్లి చేసుకున్నాడు వెర్రి వెంగళప్ప. నగరంలో కాపురం పెట్టాక భార్యను ఇంగ్లీషు నేర్చుకోమని పట్టుబట్టి స్పోకెన్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించాడు.

ఒకరోజు "ఏమండీ, కంప్లీట్‌కి, ఫినిష్‌కి తేడా ఏమిటండీ?" అడిగింది, భర్తను.

"నువ్వు నన్ను పెళ్లి చేసుకున్నందువల్ల నీ జీవితం కంప్లీట్ అయింది. నేను నిన్ను పెళ్లి చేసుకున్నందువల్ల నా జీవితం ఫినిష్ అయింది.. అదే తేడా.

భార్య తెల్ల మొహం వేసింది.

అమ్మలొస్తారు..

"నాన్నా, నన్ను రోజూ మీరే స్కూలుకి ఎందుకు తీసుకొస్తారు?" అడిగాడు టింకు, తండ్రిని.

"మీ క్లాస్‌మేట్స్‌ని చాలా మంది పిల్లలను దింపడానికి వాళ్ల అమ్మలొస్తారుగా!"

టింకు ఏమీ అర్థంకాక బుర్ర గోక్కున్నాడు.

నాకూ అత్తారిల్లేగా!

అత్తారింటికి వచ్చిన అల్లుడు ఎంతకీ తిరిగి వెళ్లేలా కనిపించలేదు. ఇక ఉండబట్టలేక ఒకరోజు "అల్లుడుగారూ, మీరొచ్చి చాలా నెలలైంది కదా, ఇంటి దగ్గర ఎక్కడి పనులు అక్కడే ఉండిపోతాయేమో, ఎప్పుడు వెళ్తారు?"

"మీ అమ్మాయి మా ఇంట్లో చాలా రోజులుగా ఉంటోందిగా, నేను మీ ఇంట్లో తప్పేంటి?"

"అది అమ్మాయికి అత్తారిల్లు.."

"ఇదీ నాకు అత్తారిల్లేగా..!"


వెక్కిరిస్తున్నారు..

చాలా రోజుల తరువాత స్నేహితుడిని చూడటానికి వాళ్లింటికి వెళ్లాడు కామేశం. అతడు వెళ్లేసరికి ఫ్రెండ్ నిలబడి తాపీగా భోజనం చేస్తూ కనిపించాడు.

"అదేంట్రా, చక్కగా కూర్చుని భోజనం చేయవచ్చుగా, ఎందుకలా నిలబడి తింటున్నావు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"భార్య సంపాదిస్తుంటే కూర్చుని తియిన్నానని నన్ను అందరూ ఎగతాళి చేస్తున్నారు. అందుకే నిలబడి తింటున్నాను.

సగం జీతమేగా!



భార్యా భర్తల విడాకుల కేసులో తీర్పు వచ్చింది. దాంతో రమేశ్ ఆ తీర్పును చాలా సంతోషంగా స్వీకరించాడు. దాంతో జడ్జి "అదేంటీ, అంత సంతోషంగా వున్నావు? నీ భార్యకు విడాకులు ఇచ్చినందువల్ల నీవు ఆమెకు ప్రతి నెలా నీ జీతంలోంచి సగం జీతం ఆమెకు ఇవ్వాలని చెప్పిన విషయం విన్నావా?"

"అయ్యో సార్, మీరు సగం జీతం అని చెప్పినందుకే నేను ఇంత సంతోషంగా ఉన్నాను. ఎందుకంటే ఇంతకుముందు పూర్తి జీతం తనే తీసుకునేది. ఇప్పుడు సగం జీతం అయినా నాకు మిగులుతోందిగా! అదీ నా సంతోషం.

జడ్జి ఆశ్చర్యపోయాడు.

తలనొప్పికి విరుగుడు?

"డాక్టరుగారూ, వారం రోజుల నుంచి భరించలేని తలనొప్పి. ఏదైనా మంచి మందు ఇవ్వండి, ఆఫీసులో పని కూడా చేయలేకపోతున్నాను" అన్నాడు పేషెంట్.

పేషెంట్‌ను పరీక్షించాక "నేనిచ్చే మాత్రలు మీ ఆవిడకు ఇవ్వండి. ఆ మాత్రలు వేసుకుని వేసుకుంటే మీ ఆవిడ చక్కగా నిద్రపోతుంది. దాంతో మీరూ నిద్ర పోవచ్చు" అన్నాడు, డాక్టరు.

"తలనొప్పి నాకు కదండీ, మాత్రలు మా ఆవిడకు...?"

"అదంతేలే.. నీకు తలనొప్పి తగ్గుతుందిగా!"

సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు.. వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080

sunmagvaartha@gmail.com

'సంఘీ' భావం



ఎల్ నినో ప్రభావంతో తాగునీటి కష్టాలు

ఎల్ నినో ప్రభావంతో ఒకపక్క పంటపొలాలకు, ఉద్యానవనాలకు తీరని నష్టం వాటిల్లగా తాజాగా తాగునీటి కష్టాలు కూడా ఎదురుకానున్నాయి. ఇప్పటికే హైదరాబాద్‌తో పాటు పలు తెలంగాణ జిల్లాల్లో, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు మొదలయ్యాయి. హాస్టళ్లను మూసివేస్తున్నారు. ఎక్కువ నీటిని వినియోగించే పరిశ్రమలకు ఆంక్షలు విధిస్తున్నారు. ప్రధానంగా నైరుతి రుతుపవనాల సమయంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో జలవనరులపై ఒత్తిడి పెరుగుతోంది.

వర్షాభావ పరిస్థితులు, జలాశయాల్లో తగ్గుతున్న నీటి నిల్వలు, భూగర్భ జలమట్టాలు పడిపోవడం రానున్న రోజుల్లో తాగునీటి సమస్యకు దారితీసే ప్రమాదం ఉందని పరిస్థితులు సూచిస్తున్నాయి. భూమధ్యరేఖ సమీపంలోని పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఏర్పడే ఎల్ నినో పరిస్థితులు భారత రుతుపవనాలపై ప్రభావం ఎక్కువగానే చూపుతున్నాయి. సాధారణంగా రుతుపవనాల బలహీనత, వర్షాల పంపిణీలో అసమానతలు, దీర్ఘకాలిక వర్ష విరామాలు ప్రమాదం ఏర్పడింది. తెలంగాణలో ఈ ఏడాది జూన్ 1 నుంచి అక్టోబరు 31 వరకు కేవలం 628.2 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. సాధారణంగా ఈ కాలంలో 830.7 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 24 శాతం లోటు నమోదైంది. అక్టోబర్‌లో వర్షాల లోటు దాదాపు 86 శాతానికి చేరడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 18 జిల్లాలు సాధారణం కంటే తక్కువ వర్షపాతాన్ని నమోదు చేసుకున్నాయి. 358 మండలాలను ప్రాథమికంగా కరవు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించగా, 324 మండలాల్లో భూగర్భ జలమట్టాలు ఆందోళనకర స్థాయికి చేరినట్లు అక్టోబరు చివరి వారంలో వచ్చిన నివేదికలు వెల్లడించాయి. మరోవైపు రాష్ట్రంలోని ప్రధాన, మధ్యతరహా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం తాగునీటి సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉంది. మిషన్ భగీరథ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు సరఫరా చేసే నీటి వనరులను కాపాడుకోవడం ప్రభుత్వానికి సవాలుగా మారుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ పరిస్థితి భిన్నంగా లేదు. ముఖ్యంగా రాయలసీమ, దక్షిణ కోస్తా ప్రాంతాల్లో వర్షాల లోటు, అధిక ఉష్ణోగ్రతలు నీటి వనరులపై ప్రభావం చూపుతున్నాయి. గత నెల మొదటి వారంలో వెలువడిన నివేదిక ప్రకారం 46 శాతం లోటు వర్షపాతం నమోదైంది. అర్నబ్, మురసు తుపానులతో ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తాలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. అయితే రాయలసీమ కరవు పరిస్థితిలో మాత్రం మార్పు కనిపించలేదు. కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చే నీటి ప్రవాహాలు, శ్రీశైలం, నాగార్జునసాగర్, సోమశిల, కండలేరు వంటి జలాశయాల్లో నిల్వలు రానున్న తాగునీటి అవసరాలకు కీలకం కానున్నాయి. ఇప్పటికే కృష్ణా జలాల వినియోగంపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య చర్చల్లో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు సూచించింది. ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ అధికారులు కూడా తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ, అందుబాటులో ఉన్న నీటిని గ్రామాలు, పట్టణాలు, నగరాలకు వచ్చే ఏడాది జూన్ వరకు సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

హైదరాబాద్ నగరానికి ప్రధానంగా నాగార్జునసాగర్, సింగూరు, మంజీరా, ఎల్లంపల్లి తదితర నీటి వనరుల నుంచి నీరు అందుతుంది. వీటిలో నీటి నిల్వలు తగ్గుతూ రావడంతో నగరానికి నీటి సరఫరాపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. విజయవాడతో పాటు ఇతర పట్టణాల్లోనూ కృష్ణా నది నీటి లభ్యత కీలకం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత సున్నితంగా మారవచ్చు. బోర్లు, బావులు, చెరువులపై ఆధారపడే గ్రామాల్లో భూగర్భ జలాలు పడిపోతే తాగునీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సి రావచ్చు. పశువులకు నీరు అందించడం కూడా సమస్యగా మారే ప్రమాదం ఉంది.

రానున్న వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇప్పటి నుంచే తాగునీటి కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవడంలో నిమగ్నమై ఉన్నాయి. ముఖ్యంగా తాగునీటి అవసరాలకు ప్రత్యేక నీటి నిల్వలను కేటాయించడం, గ్రామాల్లో పాడైన బోర్లను మరమ్మతు చేయడం, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సిన ప్రాంతాలను ముందుగానే గుర్తించడం, చెరువులు, కుంటల్లో నీటిని సంరకించడం వంటి చర్యలు చేపట్టాలి. వర్షపు నీటి సంరక్షణను ప్రోత్సహించడం వంటి చర్యలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మొత్తానికి ఎల్‌నినో ప్రభావం కేవలం వ్యవసాయానికే పరిమితం కాకుండా తాగునీటి భద్రతకు కూడా సవాలుగా మారుతోంది. ఈ ఏడాది వర్షాల లోటు, జలాశయాల్లో తగ్గిన నిల్వలు, పడిపోతున్న భూగర్భ జలాలు నీటి లభ్యతపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటి నుంచే ప్రభుత్వాలు అప్రమత్తమై నీటి నిర్వహణ చేపట్టకపోతే తెలుగు రాష్ట్రాల్లోని అనేక గ్రామాలు, పట్టణాలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్‌స్టోరీ

రుద్రరాజు శ్రీనివాసరాజు

లైబ్రరీలే దారి దీపాలు

సవాళ్లేమిటి? అనే అంశాలపై ఈ వారం కవర్ స్టోరీ.

కప్పుడు పల్లెపల్లెనా అక్షర జ్యోతులు వెలిగించిన విజ్ఞాన నిలయాలు స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల ఆలోచనలను రగిల్చిన చైతన్య కేంద్రాలు. ఎందరో మహానుభావులను, పండితులను, పరిపాలనా దక్షులను, విద్యావేత్తలను తీర్చిదిద్దిన అక్షర కర్మాగారాలు. అయితే నేడు డిజిటల్ విప్లవపు హోరులో, పాలకుల నిర్లక్ష్యపు నీడల్లో, నిధుల కొరతతో క్రమంగా మనుగడ కోల్పోయే స్థితికి చేరుకున్నాయి.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ఆవిర్భావం

భారతదేశంలో గ్రంథాలయాల ప్రాధాన్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలనే ఉద్దేశంతో 'ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్' (ILA) 1968 నుండి అధికారికంగా ప్రతి సంవత్సరం నవంబర్ 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను (National Library Week) నిర్వహించడం ప్రారంభించింది.

స్వతంత్ర భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినమైన నవంబర్ 14 (బాలల దినోత్సవం) నాడు ప్రారంభించి, వారం రోజుల పాటు విద్యార్థులు, యువత, మేధావులను పుస్తక పఠనం వైపు ఆకర్షించేలా ఈ కార్యక్రమాలను రూపొందించారు. నాటి నుంచి నేటి వరకు ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని జిల్లా కేంద్ర, శాఖా గ్రంథాలయాల్లో 'జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు' ఘనంగా జరుగుతుంటాయి. రంగురంగుల ముగ్గులు, కవితా పోటీలు, ప్రముఖుల ప్రసంగాలు, పుస్తక ప్రదర్శనలు, వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు, క్విజ్‌లు, సాహితీ సమావేశాలు, విద్యార్థులకు బహుమతుల ప్రదానం.. గ్రంథాలయాల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయడం, పఠనాసక్తిని పెంపొందించడం, యువతను పుస్తకాలకు చేరువ చేయడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం.

వారం రోజుల పాటు ఈ సందడి కనిపిస్తుంది. కానీ, ఆ ఏడు రోజుల పండుగ ముగియగానే మళ్లీ అదే దుమ్ముపట్టిన పుస్తకాలు, కూలబడేందుకు సిద్ధంగా ఉన్న కుర్చీలు, వెలవెలబోయే రీడింగ్ రూములు దర్శనమిస్తాయి. అసలు ఈ గ్రంథాలయాల ఉద్యమ నేపథ్యమేమిటి? నేటి సమాజంలో వాటి మనుగడ ఎదుర్కొంటున్న



గ్రంథాలయ రంగానికి సంబంధించిన చారిత్రక సమాచారం ప్రకారం, 1919 నవంబర్ 14, 15 తేదీల్లో అప్పటి మద్రాసులో జరిగిన అఖిల భారత ప్రజా గ్రంథాలయాల మహాసభ భారత గ్రంథాలయ ఉద్యమ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచింది. ప్రజల భాగస్వామ్యంతో గ్రంథాలయ వ్యవస్థను విస్తరించాలనే ఆలోచనకు ఈ సమావేశం బలాన్ని ఇచ్చింది. అనంతరం 1968 నుంచి నవంబర్ 14-20 తేదీల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణకు ఆమోదం లభించినట్లు గ్రంథాలయ రంగానికి సంబంధించిన ప్రమరణలు పేర్కొంటున్నాయి. గ్రంథాలయ వారోత్సవాల వెనుక ఉన్న మౌలిక ఆశయం మాత్రం ఒక్కటే. పుస్తకాలు కొద్దిమంది సంపన్నులకో, ఉన్నత విద్యావంతులకో మాత్రమే పరిమితం కాకూడదు. ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో, ప్రతి సామాజిక వర్గానికి అందుబాటులో ఉండాలి. ఆర్థిక పరిస్థితులు చదువుకు అడ్డంకిగా మారకూడదు. విజ్ఞానం అందరికీ అందుబాటులో ఉండాలనే ప్రజాస్వామిక భావన ఈ ఉద్యమానికి పునాది అని చెప్పాలి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు చదివే ప్రదేశాలుగా కాకుండా, దేశభక్తి, స్వరాజ్య భావన, సామాజిక సంస్కరణలపై చర్చలు జరిగే వేదికలుగా పనిచేశాయి. తెలుగు పత్రికలు, సాహిత్య గ్రంథాలు, చరిత్ర పుస్తకాలు ప్రజలకు చేరువయ్యాయి. అనేక ప్రాంతాల్లో గ్రంథాలయాల చుట్టూ యువక సంఘాలు, సాహితీ వేదికలు, వయోజన విద్యా కార్యక్రమాలు ఏర్పడ్డాయి.

గ్రంథాలయ ఉద్యమ పితామహుడు

తెలుగు రాష్ట్రాల్లో గ్రంథాలయ ఉద్యమం గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తుకు వచ్చే పేరు అయ్యంకి వెంకట రమణయ్య. ఆంధ్రదేశంలో ప్రజా గ్రంథాలయ ఉద్యమానికి ఆయన చేసిన సేవలు అపారమైనవి. అందుకే ఆయనను గ్రంథాలయ ఉద్యమ పితామహుడిగా, భారత ప్రజా గ్రంథాలయ ఉద్యమానికి మార్గదర్శకుల్లో ఒకరిగా గౌరవిస్తారు. 1911లో రామమోహన్ గ్రంథాలయ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, 1914లో ఏర్పాటైన ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘం అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలను స్థాపించడం, గ్రంథాలయ సమావేశాలు

నిర్వహించడం, పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, వయోజన విద్యకు గ్రంథాలయాలను అనుసంధానించడం వంటి అనేక కార్యక్రమాలను చేపట్టారు.

1919లో మద్రాసులో జరిగిన అఖిల భారత ప్రజా గ్రంథాలయాల మహాసభ నిర్వహణలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. గ్రంథాలయాల ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఆయన చేసిన కృషి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. 1972లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేసింది.

అయితే గ్రంథాలయ ఉద్యమం ఒక్క వ్యక్తి కృషితోనే రూపుదిద్దుకోలేదు. ఈయనతో పాటు అనేకమంది సాహితీవేత్తలు, సంఘసంస్కర్తలు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు తమవంతు సేవలు అందించారు.

గ్రంథాలయ ఉద్యమానికి బాటలు వేసిన మరికొందరు మహనీయులు

గాడిచర్ల హరిసర్వోత్తమరావు: తెలుగు భాషలో విజ్ఞానాన్ని విస్తరించడం, జాతీయ చైతన్యాన్ని పెంపొందించడం, ప్రజలను విద్యావంతులను చేయడం వంటి లక్ష్యాలతో పనిచేసిన ఆయన గ్రంథాలయ ఉద్యమానికీ మద్దతునిచ్చారు. మాతృభాషలో మంచి సాహిత్యాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రజల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి కృషి చేశారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం: సాహితీవేత్తగా, సంఘసంస్కర్తగా ప్రసిద్ధి చెందిన ఆయన గ్రంథాలయాల ప్రాముఖ్యాన్ని బలంగా చాటారు. 1914లో విజయవాడలో జరిగిన తొలి ఆంధ్రదేశ గ్రంథభాండాగారుల మహాసభకు అధ్యక్షత వహించారు. ప్రతి గ్రామంలో చెరువులు, బావులు ఉన్నట్లే గ్రంథాలయాలు కూడా ఉండాలని ఆయన ఆకాంక్షి ంచారు.

వావిలాల గోపాలకృష్ణయ్య: గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన చట్టపరమైన, సంస్థాగత ఏర్పాట్ల కోసం కృషి చేశారు. 1929లో సత్తెనపల్లిలో శారదా గ్రంథాలయాన్ని ప్రారంభించి, గ్రంథాలయాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వానికి పలు సూచనలు అందించారు. ప్రజా గ్రంథాలయ చట్టాల రూపకల్పనకు సంబంధించిన చర్చల్లోనూ ఆయన భాగస్వాములయ్యారు.

జస్టిస్ గోపాలరావు ఏక్‌బోటే: హైదరాబాద్ రాష్ట్రంలో గ్రంథాలయ చట్టం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో 1955లో హైదరాబాద్ రాష్ట్ర ప్రజా గ్రంథాలయ చట్టం ఆమోదం పొందడానికి కృషి చేశారు.

ఈ మహనీయుల సేవలను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. గ్రంథాలయ ఉద్యమం అనేది పుస్తక పఠనానికి మాత్రమే సంబంధించినది కాదు. అది విద్య, సామాజిక సంస్కరణ, ప్రజాస్వామ్యం, మాతృభాషా వికాసం, సమాన అవకాశాల కోసం సాగిన విస్తృత ఉద్యమం అని స్పష్టమవుతుంది.

స్వాతంత్రం అనంతరం గ్రంథాలయ వ్యవస్థకు చట్టబద్ధమైన పునాది ఏర్పడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1960 ఏప్రిల్ 1 నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రజా గ్రంథాలయాల చట్టం అమలులోకి వచ్చింది. ఆంధ్ర ప్రాంతంలో అప్పటికే ఉన్న మద్రాసు ప్రజా గ్రంథాలయాల చట్టాన్ని, తెలంగాణ ప్రాంతంలో అమలులో ఉన్న హైదరాబాద్ ప్రజా గ్రంథాలయాల చట్టాన్ని సమన్వయపరచి ఈ సమగ్ర చట్టాన్ని రూపొందించారు. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తమ తమ పరిపాలనా వ్యవస్థల ద్వారా గ్రంథాలయాలను నిర్వహిస్తున్నాయి. తెలంగాణలోనూ 1960 నాటి చట్టాన్ని రాష్ట్రానికి అనుగుణంగా స్వీకరించారు.



ఒకప్పుడు ఇంట్లో పుస్తకాలు కొనుక్కునే ఆర్థిక స్థోమత లేని విద్యార్థులకు గ్రంథాలయమే ప్రధాన ఆధారం. పాఠ్యపుస్తకాలకు అదనంగా చరిత్ర, విజ్ఞానశాస్త్రం, సాహిత్యం, జీవిత చరిత్రలు చదివే అవకాశం అక్కడే లభించేది. దినపత్రికలు, వారపత్రికలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు చదువుతూ విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేవారు.

గ్రామీణ ప్రాంతాల్లోని అనేకమంది యువకులు ఉద్యోగాల కోసం సిద్ధమయ్యేటప్పుడు గ్రంథాలయాల్లో గంటల తరబడి చదివేవారు. కొందరికి గ్రంథాలయం చదువుకునే గది; మరికొందరికి అది జీవితాన్ని మార్చుకునే వేదిక. ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, రచయితలు, పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులుగా ఎదిగిన అనేకమంది తమ విద్యాభ్యాసంలో గ్రంథాలయాల పాత్రను గుర్తు చేసుకుంటుంటారు.

గ్రంథాలయంలో సభ్యత్వం పొందిన వ్యక్తికి వేల రూపాయలు వెచ్చించి పుస్తకాలు కొనాల్సిన అవసరం లేకుండా విజ్ఞానం అందుబాటులో ఉండేది. ఒకే పుస్తకాన్ని అనేకమంది చదివే అవకాశం ఉండేది. ఒకరి అనుభవం మరొకరికి జ్ఞానంగా మారేది.

కుటుంబ ప్రోత్సాహం, పాఠశాల విద్య, వ్యక్తిగత కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వంటి అంశాలతో పాటు గ్రంథాలయాలు కూడా అనేకమంది జీవితాల్లో కీలక పాత్ర పోషించాయి. అయితే ఇప్పుడు చాలా వరకు జిల్లా కేంద్ర గ్రంథాలయాల్లో కనిపించే రద్దీని చూసి గ్రంథాలయాలకు పూర్వవైభవం

> – మంచి మాటయే గొప్ప అలంకారం. ఆభరణాలన్నీ నశిస్తాయి కానీ వాక్కు అనే ఆభరణం ఎన్నటికీ నశించదు. – **భర్తృహరి**
>
> – ముఖాలు పుస్తకాలంత స్పష్టంగా ఉంటాయి. కనుక వాటిని కొద్ది సమయంలో సులువుగా అధ్యయనం చేయడానికే గాక, అపార్థం చేసుకోవడానికి కూడా అవకాశాలు తక్కువగా ఉంటాయి.
>
> – ఎఫ్.సుందర్స్

వచ్చిందని భ్రమపడలేం. అక్కడ కూర్చునే వారిలో 95 శాతం మంది గ్రూప్స్, డీఎస్సీ, ఎస్సై, బ్యాంకింగ్ వంటి ఉద్యోగాల కోసం సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువతే. వారు గ్రంథాలయంలోని సాహిత్యాన్నో, విజ్ఞానాన్నో చదవడం లేదు; తమ సొంత కోచింగ్ మెటీరియల్స్ చదువుకోవడానికి ఒక ఉచిత స్టడీ హాల్‌గా మాత్రమే దాన్ని వినియోగించుకుంటున్నారు. ఉద్యోగం రాగానే వారు అటువైపు చూడటం మానేస్తున్నారు. సాహిత్య, వైజ్ఞానిక పఠనం దాదాపుగా అంతరించిపోతోంది.

గ్రంథాలయాల ప్రాధాన్యం తగ్గుతోందా?

స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ విద్యా వేదికలు విస్తరించిన నేపథ్యంలో పుస్తక పఠన అలవాట్లలో మార్పులు రావడం సహజం. ఒకప్పుడు దినపత్రిక కోసం గ్రంథాలయానికి వెళ్లిన వ్యక్తి నేడు మొబైల్‌లోనే వార్తలు చదువుతున్నాడు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థి ఆన్‌లైన్ తరగతులు, డిజిటల్ నోట్స్, వీడియో ఉపన్యాసాలను ఉపయోగిస్తున్నాడు. ఈ పరిణామంతో



సంప్రదాయ గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య కొన్ని చోట్ల తగ్గింది అనే మాట వాస్తవం. అయితే ఇంటర్నెట్ ద్వారా అన్ని సందర్భాలలో విశ్వసనీయ సమాచారం లభిస్తుందని చెప్పలేం. ఎందుకంటే ఈ రోజుల్లో సామాజిక మాధ్యమాల్లో ఎన్నో తప్పుడు సమాచారాలు, అసంపూర్ణ వివరాలు, నిర్ధారణ లేని ప్రచారాలు విస్తరిస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో విశ్వసనీయమైన పుస్తకాలు, ప్రామాణిక పత్రికలు, పరిశోధనా గ్రంథాలు, నిపుణుల రచనలను అందించే గ్రంథాలయాల ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పాలి. అలా అని డిజిటల్ సమాచారాన్ని పూర్తిగా కాదనలేం. కానీ సామాజిక మాధ్యమాల్లో కొన్ని సెకన్లలో అనేక విషయాలను చూడటానికి అలవాటు పడిన మనిషికి ఒకే అంశంపై గంటసేపు దృష్టి నిలపడం కష్టంగా అనిపించవచ్చు. కానీ దీనిని ఒక తరం స్వభావంగా నిర్ణయించకూడదు. యువతకు ఆసక్తికరమైన పుస్తకాలు, చదివే స్నేహితుల సమూహాలు, చర్చా వేదికలు, పఠనానికి ప్రోత్సాహం లభిస్తే వారి అలవాట్లు మారవచ్చు.

పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడం అంటే సాంకేతికతను నిందించడం కాదు. సాంకేతికతతో పోటీపడేలా పుస్తకాలను మరింత ఆసక్తికరంగా, అందుబాటులో ఉండేలా చేయగలగాలి. పుస్తక పఠనం ఏకాగ్రత, భాషా పరిజ్ఞానం, పదసంపద, విమర్శనాత్మక ఆలోచన, ఊహాశక్తి అభివృద్ధికి తోడ్పడుతుంది. ఒక అంశాన్ని విస్తృతంగా అర్థం చేసుకోవడానికి, విభిన్న వాదనలను పోల్చి చూడడానికి, రచయిత ఆలోచనలతో సంభాషించడానికి పుస్తకం అవకాశం కల్పిస్తుంది.

మొత్తం మీద పుస్తకం, డిజిటల్ తెర పరస్పర విరోధాలు కావు. రెండింటినీ సమన్వయపరిచినప్పుడే ఆధునిక గ్రంథాలయానికి నిజమైన అర్థం ఏర్పడుతుంది.

గ్రంథాలయాలను కాపాడటంలో ప్రభుత్వాల బాధ్యత

గ్రంథాలయాల అభివృద్ధిలో అత్యంత కీలకమైన అంశం నిధులు. గ్రంథాలయాలు రాజ్యాంగంలోని రాష్ట్ర జాబితా పరిధిలో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వాలే ప్రధానంగా ప్రజా గ్రంథాలయాల నిర్వహణ బాధ్యతను నిర్వర్తిస్తాయి. కేంద్రం ఆధ్వర్యంలోని రాజా రామ్మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ వివిధ పథకాల ద్వారా గ్రంథాలయాల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందిస్తుంది. నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్ కింద కూడా ఎంపిక చేసిన గ్రంథాలయాలకు సహాయం అందించే వ్యవస్థ ఉంది.

ప్రజా గ్రంథాలయాల చట్టాల ప్రకారం స్థానిక ప్రభుత్వాలు వసూలు చేస్తున్న ఆస్తిపన్ను లేదా ఇంటిపన్నుపై అదనపు మొత్తంగా వసూలు చేసే గ్రంథాలయ సెస్ ద్వారా సమకూరే నిధులు జిల్లా గ్రంథాలయ సంస్థలకు చేరి గ్రంథాలయాల అభివృద్ధికి ఉపయోగపడాలి. ఆంధ్రప్రదేశ్ ప్రజా గ్రంథాలయాల చట్టంలోని సెక్షన్ 20 గ్రంథాలయ సెస్ వసూలు, చెల్లింపుల గురించి పేర్కొంటుంది. సెక్షన్ 21 ప్రకారం గ్రంథాలయ సెస్, విరాళాలు, ప్రత్యేక ప్రభుత్వ గ్రాంట్లు తదితరాలు జిల్లా గ్రంథాలయ సంస్థ నిధిలో జమ కావాలి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పౌర గ్రంథాలయాల చట్టాల ప్రకారం పురపాలక సంఘాలు నగర పాలక సంస్థలు గ్రామ పంచాయతీలు వసూలు చేసే ఆస్తి పన్నులో ప్రతి రూపాయికి 8 పైసలు గ్రంథాలయ సెస్ రూపంలో వసూలు చేసి, ఆ మొత్తాన్ని నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థలకు జమ చేయాలి.

అంటే పౌరులు తాము చెల్లించే ఆస్తిపన్నులో భాగంగా చెల్లించే సెస్ కేవలం సాధారణ ఆదాయంగా పరిగణించాల్సినది కాదు. అది గ్రంథాలయ సేవలకు వినియోగించాల్సిన నిర్దిష్ట ప్రయోజనం కలిగిన నిధి. ఈ సెస్ రూపంలో లభించే నిధులు ద్వారానే ఎప్పటికప్పుడు పుస్తకాలు కొనుగోలు చేయడం, పాత పుస్తకాలను సంరక్షించడం, ఇంటర్నెట్ సౌకర్యం, సిబ్బంది వేతనాలు, వంటి ఖర్చులకు ఈ నిధులు అవసరమవుతాయి. ఇక్కడ రాష్ట్రాలు గ్రంథాలయ అభివృద్ధిలో తమ బాధ్యతను నిర్వర్తిస్తూనే కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. ఈ నిధులు సరిపోకపోయినా లేదా వాటిని సరైన రీతిలో ఖర్చు చేయకపోయినా వాటి సేవల నాణ్యత క్రమంగా దెబ్బతింటుంది.

కొత్త పుస్తకాలు కొనలేకపోతే పాఠకుల ఆసక్తి తగ్గుతుంది. సిబ్బంది కొరత ఉంటే గ్రంథాలయ నిర్వహణలో సమస్యలు తలెత్తుతాయి. అయితే వాస్తవంలో వీటికి నిధుల కొరత ఉండదు. కానీ వీటి అభివృద్ధి పేరిట వసూలు చేసే సెస్ మాత్రం వీటికి పూర్తిగా చేరడం లేదు. ముఖ్యంగా స్థానిక సంస్థల నుంచి గ్రంథాలయాలకు రావాల్సిన కోట్లాది

రూపాయల సెస్ బకాయిలు రోజు రోజుకూ పేరుకు పోతున్నాయి. ఎందుకంటే స్థానిక సంస్థలు వసూలు చేసిన మొత్తంలో సెస్ భాగాన్ని ఎప్పటికప్పుడు బదిలీ చేయకుండా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ ప్రయోజనాలకు వాడటం అనేది పరిపాటిగా మారిపోయింది.

ఈ సమస్య పరిష్కారానికి స్థానిక సంస్థలు వసూలు చేసే ఆస్తి పన్నులోని గ్రంథాలయ సెస్‌ను నేరుగా ఆర్థిక శాఖ ద్వారా ఆటోడెబిట్ విధానంలో జిల్లా గ్రంథాలయ సంస్థల ఖాతాల్లోకి జమ చేయగలిగితే గ్రంథాలయాల నిధుల కొరత చాలా వరకు పరిష్కారం అవుతుంది.

ఈ విషయంలో గ్రంథాలయాలను ప్రభుత్వానికి ప్రత్యక్ష ఆదాయాన్ని తెచ్చిపెట్టే వాణిజ్య సంస్థలుగా ప్రభుత్వాలు భావించకూడదు. వాటిపై వెచ్చించే ప్రతీ పైసా ప్రయోజనం దీర్ఘకాలంలో అద్భుత ఫలితాలు అందిస్తాయి. ఎందుకంటే విద్యావంతులైన పౌరులు, ఆలోచనాపరులైన యువత, సమాచారాన్ని విశ్లేషించగల ప్రజలు, ప్రజాస్వామిక విలువలను అర్థం చేసుకునే సమాజం రూపుదిద్దుకోవడంలో గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడతాయి.



అందువల్ల గ్రంథాలయాలకు చేసే ఖర్చును అనుత్పాదక వ్యయంగా కాకుండా ప్రజల మేధో వికాసానికి చేసే పెట్టుబడిగా మాత్రమే ప్రభుత్వాలు చూడాలి.

అరకొర నిధుల కేటాయింపుతో పాఠకులకు అవసరమైన పుస్తకాలను అందించలేకపోతున్నాయి. ఈ విషయంలో చదువరుల సంఘ సభ్యుల ప్రేరణతో స్థానిక విద్యావంతులు, పూర్వ విద్యార్థులు, వ్యాపారవేత్తలు గ్రంథాలయాల కోసం నిధులు సమకూర్చడం అభినందనీయం.



అయితే దాతల సహకారం ప్రభుత్వ బాధ్యతకు ప్రత్యామ్నాయం కానే కాదు. దాతలు ఇచ్చే పుస్తకాలు గ్రంథాలయ విధానానికి, పాఠకుల అవసరాలకు అనుగుణంగా ఉండాలి. ఉపయోగం లేని పాత పుస్తకాలను పెద్ద మొత్తంలో అందించడం కన్నా, అవసరమైన నాణ్యమైన పుస్తకాలను ఎంపిక చేసి ఇవ్వడం ద్వారా ఎంతో మేలు జరుగుతుంది. అంటే గ్రంథాలయంలో పుస్తకాల సంఖ్య ఎంత ఉందన్నదానికంటే, పాఠకులకు అవసరమైన పుస్తకాలు ఎంతవరకు అందుబాటులో ఉన్నాయన్నది ముఖ్యం.

ప్రభుత్వాలు ఒకసారి వేల పుస్తకాలు కొనుగోలు చేసి పదేళ్లపాటు కొత్త పుస్తకాలు తీసుకురాకపోతే గ్రంథాలయం కాలానుగుణంగా వెనుకబడిపోవడం ఖాయం. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సంబంధించిన పాత గ్రంథాలతో పాటు తాజా సమాచారంతో కూడిన పుస్తకాలు ఎప్పటికప్పుడు ఏర్పాటు చేయాలి.

రీడర్స్ ఫోరమ్‌ల పాత్ర

ఒకప్పుడు శాఖా గ్రంథాలయాలలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీగా రీడర్స్ ఫోరమ్‌లు, చాలా చురుకుగా పనిచేసేవి. ఈ ఫోరమ్‌లు గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలు సమకూర్చడం, పాఠకుల సంఖ్య పెంచడం, సాహితీ కార్యక్రమాలు నిర్వహించడం వంటి పనులు నిర్వహించేవి. ఇప్పుడు ప్రభుత్వం వీటి ఏర్పాటు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడం వలన కేవలం కొన్ని గ్రంథాలయాలలో మాత్రమే ఈ ఫోరంలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయని చెప్పవచ్చు. ఎక్కడైతే రీడర్స్ ఫోరమ్‌లు సమర్థవంతంగా పని చేస్తాయో అక్కడే గ్రంథాలయాలు ప్రభుత్వాల నుంచి రావలసిన సెస్ రాబట్టడంతో పాటు గ్రంథాలయ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి వాటి అభివృద్ధికి దోహద పడగలుగుతాయి. గ్రంథాలయాల ఏర్పాటు ప్రభుత్వ బాధ్యతే అయినా వాటి విజయం వెనుక ప్రజల భాగస్వామ్యం రీడర్స్ ఫోరమ్ కృషి సమిష్టిగా ముందుకు వెళ్లినప్పుడే గ్రంథాలయాల అభివృద్ధి సాధ్యమవుతుంది.

గ్రంథాలయ వారోత్సవాలు

గ్రంథాలయం అంటే పాత పుస్తకాలు దుమ్ము పట్టి ఉండే భవనం కాదు. అది ఒక పేద విద్యార్థి ఆశకు చిరునామా. ఒక యువకుడి భవిష్యత్తుకు మార్గదర్శి. ఒక రైతుకు కొత్త విజ్ఞానాన్ని అందించే వేదిక. ఒక రచయిత ఆలోచనలకు ప్రేరణ. ఒక ప్రజాస్వామిక సమాజానికి వివేకాన్ని అందించే కేంద్రం. దీనిని దృష్టిలో ఉంచుకుని గ్రంథాలయాలలో పాఠకుల సంఖ్యను పెంచడానికి ప్రేరణగా గ్రంథాలయాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనలు నిర్వహించడం, బహుమతులు అందించడం, సభలు ఏర్పాటు చేయడం మంచి సంప్రదాయమే. కానీ ఆ కార్యక్రమాల సందడి ముగిసిన తర్వాత కూడా గ్రంథాలయాల్లో పాఠకుల సందడి కొనసాగాలి. కొత్త పుస్తకాలు రావాలి. పిల్లలు చదవాలి. యువత అధ్యయనం చేయాలి. వృద్ధులు విజ్ఞానాన్ని పంచుకోవాలి. సమాజం ఆలోచనాపరంగా ఎదగాలి.

ప్రతి గ్రంథాలయం తన పరిధిలో కొత్త



పాఠకులను చేర్చుకునే లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. పాఠశాలలు, కళాశాలలతో అనుసంధానం చేసుకుని విద్యార్థులను గ్రంథాలయాలకు పరిచయం చేయాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాఠకుల అభిప్రాయాలు పోటీ పరీక్షలకు ఉపయోగ పడే గ్రంథాలు సమకూర్చాలి. అవసరమైన పుస్తకాల జాబితాను రూపొందించి స్థానిక దాతలు, రచయితలు, ప్రచురణ సంస్థల సహకారాన్ని పారదర్శకంగా వినియోగించాలి.

వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు ఇచ్చి కార్యక్రమాన్ని ముగించడం కన్నా, వచ్చే ఏడాది నాటికి సాధించాల్సిన లక్ష్యాలను ప్రకటించి వాటి ఫలితాలను ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకోవడం ద్వారా ఈ వారోత్సవాలు లక్ష్యం నెరవేరుతుంది.

గ్రంథాలయాల వారోత్సవాల నిజమైన విజయం ఏడు రోజుల వేడుకల్లో కాదు; ఏడాది పొడవునా పుస్తకాలను చదివే పాఠకుల సంఖ్య పెరగడంలో ఉంది.

పుస్తకాన్ని తెరిచినప్పుడు ఒక మనిషి ముందు కొత్త ప్రపంచం తెరుచుకుంటుంది. అలాంటి ప్రపంచాలను ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంచడమే ప్రజా గ్రంథాలయాల అసలైన లక్ష్యం.

డిజిటల్ గ్రంథాలయాల దిశగా అడుగులు

మారుతున్న నేటి, ఇప్పటి తరం అవసరాలకు అనుగుణంగా గ్రంథాలయాలు మారాల్సిన సమయం కూడా ఆసన్నమయ్యింది. గ్రంథాలయాలలో పుస్తకాలతో పాటు కంప్యూటర్లు, ఇంటర్నెట్, డిజిటల్ పుస్తకాలు, ఆన్‌లైన్ పత్రికలు, విద్యా వీడియోలు, పోటీ పరీక్షలకు సంబంధించిన విశ్వసనీయ వనరులు అందుబాటులోనికి తీసుకు రావలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రంథాలయాలలో డిజిటల్ సేవలు ప్రారంభించడంతో పాటుగా వాటిని నిర్వహించే సిబ్బందికి శిక్షణ, క్రమం తప్పకుండా సాఫ్ట్‌వేర్ నవీకరణలు, ఇంటర్నెట్ ఖర్చులు, పరికరాల నిర్వహణకు నిధులు సమకూర్చాలి.

గ్రంథాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలంటే ప్రజలు మళ్లీ పుస్తకాలు చదవాలని కోరుకోవడం మాత్రమే సరిపోదు. చదవడానికి అనుకూలమైన వాతావరణం కల్పించాలి. పిల్లలకు కథల పుస్తకాలు, యువతకు కెరీర్ మార్గదర్శనం, పోటీ పరీక్షల విద్యార్థులకు ప్రశాంతమైన అధ్యయన స్థలం, రైతులకు ఆధునిక వ్యవసాయ సమాచారం, వృద్ధులకు సాహిత్యం, మహిళలకు ఉపయోగకరమైన విజ్ఞాన వనరులు అందించాలి.



గ్రంథాలయాన్ని ఒక పుస్తక జారీ కేంద్రం నుంచి సమాజం కలుసుకునే, నేర్చుకునే, చర్చించే, పరిశోధించే వేదికగా అభివృద్ధి చేయాలి. స్థానిక రచయితలతో సమావేశాలు, పుస్తక సమీక్షలు, పఠన క్లబ్బులు, డిజిటల్ అక్షరాస్యత శిక్షణ, పిల్లల కథా కార్యక్రమాలు ఏడాది పొడవునా నిర్వహించాలి.

పాత గ్రంథాలను డిజిటలైజ్ చేయాలి; కొత్త పుస్తకాలను ముద్రిత రూపంలోనూ, అవసరమైన చోట డిజిటల్ రూపంలోనూ అందుబాటులోకి తీసుకురావాలి. పుస్తక పఠనాన్ని సాంకేతికతతో పోటీగా కాకుండా, పరస్పర సహకారంతో అభివృద్ధి చేయాలి. పుస్తకాన్ని కాపాడటం అంటే కాగితాన్ని కాపాడటం మాత్రమే కాదు. అందులోని ఆలోచనను, విజ్ఞానాన్ని, అనుభవాన్ని, తరతరాలకు అందించే సంప్రదాయాన్ని కాపాడటం. వాస్తవంగా చెప్పాలంటే గ్రంథాలయానికి ప్రత్యామ్నాయం ఆన్‌లైన్ పుస్తకం కాదు; గ్రంథాలయం అందించే విజ్ఞాన సేవలను డిజిటల్ సాంకేతికతతో మరింత విస్తరించడమే నిజమైన పరిష్కారం.

గ్రంథాలయాలు ఒక జాతి నాగరికతకు, సంస్కృతికి కొలమానాలు. "ఒక గ్రంథాలయాన్ని మూసివేయడం అంటే వంద బడులను మూసివేయడమే" అంటారు పెద్దలు. గ్రంథాలయాల నిజమైన పునరుజ్జీవనం భవనాల సంఖ్య పెరగడంలో మాత్రమే ఉండదు. వాటి తలుపులు తెరిచినప్పుడు లోపల పాఠకులు ఉండాలి.

కేవలం నవంబర్ నెల రాగానే వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహించి ఉపన్యాసాలు దంచి వెళ్లిపోవడం వల్ల ఈ సంస్థలు బతకవు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో నిధులు విడుదల చేసి, మౌలిక వసతులు కల్పించి, సమాజం కూడా తన బాధ్యతగా పుస్తక సంస్కృతిని కాపాడుకున్నప్పుడే అయ్యంకి, రంగనాథన్, గాడిచర్ల వంటి మహనీయుల కలలు నిజమవుతాయి; భావి తరాలకు అక్షర సంపద భద్రంగా అందుతుంది.

ప్రభుత్వాలు దానికి బలమైన పునాది వేయాలి. ప్రజలు దాన్ని సజీవంగా ఉంచాలి.గ్రంథాలయాలను కాపాడుకుందాం.. పఠన సంస్కృతిని పెంపొందిద్దాం.. విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి బాటలు వేద్దాం. ■

కార్తికంలో దీప ప్రాశస్త్యం

దీపావళి పండుగ దీపావళి మరునాటి నుంచి ఆరంభం అవుతుంది శివకేశవులకు ప్రీతికరమైన కార్తిక మాసం. నెల మొత్తం ప్రతి ఇంటి ముందు దీపాలు దేదీప్యమానంగా వెలుగుతుంటాయి. ఆలయాలు దీపకాంతులతో వెలిగిపోతూ ఆధ్యాత్మిక సౌరభాన్ని వెదజల్లుతుంటాయి. మంచు దుప్పటి కప్పుకున్న వాతావరణంలో దూరానికి మిణుకుమిణుకుమంటూ వెలిగే కార్తిక దీపాల కాంతి శోభాయమానంగా కనిపిస్తుంది.

కార్తిక మాసంలో దీపం ఎందుకు వెలిగించాలి? అసలు దీపం ఎందుకు వెలిగించాలి? దీపానికి ఉన్న ప్రాధాన్యత ఏమిటి? దీపప్రాశస్తం ఏమిటి ?

దీపం జ్యోతిః పరబ్రహ్మ

"శుభం కరోతి కళ్యాణం, ఆరోగ్యం ధన సంపద, శత్రు బుద్ధి వినాశాయ

దీప జ్యోతిర్ నమోస్తుతే, దీప జ్యోతిః పరబ్రహ్మ, దీపజ్యోతి జనార్ధ న

దీపో హరతి మే పాపం, దీప జ్యోతిర్ నమోస్తుతే".

ఈ శ్లోకానికి అర్థం "ఏ దీప జ్యోతి శుభాలు కలుగచేసి, మంచి ఆరోగ్యం ధనసంపదలు కలుగచేస్తుందో, సమస్త పాపాలను తొలగిస్తుందో ఏ దీప జ్యోతి పరబ్రహ్మ స్వరూపమో ఆ దీప లక్ష్మి కి ప్రణమిల్లుతున్నాము". హిందూ సంప్రదాయాల్లో దీపానికి అత్యంత ప్రాధాన్యత ఉన్నది.

శుభకార్యాలలో పరబ్రహ్మ స్వరూపమైన దీప ప్రజ్వలన తప్పనిసరి. హిందువుల గృహాలలో నిత్య దీపారాధన యుగయుగాలుగా వస్తున్న ఆచారం. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో దీపానికి ఉన్న ప్రాధాన్యత ఇంతని చెప్పలేం. హిందువులు దీపం వెలిగించకుండా ఏ కార్యక్రమం ప్రారంభించరు.. అంటే దీప ప్రాధాన్యత ఏమిటో అర్థం అవుతుంది.

దీపం అంటే కేవలం కాంతిని ఇచ్చేది కాదు. చీకట్లను మాత్రమే తొలగించేది కాదు. అంధకారం అంటే అజ్ఞానం. వెలుగు అంటే జ్ఞానం. మానవ జీవితాలు సక్రమంగా క్రమవిధానంలో నడవడానికి 'విషయ జ్ఞానం' అవసరం. నిత్యం ఉదయాస్తమాన సమయాలలో ఇంటి ప్రధాన ద్వారం వద్ద, పూజ మందిరం దగ్గర, తులసి వద్ద దీపం వెలిగించిన ఇల్లు ఆరోగ్యఐశ్వర్యాలతో తులతూగుతుంది అని పురాణాలు చెబుతున్నాయి. శాస్త్రాల ప్రకారం నిత్య దీపారాధన అనంత యాగఫలాన్ని కలుగచేస్తుంది అని చెబుతాయి. నూనె లేదా నేతితో వెలిగించే దీపంచుట్టూ ఒక సానుకూల శక్తిని ఏర్పరుస్తుంది. ప్రతికూల శక్తులు నశిస్తాయి. దాని వలన మనస్సు, శరీరం ప్రశాంతంగా ఉంటాయి. మనస్సును, శరీరాన్ని ఆవరించిన నైరాశ్యాన్ని తొలగించేది దీపకాంతి.

దీపాన్ని ఏ నూనెతో వెలిగించాలి,



ఎన్ని వత్తులు వేయాలి, ఏ దిశలో ఉంచాలి? అన్న సందేహాలను దూరం పెట్టి నిత్యం దీపారాదన చేయడం వలన కుటుంబ శ్రేయస్సు అభివృద్ధి చెందుతుంది. వివిధ కారణాల వలన నిత్య దీపారాధన కుదరనివారు కార్తికమాసంలో ఆలయాలలో మూడు వందల అరవై అయిదు వత్తుల నేతి దీపాన్ని ధ్వజస్తంభం లేదా నిర్ణయించిన ప్రదేశంలో వెలిగిస్తుంటారు. దాని వలన కూడా కార్తిక దీప ఫలితాన్ని పొందవచ్చు అని చెబుతారు.

కార్తిక మాసంలో దీపం ఎందుకు వెలిగించాలి? అన్నదానికి సమాధానాలు మన ఆధ్యాత్మిక గ్రంథాలలో పెద్దల ద్వారా తెలుస్తున్నాయి.

కార్తిక మాసం

సత్య యుగంతో సమానమూన యుగం, వేదాలకు సాటిరాగల శాస్త్రం గంగా నదికి సరిపోయే తీర్థం లేనట్లుగా కార్తిక మాసానికి సమమైన మాసం లేదని మన పురాణాలు నొక్కిచెప్పాయి.

చంద్రుడు కృత్తికా నక్షత్రంలో ఉన్న నెల కనుక కార్తిక మాసం అని పిలుస్తారు. కృత్తికా నక్షత్రం అగ్ని నక్షత్రం కనుక ఈ మాసంలో దీపారాధన, ఆకాశదీపం, అఖండ దీపం, దీపదానం చేయడం పుణ్యప్రదంగా చెప్పబడింది. హరిహరులకు ప్రియమాసం కార్తికం. ఈ నెలలో స్థితి లయకారులను ఆరాధించడం వలన ఇహ పర శుభాలు లభిస్తాయని శాస్త్ర వివరణ. కార్తిక పురాణం ఈ మాసంలో చేయవలసిన పూజల, నవ్రతాల వివరాలతో పాటు దీపారాధన విశేషాన్ని, దీపదాన ఫలితాన్ని సవివరంగా తెలుపుతోంది.

కార్తిక మాసం మొత్తం స్త్రీ, పురుషులు దీక్షగా ఉపవాసాలు చేస్తూ వ్రతాలూ, నోములు ఆచరిస్తుంటారు. ఆలయ సందర్శన తప్పనిసరిగా చేస్తారు. కార్తిక మాస పాడ్యమి, చవితి, పౌర్ణమి, చతుర్దశి, ఏకాదశి, ద్వాదశి రోజులలో చేసే పూజలు ఆదిదపతుల కృపాకటాక్షాలను సంపూర్ణంగా అందచేస్తాయి అన్నది తరతరాల విశ్వాసం. అందుకే ఈ నెలలో ఏ దీక్ష లేదా మంత్రోపదేశం తీసుకొన్నా పూర్తి నియంత్రణ, భక్తిశ్రద్ధలతో ఆచరిస్తే సంపూర్ణ ఫలితం లభిస్తుంది. మనోభీషాలు నెరవేరుతాయని చెబుతారు.

అభిషేక ప్రియుడు ఆశుతోషుడు అయిన పరమేశ్వరునికి చేసే అభిషేకాలు, బిల్వార్చనలు, రుద్రాభిషేకాలు, రుద్రుని ప్రసన్నం చేస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ నెలలో వచ్చే 'క్షీరాబ్ది' లేదా 'చిలుకు ద్వాదశి' నాడు నాలుగు నెలలుగా అంటే తొలి ఏకాదశి నాడు స్వీకరించిన యోగ నిద్ర నుండి శ్రీ మహావిష్ణువు ఈ రోజు మేల్కొంటారని చెబుతారు. శ్రీలక్ష్మి నారాయణుల అనుగ్రహం కోసం తులసి మొక్క వద్ద ఉసిరి కొమ్మ ఉంచి..

శ్రీ తులసీ కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. దీనివల్ల కుటుంబ శ్రేయస్సు, ఉన్నతి లభిస్తాయని నమ్ముతారు. నాగదోషంతో బాధపడుతున్నవారు ఈ నెలలో వచ్చే నాగుల చవితినాడు పుట్టలో పాలు పోసి ప్రార్థించడం వలన దోషాలు తొలగిపోతాయని చెబుతారు. కార్తిక మాసంలోనే నిత్యం ఉదయాస్తమయాలలో పూజ మందిరం, తులసి వద్ద దీపం వెలిగించడం, కుదిరితే ఆలయంలో, ఉసిరి చెట్టు వద్ద కూడా వెలిగించడం వలన సమస్త మనోభీష్టాలు నెరవేరతాయి.

జ్వాలా తోరణం

పౌర్ణమి రోజున అరుణాచలంలో గిరి మీద కృత్తికా దీపాన్ని వెలిగిస్తారు. కార్తిక దీపం చూడటానికి, గిరి ప్రదక్షిణ చేయడానికి లక్షలాది భక్తులు తిరువణ్ణామలై తరలి వస్తుంటారు. కార్తిక మాసంలో శివాలయాలు శోభ, అక్కడ భక్తుల చేసే సందడి గురించి చెప్పడానికి మాటలు చాలవు. దానికి తగినట్లుగానే ఏ నెలలోనూ జరగని ఉత్సవాలు, క్రతువులు, అభిషేకాలు నిర్వహిస్తారు.

అలాంటి వాటిల్లో మన తెలుగు రాష్ట్రాలలో ప్రధానంగా కనిపించేది 'జ్వాలా తోరణం'. పౌర్ణమి రోజున శివాలయాలలో ప్రత్యేకంగా కర్రలు, గడ్డితో జ్వాలా తోరణాన్ని ఏర్పాటు చేస్తారు. వెలుగుతున్న జ్వాలాతోరణం కింద నుండి ఉత్సవ మూర్తులను మూడుసార్లు తిప్పుతారు. భక్తులు కూడా జ్వాలా తోరణం కింది నుండి వెళతారు. అలా చేయడం వలన సమస్త పాపకర్మల తొలగిపోయి మరణానంతరం నరక బాధలు ఉండవని నమ్మకం. అందుకే జ్వాలా తోరణాన్ని 'యమ ద్వారం' అని కూడా పిలుస్తారు. జ్వాలా తోరణ బూడిదను ఇంటిలో ఉంచుకొంటే దుష్ట శక్తుల పీడ నుండి రక్షణ లభిస్తుంది అని విశ్వసిస్తారు.



ఆకాశ దీపం

హిందూ ధర్మం ప్రకారం ఆధ్యాత్మిక విధివిధానాల పరంగా కార్తిక మాసం ఆరంభం అయ్యే పాడ్యమి నాటి సాయంత్రం నుండి అన్ని ఆలయాలలో ధ్వజస్థంభానికి ఆకాశ దీపం వెలిగిస్తారు. ఇత్తడి కుండీలో నెయ్యి వేసి వెలిగించి సాయం సంధ్యాసమయంలో తాడుతో లాగి ధ్వజస్థంభానికి కడతారు. ఈ ఆకాశ దీపం శివ-కేశవుల తేజస్సును అనుగ్రహాన్ని సమస్త జీవరాశి మీద ప్రసరింపచేస్తుంది, అజ్ఞానాన్ని తొలగించి, జన్మాంతరం కైవల్యప్రాప్తి లభింపచేస్తుంది అన్నది భక్తుల విశ్వాసం.



మరో కథనం ప్రకారం గతించి ఊర్ధ్వలోకాలలో ఉన్న పితృదేవతలు చేసే తిరుగు ప్రయాణానికి ఈ ఆకాశ దీప కాంతి మార్గం చూపుతుందని, తద్వారా పెద్దల ఆశీర్వాదంతో వంశాభివృద్ధి కుటుంబ క్షేమం కలుగుతాయని చెబుతారు. "దామోదర ఆవాహయామి త్రయంబకం ఆవాహయామి" అని ఏకకాలంలో హరిహరులను ఆవాహన చేసి వెలిగించే ఆకాశ దీపం సమాజంలో నెలకొన్న అజ్ఞానాన్ని తొలగిస్తుంది. సమాజ గతి పరివర్తన చెంది ఉన్నతి వైపుకు ప్రయాణం సాగిస్తుందని చెబుతారు. ఆలయంలో దేవదేవునికి నిర్వహించే ప్రతి ఒక్క పూజ, అభిషేకం, అర్చన, ఉత్సవం, అలంకరణ, హారతి మరియు దీపారాధన మనిషిలోని అహాన్ని తొలగించి ఆదర్శప్రాయమైన సమాజానికి బాటలు వేయడమే! ఈ సత్యాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

దీప దానం

కార్తిక మాసంలో చేసే దీపదానానికి విశేష ఫలితం ఉందని స్కంద, కార్తిక పురాణాలు తెలుపుతున్నాయి. కార్తిక శుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి నాటి వరకు ఈ అయిదు రోజులలో సాయంసంధ్యా సమయంలో చేసే దీపదానానికి విశేష ఫలితం ఉంటుంది. బియ్యంపిండి లేదా గోధుమ పిండిని పాలతో కలిపి చేసిన ప్రమిదలో నేతితో దీపారాధన చేసి, ఉసిరికాయ, పూలు, పండ్లు, పసుపు-కుంకుమ, స్వయంపాకంతో పాటు దక్షిణ కలిపి గృహ వశిష్టునికి లేదా సద్బ్రాహ్మణునికి దానం ఇవ్వాలి అని శాస్త్రాలు తెలుపుతున్నాయి. కార్తిక మాస దానాలలో దీపదానానిదే అగ్రస్థానమని చెప్పవచ్చు.



కార్తిక సోమవార వ్రతం

ఆరోగ్యం, వయసు, ఉద్యోగరీత్యా కార్తిక మాసం పూర్తిగా దీక్షలో ఉండలేనివారు సోమవారాలలో సంపూర్ణ ఉపవాసం లేదా ఏకభుక్తం ఉండి, భక్తితో ఇంటిలో, తులసి, ఉసిరిచెట్టు, ఆలయంలో ఎక్కడైనా దీపాన్ని వెలిగించి సంధ్యా నక్షత్ర దర్శనానంతరం ఉపవాస విరమణ చేసినవారు కార్తిక మాస ఫలితాలు పొందుతారని పెద్దలు తెలిపారు. ఆరోగ్యరీత్యా ఇది కూడా కుదరనివారు సోమవారం బ్రాహ్మణునికి దక్షిణ సహితంగా నువ్వులు దానం చేస్తే సంపూర్ణ కార్తిక మాస దీక్షాఫలితం పొందగలరు. మరే మాసంలోనూ లేని విధంగా నిత్య దీపారాధన, ఆలయ సందర్శనం, ఉపవాసం, దీక్ష, దానం.. ఇన్ని ఆధ్యాత్మిక విధానాలు కలిగి హరిహరుల ఉమ్మడి అనుగ్రహాన్ని అందించే ఏకైక మాసం కార్తికం.

ఆధ్యాత్మిక పురోగతికి దోహదపడే అనేక విధి విధానాల సమాహారం కార్తికం. కానీ ఈ విధానాలను ఈ ఒక్క నెలకే పరిమితం చేయకుండా నిత్యం ఆచరించేవారు మరింత కృతార్థులు అవుతారని పండిత వాక్యం.

– ఇలపావులూరి వెంకటేశ్వర్లు

ఆలోచనే ఆరంభం.. మార్పే గమ్యం

మనిషి జీవితాన్ని మార్చడానికి ఒక్క క్షణం చాలు.. కానీ ఆ మార్పుకు బీజం వేసే ఆలోచన పుట్టడానికి కొన్నిసార్లు ఒక జీవితకాలం పడుతుంది. చరిత్రలో గొప్ప పరిణామాలన్నీ ఏదో ఒక చిన్న ఆలోచనతోనే ప్రారంభమయ్యాయి. నిన్నటి అసాధ్యం నేటి వాస్తవంగా మారడం వెనుక, నేటి సమస్య రేపటి పరిష్కారంగా రూపాంతరం చెందడం వెనుక ఆలోచన అనే అదృశ్య శక్తి పనిచేస్తూనే ఉంది. మనిషి ఆలోచనా విధానం మారితే అతడి నిర్ణయాలు మారతాయి. నిర్ణయాలు మారితే ఆచరణ మారుతుంది. ఆచరణ మారితే జీవిత గమనం మారుతుంది. అందుకే ఒక ఆలోచన జీవితాన్ని మార్చగలదనే మాటలో కేవలం ప్రేరణ లేదు.. ఒక గొప్ప జీవన సత్యం ఉంది.

అయితే, ఆలోచన అంటే ఏమిటి? మనసులో మెదిలే ప్రతి భావనా ఆలోచనేనా? కాదు. ఒక సమస్యను చూసి బాధపడటం భావోద్వేగం కావచ్చు. అదే సమస్య ఎందుకు ఏర్పడింది, దానికి బాధ్యులెవరు, దాన్ని ఎలా పరిష్కరించవచ్చు అని ప్రశ్నించడం నిజమైన ఆలోచనకు నాంది. ఉన్న పరిస్థితులకు తలవంచడం ఒక మనస్తత్వమైతే, వాటిని మార్చేందుకు మార్గాలను అన్వేషించడం మరో మనస్తత్వం. మొదటిది: మనిషిని పరిస్థితులకు బానిసగా మారుస్తుంది. రెండోది: అతడిని పరిస్థితులను ఎదుర్కొనే శక్తిగా తీర్చిదిద్దుతుంది. ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసమే వ్యక్తిగత ఎదుగుదలకు, సామాజిక పరివర్తనకు మధ్య ఉన్న అసలు రహస్యం.

ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే ఆలోచనకు ఉన్న అపారమైన శక్తి స్పష్టమవుతుంది. సమాజంలో అసమానతలు సహజమనే భావనను ప్రశ్నించిన ఆలోచనలు సమానత్వ ఉద్యమాలకు పునాది వేశాయి. విద్య కొందరికే పరిమితం కావాలనే భావనను సవాలు చేసిన సంస్కరణలు సామాన్యులకు జ్ఞానద్వారాలు తెరిచాయి. అన్యాయాన్ని భరించడం కన్నా ప్రశ్నించడం అవసరమనే చైతన్యం ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసింది. మూఢనమ్మకాల స్థానంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలనే ప్రయత్నాలు సమాజాన్ని ఆధునికత వైపు నడిపించాయి. ఇవన్నీ ఒక్కరోజులో జరిగిన మార్పులు కావు. ఒక వ్యక్తి మనసులో పుట్టిన ప్రశ్న, మరొకరిలో కలిగించిన చైతన్యం, చివరకు ప్రజా ఉద్యమంగా మారిన పరిణామాలే.



దీన్ని బట్టి ఒక విషయం స్పష్టమవుతుంది. ఆలోచనకు వయస్సుతో సంబంధం లేదు. ఆర్థిక స్థితితోనూ, సామాజిక హోదాతోనూ దాని విలువ నిర్ణయించబడదు. సమాజంలోని అత్యంత సాధారణ వ్యక్తి మనసులో పుట్టిన ఆలోచన కూడా అసాధారణ మార్పుకు కారణం కావచ్చు. అయితే ఆ ఆలోచనకు విలువ రావాలంటే దానిలో సృజనాత్మకత ఉండాలి. సమస్యను గుర్తించే సామర్థం ఉండాలి. పరిష్కారాన్ని అన్వేషించే తపన ఉండాలి. అన్నింటికంటే ముఖ్యంగా, అనుకున్నది ఆచరణలో పెట్టే ధైర్యం ఉండాలి.

నేటి సమాజంలో మనిషికి ఎదురవుతున్న ప్రధాన సమస్యల్లో ఒకటి ప్రతికూల ఆలోచనా ధోరణి. అవకాశాల కోసం ప్రయత్నించకుండానే అవకాశాలు లేవని తీర్పు చెప్పడం, ఒకసారి ఓడిపోగానే ఇక విజయం సాధ్యం కాదని భావించడం, ఇతరుల విజయాలను చూసి తమ జీవితాలను తక్కువగా అంచనా వేసుకోవడం వంటి ధోరణులు వ్యక్తి ఎదుగుదలకు అడ్డంకులుగా మారుతున్నాయి. ముఖ్యంగా యువతలో తక్షణ విజయాలపై పెరుగుతున్న ఆకాంక్ష, ఓటమిని అంగీకరించలేని మనస్తత్వం ఆందోళన కలిగిస్తున్నాయి. విజయం అనేది ఒక్కసారిగా లభించే బహుమతి కాదు. అది నిరంతర అభ్యాసం, తప్పుల నుంచి నేర్చుకోవడం, క్రమశిక్షణతో ముందుకు సాగడం ద్వారా సాధ్యమయ్యే ఫలితం.

ఒక యువకుడు ఉద్యోగం రాలేదని నిరాశ చెందవచ్చు. కానీ అదే పరిస్థితిని తన నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశంగా భావిస్తే అతడి భవిష్యత్తుకు కొత్త దారి తెరుచుకుంటుంది. ఒక విద్యార్థి పరీక్షలో విఫలమవవచ్చు. ఆ వైఫల్యాన్ని తన సామర్థ్యానికి అంతిమ ప్రమాణంగా కాకుండా, తన అధ్యయన విధానాన్ని సమీక్షించుకునే అవకాశంగా తీసుకుంటే తదుపరి విజయం సాధ్యమవుతుంది. ఒక వ్యాపారి నష్టాలను ఎదుర్కోవచ్చు. ఆ నష్టాలకు కారణాలను విశ్లేషించి తన వ్యూహాన్ని మార్చుకుంటే తిరిగి నిలబడగలడు. ఇక్కడ పరిస్థితి మారకముందే ఆలోచన మారుతుంది. ఆ ఆలోచనే పరిస్థితిని మార్చేందుకు అవసరమైన మార్గాన్ని చూపుతుంది.

అయితే, సానుకూలంగా ఆలోచించడం అంటే వాస్తవాలను విస్మరించడం కాదు. సమస్యల తీవ్రతను తక్కువగా అంచనా వేయడం కూడా కాదు. పేదరికం, నిరుద్యోగం, వివక్ష, అవినీతి వంటి సమస్యలను కేవలం వ్యక్తిగత ఆలోచనా విధానంతోనే పరిష్కరించలేం. వీటికి వ్యవస్థాగత సంస్కరణలు, సమాన అవకాశాలు, సమర్థవంతమైన పాలన, సామాజిక బాధ్యత అవసరం. కానీ ఈ సమస్యలను గుర్తించడం, వాటిపై చర్చించడం, పరిష్కారాల కోసం ప్రజలను సంఘటితం చేయడం కూడా ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. కాబట్టి వ్యక్తిగత మార్పును మాత్రమే గొప్పగా చూపిస్తూ సామాజిక పరిస్థితులను విస్మరించడం ఎంత తప్పో, పరిస్థితులనే నిందిస్తూ వ్యక్తిగత బాధ్యతను నిరాకరించడం కూడా అంతే తప్పు.

ప్రజాస్వామ్య సమాజంలో ఆలోచనకు ఉన్న ప్రాధాన్యం మరింత విశిష్టమైనది. ప్రజలు ప్రశ్నించడం మానేస్తే అధికారానికి జవాబుదారీతనం తగ్గుతుంది. పాలకుల మాటలనే అంతిమ సత్యంగా భావిస్తే ప్రజా ప్రయోజనాలపై చర్చకు అవకాశం సన్నగిల్లుతుంది. రాజకీయ పార్టీల పట్ల అభిమానం ఉండవచ్చు. కానీ ఆ అభిమానం వాస్తవాలను పరిశీలించే సామర్థ్యాన్ని

హరించకూడదు. ప్రభుత్వ నిర్ణయాలను వాటి ఫలితాల ఆధారంగా అంచనా వేయాలి. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుతున్నాయా లేదా అని ప్రశ్నించాలి. ప్రజాధనం సక్రమంగా వినియోగించబడుతోందా లేదా అని పరిశీలించాలి. ప్రశ్నించే పౌరుడు ప్రజాస్వామ్యానికి శత్రువు కాదు.. దాని బలానికి ప్రతీక.

అదే సమయంలో ఆలోచన స్వేచ్ఛకు బాధ్యత కూడా తోడవ్వాలి. తప్పుడు సమాచారాన్ని నిజమని నమ్మడం, ఆధారాలు లేకుండా వ్యక్తులపై ఆరోపణలు చేయడం, భిన్నాభిప్రాయాలను ద్వేషించడం సమాజానికి మేలు చేయవు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల యుగంలో ప్రతి ఒక్కరి చేతిలో సమాచారాన్ని వ్యాప్తి చేసే శక్తి ఉంది. కానీ ఆ శక్తిని వినియోగించే ముందు నిజానిజాలను పరిశీలించే వివేకం అందరిలో ఉండాలి. మన ఆలోచన ఇతరుల గౌరవాన్ని దెబ్బతీస్తుందా? సమాజంలో విద్వేషాన్ని పెంచుతుందా? ప్రజలను తప్పుదారి పట్టిస్తుందా? అనే ప్రశ్నలు వేసుకోవాలి. స్వేచ్ఛగా ఆలోచించడం ఎంత ముఖ్యమో, బాధ్యతాయుతంగా ఆలోచించడం కూడా అంతే ముఖ్యం.

ఇంకొక కీలకమైన విషయం ఏమిటంటే, ఆలోచనకు కార్యాచరణ తోడుకాకపోతే దాని ప్రయోజనం పరిమితంగానే మిగిలిపోతుంది. గొప్ప లక్ష్యాలను ఊహించడం సులభం. వాటిని సాధించేందుకు ప్రతిరోజూ క్రమశిక్షణతో శ్రమించడం కష్టం. సమాజం మారాలని కోరుకోవడం సులభం. కానీ మన ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవడం కష్టం. అవినీతి నిర్మూలన గురించి మాట్లాడటం సులభం. కానీ మనకు అనుకూలంగా ఉన్నప్పుడు చిన్న అవకతవకను కూడా సమర్థించకుండా ఉండటం నిజమైన నైతిక ధైర్యం. పరిశుభ్రమైన సమాజం కావాలని కోరుకోవడం సులభం. కానీ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వ్యక్తిగత బాధ్యత. మార్పు గురించి ఉపన్యాసాలు ఇచ్చేవారి కంటే మార్పును తమ జీవితాల్లో ఆచరిస్తున్నవారే సమాజానికి ఎక్కువ ఆదర్శం.

మనిషి జీవితంలో గొప్ప పరివర్తన ఎప్పుడూ గొప్ప సంఘటనతోనే ప్రారంభం కావాల్సిన అవసరం లేదు. రోజుకు కొంత సమయం చదవాలనే నిర్ణయం జ్ఞానాన్ని పెంచుతుంది. అనవసరమైన ఖర్చులను తగ్గించాలనే ఆలోచన ఆర్థిక క్రమశిక్షణను పెంపొందిస్తుంది.

కోపానికి బదులుగా సంయమనంతో స్పందించాలనే సంకల్పం సంబంధాలను మెరుగుపరుస్తుంది. ఇతరుల కష్టాలను అర్థం చేసుకోవాలనే భావన మానవత్వాన్ని పెంచుతుంది.



సమాజానికి ఉపయోగపడే పని చేయాలనే ఆలోచన వ్యక్తిగత జీవితానికి ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని అందిస్తుంది. ఈ చిన్న మార్పులే కాలక్రమంలో వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి.

కానీ ఆలోచనలను ఎంచుకోవడంలో వివేకం అవసరం. ప్రతి కొత్త ఆలోచన గొప్పదే కాదు. ప్రతి ఆకర్షణీయమైన సిద్ధాంతం సమాజానికి మేలు చేసేదీ కాదు. ఒక ఆలోచన ఎంత ప్రభావవంతమైనదో నిర్ణయించేది దాని ప్రచారం కాదు.. దాని ఉద్దేశం, దాని సాధ్యత, దాని పరిణామాలు. మనిషిని మరింత మానవీయంగా మార్చే ఆలోచన గొప్పది. సమాజంలో సమానత్వాన్ని పెంపొందించే ఆలోచన విలువైనది. ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని, నైతిక బాధ్యతను పెంచే ఆలోచన అభివృద్ధికి దోహదపడుతుంది. ఇతరులపై ఆధిపత్యం చెలాయించేందుకు, ద్వేషాన్ని వ్యాప్తి చేసేందుకు, స్వార్థ ప్రయోజనాలను సాధించేందుకు ఉపయోగపడే ఆలోచన మాత్రం విధ్వంసానికి దారితీయవచ్చు.

అందుకే మనిషి తనను తాను తరచుగా ప్రశ్నించుకోవాలి. నా ఆలోచనలు నన్ను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నాయా? నా నిర్ణయాలు ఇతరులకు మేలు చేస్తున్నాయా? నేను ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం వెతుకుతున్నానా, లేక సమస్యనే పదేపదే నిందిస్తున్నానా? నా ఆలోచనల్లో మార్పుకు నేను సిద్ధంగా ఉన్నానా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానాలు వెతికినప్పుడే వ్యక్తిగత వికాసానికి పునాది పడుతుంది.

ముగింపుగా.. జీవితాన్ని మార్చే శక్తి ఒక్క ఆలోచనలోనే ఉండవచ్చు.కానీ ఆ ఆలోచనకు దిశనిచ్చేది వివేకం, బలాన్నిచ్చేది ఆత్మవిశ్వాసం, ఫలితాన్నిచ్చేది కార్యాచరణ, విజయానికి చేరువ చేసేది పట్టుదల. మనిషి తన ఆలోచనలను మార్చుకోకుండా జీవితంలో కొత్త ఫలితాలను ఆశించడం సాధ్యం కాదు. సమాజం తన లోపాలను గుర్తించకుండా అభివృద్ధిని సాధించలదు. ప్రజాస్వామ్యం ప్రశ్నించే పౌరులు లేకుండా బలోపేతం కాలేదు. అందువల్ల మార్పు అనేది బయట నుంచి ఎవరో తీసుకువచ్చే బహుమతి కాదు.. మనలో పుట్టే ఆలోచనతో ప్రారంభమయ్యే నిరంతర ప్రక్రియ. ఒక ఆలోచన మనిషికి కొత్త దారిని చూపిస్తుంది. ఒక మంచి ఆలోచన ఒక కుటుంబ భవిష్యత్తును మార్చగలదు. ఒక సృజనాత్మక ఆలోచన సమాజానికి కొత్త దిశను అందించగలదు. బాధ్యతాయుతమైన ఒక ఆలోచన దేశ పురోగతికి పునాది వేయగలదు. అయితే ఆలోచనను ఆచరణగా, ఆచరణను ఉద్యమంగా,ఉద్యమాన్ని మార్పుగా మలచగలిగినప్పుడే దాని అసలైన శక్తి ప్రపంచానికి తెలుస్తుంది.కనుక మార్పు కోసం కాలాన్ని నిందించకండి.. పరిస్థితులను మాత్రమే నిందించకండి.. ముందుగా మీ ఆలోచనలను పరిశీలించండి. ఎందుకంటే, మనిషి భవిష్యత్తు అతడు కలలు కనే ప్రపంచంలో మాత్రమే కాదు.. ఆ ప్రపంచాన్ని నిర్మించేందుకు ఈ రోజు చేసే ఆలోచనలోనూ, ఆ ఆలోచనకు అనుగుణంగా వేసే అడుగులోనూ దాగి ఉంది.

- తిప్పర్తి శ్రీనివాస్

- ఒక్క శత్రువు కూడా లేనివాడికి, ఒక్క మిత్రుడు కూడా ఉండడు.
- ఆల్‌ఫ్రెడ్ టెనిసన్

- ఉల్లాసవంతుడైన మిత్రుడు ఎల్లెడలా ప్రకాశాన్ని వెదజల్లే సూర్యనివంటివాడు.
- సర్ జాన్ లుబ్బక్

- బెర్నార్డ్‌షాకు ఈ ప్రపంచంలో ఒక్క శత్రువు కూడా లేడు. అతని మిత్రులలో ఏ ఒక్కరూ అతనంటే ఇష్టపడరు.
- ఆస్కార్ వైల్డ్

కొలవలేని దూరం

అనంత విశ్వపు అంచులను సైతం...
అడుగులతో కొలిచే శక్తి మనిషిది!
సముద్రాల లోతులను, ఆకాశపు
ఎత్తులను...
సెలవు తీసుకోకుండా
లెక్కగట్టే నేర్పు మనిషిది!

కానీ...
కళ్ళెదుటే కనిపిస్తూ,
పక్కనే కూర్చున్నా...
మనసుల మధ్య పెరిగిన ఆ మైళ్ళ
దూరాన్ని,
కొలవడం ఎవరి వల్ల అవుతుంది?

పట్టుమని పట్టుకుంటే...
చేతికి చిక్కేంత దూరమే,
కానీ... హృదయాలు విడిపోతే,
ఏ కాలమూ పూడ్చలేనంత సుదూరం!

మాటల వంతెన కూలిపోయాక...
ఆ దూరాన్ని కొలిచే పరికరం ఏముంది?
మళ్ళీ ఆ మనసులను ముడివేసేందుకు...
'ప్రేమ' అన్న చిన్న పదం తప్ప, మరేం
సరిపోతుంది?

– శ్రీవాణి కుంచాల



మనిషి

మనిషి నేడు పూర్తిగా ఒంటరైపోతున్నాడు
బంధాలు బాంధవ్యాలు మర్చిపోతున్నాడు
మనిషి నేడు పూర్తిగా
ఒంటరైపోతున్నాడు!!
ఏవేవో ఈర్ష్యాద్వేషాలతో
రగిలిపోతున్నాడు
సంకుచితత్వం స్వార్థాలకు
బలవుతున్నాడు!!
అందని దాని కోసం అర్రులు
చాస్తున్నాడు
గొంతెమ్మ కోర్కెలతో
సతమతమవుతున్నాడు!!
ఇతరుల జీవితాల పట్ల
కుళ్ళుకుంటున్నాడు
స్వీయ జీవితాన్ని
అస్వాదించలేకపోతున్నాడు!!
మానవ జీవితచక్రం స్వల్పమని
విస్మరిస్తున్నాడు
తన జీవితం శాశ్వతమనే భ్రమలో
బతికేస్తున్నాడు!! జీవితంలో
పట్టువిడుపుల ప్రాధాన్యత మరిచాడు.
సర్దుకుపోయే గుణానికి ఎప్పుడో
తిలోదకాలిచ్చాడు!!సదా తన పంతం
నెగ్గాలని కోరుకుంటున్నాడు తెలియని
మానసిక రుగ్మతతో నలిగిపోతున్నాడు!!
ఆనందం కోసం విలాసాల వెంట
పరిగెడుతున్నాడు ఆత్మీయుల మధ్య
ఉందని తెలుసుకోలేకపోతున్నాడు.
పోలికల సుడిగుండంలో
కొట్టుమిట్టాడుతున్నాడు

విషవలయంలో తనను తానే బందీ
చేసుకుంటున్నాడు!!

– వై.చంద్రశేఖర్

నేను

ఒక ఫొటోను
చూస్తున్నాను. అందులో
కాలం మార్చేసిన నా
ముఖం కనిపిస్తోంది.
.....
నేను
ఒక పాత
దారిలో
నడిచాను.
అడుగులు నావే
దారి మాత్రం నన్ను
మరచిపోయింది.
.....
నేను అద్దం ముందు
నిలబడ్డాను.
ముఖం అదే ఉంది
చూసే మనిషే
మారిపోయాడు.
.....
నేను
మాట్లాడటం ఆపేశాను.
అప్పటి నుంచి
మౌనం నా పేరు
పిలుస్తోంది.
.....
నేను
ఒంటరిగా కూర్చున్నాను.
కొద్దిసేపటికి
మరచిపోయిన ముఖాలు
నన్ను గుర్తుపట్టాయి.
.....
ఒక పుస్తకం తెరిచాను.
అందులో కథ లేదు
నేను గడిపిన రోజులు
ఉన్నాయి.

– బొల్లిముంత వెంకట రమణారావు

ఈ వారం కవిత్వం

రెక్కలొచ్చిన కలలు

.
కొన్ని ఆశలతో
మరికొన్ని ఆశయాలతో
నడుస్తూనే ఉన్నాను
పాదాలకు ముళ్ల పొదలు
కళ్లకు కారు చీకట్లు తగిలి
తల్లడిల్లుతూనే ఉన్నాను.

ఆశల్ని మోస్తూనే ఉన్నాను
బతుకుదారుల్ని అన్వేషిస్తూనే ఉన్నాను.
ఆశ మినుకు, మినుకు మంటూనే ఉంది.
ఎగిరే గువ్వ ఆశయాల్ని
అందిపుచ్చుకొన్నాను
భగ, భగ మండే నిప్పు రహస్యాన్ని
తెలుసుకున్నాను.



నాకు నేనుగా
ఉప్పెనై లేచి
నడిచాను.

కారు చీకట్లు
కరిగాయి
దారులన్నీ
ద్వారాలుగా
నిలిచి
కమ్మని
కలలు కంటిపై వాలాయి
రెక్కలొచ్చిన కలలు
నన్ను, నన్నుగా నిటారుగా నిలబెట్టాయి.

– మహబూబ్ బాషా చిల్లెం

జీవితం

కలలు కంటూనే ఉంటావు
కలలన్నీ నిజం కావాలనుకుంటావు
కొన్ని స్వప్నాలు మధ్యలోనే
భంగమవుతుంటాయి.

అలల అలికిడిపై కలల సవ్వడి
వినిపిస్తుంది
కొన్ని నిజం అవుతుంటాయి కొన్ని
అబద్ధాలు నిజాలు అవుతుంటాయి.
జీవితం ఎప్పుడు ఐదు కాలాలలో
వాస్తవం అని కితాబులు ఇస్తావు.
ఏదీకాదు నిజాలు అంత మాయలు
భ్రమలు ఆశాశ్వతాలు
కాలమే సంకేత సమాధానాలు చెప్తుంది
దానికి అదే కాలం రాసిన శాసనం.

– సిహెచ్ ఆంజనేయులు



కలసి ఉంటే గెలుపు..

రాశివాని 8వ తరగతి చదువుతున్నారు. ఇద్దరికీ ఎప్పుడూ మొదటి ర్యాంకులో పోటీ. ఎప్పుడు ఎవరు మొదటి ర్యాంకు వస్తారో చెప్పడం కష్టం. శివాని ఈ పోటీ తమ మంచికే అని భావించేది. కానీ అనిత శివాని మీద ఈర్ష్యాభావాన్ని పెంచుకుంది. అనిత ఎప్పుడూ శివానితో సరిగా మాట్లాడేది కాదు. ఉపాధ్యాయులు నచ్చ చెప్పేవారు ఈర్ష్య మంచిది కాదని. కానీ అనిత పెడచెవిన పెట్టింది. శివాని కూడా అనితకు దూరంగా ఉంది.



తన ఊరిలో కేవలం ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉన్నందున శివాని 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు అమ్మమ్మ ఊరిలో ఉన్న ఉన్నత పాఠశాలలో చదివింది. అమ్మా నాన్నలకు దూరంగా అమ్మమ్మ ఇంట్లో ఉంటూ చదివింది. కానీ తన సొంత ఊరిలో కొత్తగా ప్రైవేట్ పాఠశాల పెట్టారని, అమ్మా నాన్నల దగ్గరే ఉంటూ చదివుకోవచ్చని శివాని 9వ తరగతిలో కొత్త ప్రైవేట్ పాఠశాలలో చేరింది. శివాని వెళ్లిపోవడంతో అనిత చాలా సంతోషపడింది.

పోటీ లేకపోయేసరికి అనితకు చదువు మీద నిర్లక్ష్యం పెరిగింది. ఫలితంగా మార్కులు తక్కువ వస్తున్నాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల చేత చివాట్లు తింటుంది. అయినా అనితకు చదువు మీద ఆసక్తి పెరగడం లేదు. క్రమంగా శివాని లేని లోటు తెలిసి వచ్చింది. చదువులో పోటీ ఉంటేనే మరింత బాగా చదువుతామని అర్థమైంది. శివాని లేని లోటు తెలిసి వచ్చింది. ఎంత చదువుదామన్నా చదువు మీద ఆసక్తి పెరగడం లేదు. శివాని ఉంటే ఎంత బాగుండేది అనిపించింది. కానీ ఏం లాభం?

రోజులు, నెలలు గడుస్తున్నాయి. సంక్రాంతి సెలవులు అయిపోయాయి. మళ్ళీ పాఠశాలలు ప్రారంభం అయ్యాయి. ఊహించని విధంగా శివాని మళ్లీ తన పాత ఉన్నత పాఠశాలలో చేరింది. శివాని చూసి అనిత ఆశ్చర్యపోయింది. కలా? నిజమా? అనుకుంది. సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బై శివానిని ఆప్యాయంగా పలకరించింది.

శివాని ఆశ్చర్యానికి అంతులేదు. "నేను అమ్మా నాన్నల దగ్గరే ఉంటూ చదువుకోవచ్చని అక్కడ కొత్త పాఠశాలలో చేరితే అక్కడి బోధన అస్సలు అర్థం కావడం లేదు. పాఠశాల మారేసరికి కొత్త బోధనకు అలవాటు పడలేకపోతున్నానేమో అని అనుకున్నా. 10వ తరగతి పూర్తి అయ్యే వరకు నేను మళ్ళీ మన పాత పాఠశాలలోనే చదువుకోవాలని అనుకున్నాను" అన్నది శివాని.

"నన్ను క్షమించు శివానీ, చదువులో నాకు పోటీ వస్తున్నావనే ఈర్ష్యాభావంతో నీకు దూరంగా ఉన్నాను. నువ్వు నాకు దూరం అయిన తరువాత తెలిసింది నీ విలువ. నాకు పోటీ లేనందున చదువు మీద ఆసక్తి తగ్గిపోయి చాలా వెనకబడ్డాను. నీ విలువ నాకు తెలిసి వచ్చింది. ఇక నుంచి మనం ప్రాణ స్నేహితులం. చదువులో మాత్రం శత్రువులం. నువ్వా నేనా అన్నట్లు చదువుకుందాం. కానీ కలిసి చదువుకుందాం" అన్నది అనిత.

"సంతోషంగా" అన్నది శివాని. అప్పటి నుంచి ఇద్దరూ కలసికట్టుగా చదవడం వల్ల 10వ తరగతి ఫలితాల్లో ఇద్దరికీ మొత్తం 600కు గాను 590కి పైగా మార్కులు వచ్చాయి.

– సరికొండ శ్రీనివాసరాజు



రంగుల బొమ్మరిల్లు

వార్త ఆదివారం

బాలగేయం

ఉంటేనేమీ.. లేకపోతేనేమి!

సత్యం పలుకని మనిషి
స్పందించని వికసించిన
మేధస్సు
సానబట్టని కోహినూర్ వజ్రం
తేజస్సు ఆపదలో ఆదుకోని రక్త
సంబంధం
ఎడారిలో ఊరించే మృగతృష్ణ
దాహం ఊపిరి ఉన్నప్పుడు
పలకరించితే ఒట్టు శవాలపై
ప్రేమ దండలు మాత్రం
పెట్టుశాస్త్రీయత లేని
యూనివర్సిటీ పట్టాలు
సాలెగూడులో చిక్కుకొన్న
బతుకులు మూఢ నమ్మకాలపై
స్పందించని మేధావులు కొత్త
ఇంటి ముందు వెళ్ళాడే దిష్టి
బొమ్మలు... తోటివానికి
సహాయం చేయని చేతులు
ఆర్థిక క్రమశిక్షణ లేని జీవితాలు
ఉంటేనేమీ ! లేకపోతే నేమి !

– పూసాల సత్యనారాయణ

చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్
గిరీష్ అంకుల్ సమాధానాలు

ఎల్.కాత్యాయని, కావలి

ప్రశ్న: రంగులను ఎలా గుర్తిస్తారు?

జవాబు: మల్లెపూలు తెల్లగా ఎందుకుంటాయి? మల్లెపూవు అన్ని రంగుల తరంగ దైర్ఘ్యాన్ని తనలో కలిపేసుకుంటుంది కాబట్టి. దాని మీద పడిన కాంతి పరావర్తనం చెంది తెల్లగా ఉన్నట్లు కనపడుతుంది. మరి.. మల్లెపూవు తెల్లగా వున్న విషయం మనకెలా తెలుస్తోంది? మన కళ్లు మన మెదడుకు చెబితే అప్పుడు మనకు తెలుస్తున్నది. అయితే, ఈ విషయం చెప్పుకున్నంత సులభమైన ప్రక్రియ కాదు.

మెదడులో జరిగే ఈ ప్రక్రియతో పాటుగా రంగులను గుర్తించడం మీద సంస్కృతి, భాష కూడా ప్రభావం చూపిస్తాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

పపువా న్యూ గినియాలోని బెర్నిమో అనే ఆదిమ తెగకు చెందిన ప్రజల మీద పరిశోధనలు చేస్తుండగా ఈ విషయం బయటపడింది. వీరికి నీలం రంగుకు పచ్చరంగుకు మధ్యన తేడా తెలియదు. అయితే పచ్చరంగులో రెండు రకాల ఛాయలను వీరు గుర్తిస్తారు. పాశ్చాత్య దేశాల్లో ప్రజలు ఈ రంగులను గుర్తించటం కష్టం. ఈ విధంగా పాశ్చాత్య దేశాల్లో ప్రజల మీద కూడా ఇటువంటి ప్రయోగాన్ని చేశారు. వీరు ఈ రంగులను గుర్తించటం పెరిగింది.

సి.కృష్ణకుమార్, ఖమ్మం

ప్రశ్న: వజ్రాలను ఎందుకు సానబెడతారు?

జవాబు: ముడి స్థాయిలో ఉన్నప్పుడు సాధారణ గాజుముక్క మాదిరిగా కనిపించే వజ్రం కళ్ల మిరుమిట్లు గొలపాలంటే సానపెట్టాల్సిందే. వజ్రానికి చెందిన వివిధ ముఖాల నుంచి కాంతిపుంజాలు విరజిమ్మటానికి, వివిధరంగులు కనువిందు చేయటానికీ ఇదే కారణం. ఒక వజ్రం ఇష్టపడే ఆకారం అనేది వ్యక్తిగత అభిరుచుల మీద ఆధారపడి ఉంటుంది. చాలామాత్రం గుండ్రంగా వుండే వాటినే ఇష్టపడుతుంటారు. ■



కథ

కీడు చేసిన మేలు

– బుద్ధవరపు కామేశ్వరరావు

"హలో.. కార్తీక్! నేనురా, తాతయ్య రంగనాథాన్ని మాట్లాడుతున్నా. మీ అమ్మ, కడుపులో నెప్పి అంటూ మెలికలు తిరిగిపోతోంది. మీ నాన్నకు ఫోన్ చేస్తే ఎత్తడం లేదు. నువ్వయినా ఆఫీసుకు సెలవు పెట్టి అర్జంటుగా రారా" తన మనవడికి ఫోన్ చేసి చెప్పాడు రంగనాథం.

"నేను ఇంత దూరం నుంచి రావడం అంటే కొంచెం ఆలస్యం అవుతుంది. ఈలోగా అమ్మను కళ్యాణ నగర్‌లో ఉన్న హాస్పిటల్‌కు తీసుకుని వెళ్ల తాతా" అంటూ ఆసుపత్రి అడ్రస్ చెప్పాడు కార్తీక్.

ఫోన్ పెట్టేసి, వెంటనే ఓ ఆటోలో కూతుర్ని తీసుకుని ఆ హాస్పిటల్‌కి బయలుదేరాడు రంగనాథం.

.....

రంగనాథం ఏలూరు పక్కన ఉన్న జానంపేటలో పలుకుబడి ఉన్న భూకామందు. తన ఏకైక సంతానం అయిన గాయత్రిని అల్లారుముద్దుగా పెంచాడు. యుక్త వయసు రాగానే తన కులం వాడు, తన ఊరు వాడే అయిన మోహన్ రావుకి ఇచ్చి ఘనంగా వివాహం జరిపించాడు. ఆ తరువాత అల్లుడు వ్యాపారం హైదరాబాద్‌లో ఉండడంతో కూతుర్ని సకల లాంఛనాలతో కాపురానికి పంపాడు.



ఓ నాలుగు సం॥ క్రితం రంగనాథం భార్య మరణించడంతో, కూతురు కోరిక ప్రకారం తన స్వగ్రామంలో ఉన్న ఆస్తులు అన్నీ అమ్మి తన మకాం హైదరాబాద్‌కు మార్చేసాడు.

.....

"సార్! దిగండి. ఆసుపత్రికి వచ్చేసాము" ఆటో అతని పిలుపుతో ఏదో ఆలోచిస్తున్న రంగనాథం వాస్తవంలోకి వచ్చాడు. ఆటో డ్రైవర్, నర్సుల సాయంతో అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న తన కూతురు గాయత్రిని ఆసుపత్రిలోని ఐసియూ వార్డుకు చేర్చాడు రంగనాథం. కాసేపటికి యాప్రాన్ వేసుకుని, ఆ ఐసియూ వార్డుకు వెళ్తున్న వ్యక్తి వంక పరిశీలనగా చూసాడు, ఆ హాల్ బయట బల్ల మీద కూర్చున్న రంగనాథం.

"ఈ వ్యక్తిని ఇంతకు ముందు ఎక్కడో చూసినట్టుంది, ఎక్కడా? ముఖ్యంగా కొంచెం వంకరగా ఉన్న ఆ కుడికాలుతో నడవడం? ఎవరై ఉంటారు?" అని.. పరిపరివిధాల ఆలోచిస్తున్నాడు.

ఈలోగా తన ముందు నుంచి వెళ్తున్న నర్స్‌ను ఆపి, "లోపలికి వెళ్తున్న ఆ వ్యక్తి ఎవరమ్మా?" ఇక ఉండబట్టలేక అడిగాడు రంగనాథం.

"ఆయనే ఇప్పుడు మీ అమ్మాయికి ఆపరేషన్ చేసేది, డాక్టర్ దయాకర్" చెప్పి, వేగంగా నడుచుకుంటూ ఆ ఐసీయూ రూమ్‌లోకి వెళ్లింది నర్స్.

"ఆ... ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. వీడు ఆ దయాకరే. సందేహం లేదు. కొంపతీసి పాత గొడవలు దృష్టిలో పెట్టుకుని గాయత్రి ప్రాణాలు తీయడు కదా?" అనుకుంటూ, ఇంక అక్కడ ఉండలేక, వరండాలో అటూ ఇటూ పచార్లు చేస్తూ సుమారు పాతిక సంవత్సరాల క్రితం జరిగిన ఆ గొడవని మరోసారి మననం చేసుకున్నాడు రంగనాథం.

.....

"అన్నయ్యా! మధ్యాహ్నం మన గాయత్రి, ఆ దయాకర్ గాడూ ఏలూరు రమా మహల్లో సినిమా చూసి ఒకే రిక్షాలో రావడం నేనూ, మా ఆవిడ కళ్లారా చూసాము. మనం కొంచెం జాగ్రత్తగా ఉండడం మంచిది. లేకపోతే ఊర్లో మన పరువు పోవడం ఖాయం" తను చూసిన విషయాన్ని అన్న రంగనాథానికి వివరించాడు గురుమూర్తి.

సాయంత్రం కాలేజీ నుంచి తిరిగి వచ్చిన కూతురు గాయత్రిని ఈ విషయమై ప్రశ్నించాడు రంగనాథం. ఆమె ఏమీ చెప్పకుండా మౌనంగా ఉండిపోయింది.

ఆ రాత్రి దయాకర్ ఇంటికి చేరుకున్న రంగనాథం "ఏరా! సన్నాసీ! నీకు మా అమ్మాయే కావాల్సి వచ్చిందా? ఏం మీ వాళ్లలో ఎవరూ లేరా?" అంటూ దయాకర్‌ని పరుష పదజాలంతో తిట్టిపోసాడు రంగనాథం, దయాకర్ చెప్పబోయేది ఏమీ వినకుండా.

ఆ మర్నాడే తనకు ఉన్న పలుకుబడితో, తన కూతురు చదువుతున్న ఏలూరులోని ఆ కాలేజీ వాళ్లతో మాట్లాడి, దయాకర్‌కు టీసీ ఇప్పించి ఆ కాలేజీ నుంచి వెళ్లగొట్టాడు రంగనాథం. అంతేకాదు, జానంపేటలో కిరాణా దుకాణం నడుపుతున్న దయాకర్ తండ్రిని పిలిపించి బెదిరించాడు రంగనాథం. ఆ దెబ్బతో అవమానం పాలయిన దయాకర్ కుటుంబం ఓ రెండు రోజుల్లోనే ఆ ఊరు నుంచి వేరే ఊరికి వెళ్లిపోయారు. ఆ తరువాత వాళ్ల వివరాలు ఏమీ తెలియలేదు.

రెండు సంవత్సరాలకు తన కూతురు ఇష్టపడిన మోహనరావుతో ఘనంగా వివాహం జరిపించాడు రంగనాథం.

.....

ఎవరో గట్టిగా మాట్లాడంతో ఉలిక్కిపడి వాస్తవంలోకి వచ్చిన రంగనాథం, డాక్టర్ దయాకర్ ఐసియూ రూమ్ నుంచి రావడం చూసి, అతని వెనకాలే ఆయన రూమ్‌లోకి వచ్చాడు.

"బాబూ! అమ్మాయికి ఎలా ఉంది?" వణుకుతున్న గొంతుతో అడిగాడు. "చెప్పలేమండీ. కండీషన్ సీరియస్. నా చేతుల్లో ఏమీ లేదు. కానీ, మా ప్రయత్నం మేము చేస్తున్నాం" ముక్తసరిగా చెప్పాడు డాక్టర్ దయాకర్, యాప్రాన్ విప్పుకుంటూ...

"బాబూ! పాత గొడవలు మనసులో పెట్టుకుని మా అమ్మాయికి సరైన వైద్యం చేయడం ఆపకు బాబూ! ఆమె తండ్రిగా నీకు చేతులెత్తి నమస్కరిస్తూ చెబుతున్నా" దీనంగా వేడుకున్నాడు రంగనాథం. "ఏంటి మీరనేది? ఏ గొడవలో నాకు గుర్తు రావడం లేదు. ఇంతకూ అసలు మీరెవరు?" కుర్చీలో కూర్చుని, ఆశ్చర్యంగా అడిగాడు దయాకర్.

"అవునులెండి, మీకు మేమెందుకు గుర్తు ఉంటాము? మీరు ఇప్పుడు బాగా పెద్దవాళ్ళయిపోయారు కదా?" నిష్ఠూరంగా అన్నాడు రంగనాథం.

"మీరు ముందు అలా కూర్చోండి. నిజంగా మీరెవరో నాకు...." చెప్పబోతున్న డాక్టర్ దయాకర్‌తో-

"డాక్టర్.. డాక్టర్! ఆ నాలుగో నంబర్ హార్ట్ పేషెంట్ కండిషన్ సీరియస్‌గా ఉంది" అంటూ హడావుడిగా వచ్చి చెప్పింది నర్స్.

"ఔనా ? కమాన్, క్విక్...సార్, మీరు కొంచెం బయట వెయిట్ చెయ్యండి" అని రంగనాథానికి చెప్పి, హడావుడిగా బయటకు నడిచాడు డాక్టర్ దయాకర్.

.....

"ఉద్దేశపూర్వకంగానే ఈ దయాకర్ గాడు ఏదో సీరియస్ కేసు అని వెళ్లిపోయాడు. మరి లోపల ఐసియూలో తన కూతురు పరిస్థితి ఏమిటి?" ఏమీ తెలియని అయోమయ స్థితిలో, కారిడార్‌లో అటూ ఇటూ తిరుగుతూ.. "భగవంతుడా ఇంక నువ్వే మా గాయత్రిని కాపాడాలి" అంటూ దేవుడికి మొక్కుకున్నాడు రంగనాథం. ఐదు నిమిషాలు భారంగా నడిచాయి. ఈలోగా బయట నుంచి వచ్చిన ఓ లేడీ డాక్టర్ హడావుడిగా తన కూతురు ఉన్న ఐసియూ రూమ్‌లోనికి వెళ్లడం చూసాడు రంగనాథం.

"చూడమ్మా! ఆ లేడి డాక్టర్ ఎవరు?" తన పక్కనుంచి వెళ్తున్న నర్సును, ఆదుర్దాగా అడిగాడు రంగనాథం. "ఆవిడే డాక్టర్ జయంతి, మీ అమ్మాయికి ఆపరేషన్ చేయడానికి వచ్చారు" చెప్పి వేగంగా వెళ్లి పోయింది ఆమె.

"హమ్మయ్యా, ఇక నా బిడ్డ ప్రాణానికి ఎటువంటి హాని లేదు. ఆ దయాకర్ గాడి బారిన పడకుండా భగవంతుడు నా మొర ఆలకించి ఈమెను పంపాడు" అని మనసులో అనుకుంటూ, ఈ విషయం తన మనవడికి చెప్పడానికి ఫోన్ తీసాడు రంగనాథం.

.....

ఓ అరగంట తరువాత, నర్స్‌తో బాటు బయటకు వచ్చిన డాక్టర్ జయంతి "మీరేనా గాయత్రి ఫాదర్? నౌ షీ ఈజ్ ఫైన్. ఇది ఆపిండిసైటిస్ కేసు. సరైన సమయానికి వైద్యం అందడం వలన ప్రాణాపాయం తప్పింది. ఓ అరగంట తర్వాత మీరు వెళ్లి చూడవచ్చు, పది రోజుల తర్వాత ఓ సారి తీసుకుని రండి'న అని రంగనాథానికి చెప్పి అంతే వేగంగా కారు ఎక్కి బయటకు వెళ్లిపోయింది.

.....

ఆవిడ బయటకు వెళ్లిన తర్వాత "ఏమమ్మా! ఆ జయంతి డాక్టర్ ఇక్కడ ఉండరా?" రిసెప్షన్‌లో ఉన్న అమ్మాయిని అడిగాడు రంగనాథం. "ఆవిడ వేరే ఆసుపత్రిలో పెద్ద సర్జన్. మీ అమ్మాయిది చాలా సీరియస్ కేసు అని డాక్టర్ దయాకర్ ఫోన్ చేయడం వలన, తన భర్త మాట కాదనలేక ఆవిడ వెంటనే బయలుదేరి వచ్చారు" అసలు విషయం చెప్పింది రిసెప్షనిస్టు.

"అంటే... తన కూతురుకి ఆపరేషన్ చేసి, ప్రాణం పోసిన డాక్టర్ జయంతి, ఈ దయాకర్ భార్యా? అతడిని ఎంత తప్పుగా అర్థం చేసుకున్నాను. వెంటనే అతడిని కలుసుకుని క్షమాపణ అడగాలి" అనుకుంటూ దయాకర్ గది వైపు నడిచాడు రంగనాథం.

.....

"బాబూ! ఇందాకా చెప్పడం కుదరలేదు. నేనెవరో కాదు. నీకూ, నీ కుటుంబానికి ద్రోహం చేసిన జానంపేట రంగనాథాన్ని. ఇప్పుడే తెలిసింది, మా గాయత్రికి ఆయువు పోసిన పుణ్యాత్ములు మీ దంపతులు. నీకు కీడు తలపెట్టిన నన్ను మనస్ఫూర్తిగా క్షమించు బాబూ" అంటూ దయాకర్ చేతులు పట్టుకున్నాడు రంగనాథం.

"అయ్యయ్యో భలేవారే! మా ప్రాణం తీయడానికి వచ్చిన వాడికి కూడా, అవసరమైతే వైద్యం చేయడం మా వృత్తి ధర్మం. ఒక విధంగా చెప్పాలంటే, అప్పుడు మీరు కీడు తలపెట్టడమే ఒక విధంగా నాకు మేలు చేసింది సార్. ఆ అవమానం భరించలేక మేము ఊరు వదలి వెళ్లడం, ఆ తరువాత నేను పట్టుదలగా చదివి ఈ పొజిషన్‌కు రావడం జరిగింది. పాత సంగతులు వదిలెయ్యండి. రండి మీ అమ్మాయిని చూద్దురుగాని" అని రంగనాథాన్ని తీసుకుని ఐసియూ వైపు నడిచాడు డాక్టర్ దయాకర్. "ఐసియూ వార్డులో ప్రాణాపాయ స్థితిలో ఉన్న గాయత్రిని తాను చూసినప్పుడే గుర్తుపట్టానని, కానీ బయటకు వచ్చిన తర్వాత, తన మీద రంగనాథం వ్యక్తం చేసిన అనుమానాలు విని, ఎందుకైనా మంచిదని తనే జయంతికి ఫోన్ చేసానని ఈ పెద్దాయనకు తెలియకపోవడం మంచిదయ్యింది" మనసులో అనుకున్నాడు డాక్టర్ దయాకర్.

"అమ్మాయ్ గాయత్రీ, ఇతను డాక్టర్ దయాకర్. మన జానంపేట అబ్బాయే. నీకు ఆపరేషన్ చేసి, ప్రాణం పోసింది ఈ దంపతులే" దయాకర్‌ను చూపిస్తూ చెప్పాడు రంగనాథం.

కుంటుకుంటూ లోపలికి వస్తున్న దయాకర్‌ను చూసిన గాయత్రికి, పాతికేళ్ల క్రితం జరిగిన ఆ సంఘటన ఒకసారి గుర్తుకు వచ్చింది. "ఇంటర్ చదివే రోజుల్లోనే తను, మోహనరావు పీకలలోతు ప్రేమలో కూరుకుపోయారు. ఇంట్లో చెప్పాలంటే భయం. అప్పుడు మా ప్రేమకు అండగా నిలిచాడు మోహనరావు స్నేహితుడైన ఈ దయాకర్. ఆ రోజు కాలేజీకి బంక్ కొట్టి, ఏలూరు రమామహల్లో సినిమా చూసి ముగ్గురమూ బయటకు వచ్చాం.

"డాక్టర్.. డాక్టర్! ఆ నాలుగో నంబర్ హార్ట్ పేషెంట్ కండిషన్ సీరియస్‌గా ఉంది" అంటూ హడావుడిగా వచ్చి చెప్పింది నర్స్. "ఔనా ? కమాన్, క్విక్...సార్, మీరు కొంచెం బయట వెయిట్ చెయ్యండి" అని రంగనాథానికి చెప్పి, హడావుడిగా బయటకు నడిచాడు డాక్టర్ దయాకర్.

దూరాన్నించి బాబాయ్, పిన్నిలను చూసి నేను భయపడి పోయి, మోహనరావు ను దూరంగా పొమ్మని ఈ దయాకర్ ను ఎక్కించుకుని రిక్షాలో బయలుదేరాను. ఇతని అవకరం చూసి, జాలి పడి రిక్షా ఎక్కించుకుని ఉంటుందిలే అనుకుంటారని నా ఊహ.

కానీ, కులానికి ప్రాముఖ్యత ఇచ్చే నాన్న ఇలా చేస్తాడని నేను అసలు ఊహించలేదు. నాన్నకు భయపడి, అప్పుడు నేను అసలు విషయం చెప్పకుండా మౌనంగా ఉండి, ఇతనికి ద్రోహం చేసాను. కానీ, అవేమీ మనసులో పెట్టుకోకుండా అప్పుడు మౌనంగా ఊరి నుంచి నిష్క్రమించి నన్ను రక్షించడం, ఇప్పుడు ఇలా మళ్లీ వచ్చి నాకు ప్రాణదానం చేయడం..... దయాకర్, నువ్వు నిజంగా దయాకరుడవే" కళ్ల వెంట కన్నీళ్లు జలజలా రాలుతుండగా రెండు చేతులూ ఎత్తి మనస్ఫూర్తిగా అతనికి నమస్కారం చేసింది గాయత్రి.

చిన్ని హృదయాల అంతరంగం..!

సాంకేతికంగా ముందుకు దూసుకుపోతున్న ఈ తరం పిల్లలను చూసి పెద్దలు మురిసిపోతుంటారు. కానీ, ఈ ఉరుకుల పరుగుల జీవితంలో, కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్న నగరాల మధ్య అసలు ఆ చిన్ని హృదయాలు పెద్దల నుండి ఏం ఆశిస్తున్నాయి? పిల్లల అంతరంగం ఎలా ఉంది? అని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని పెద్దలూ విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పసి హృదయాలు ప్రేమకు నిలయాలు

పిల్లల మనసులు స్వచ్ఛమైనవి. సాటివారి కష్టాన్ని చూసి తల్లడిల్లిపోవడం, తోటి పిల్లవాడు బాధపడుతుంటే తన చేతిలో ఉన్న బొమ్మనో, చాక్లెట్‌నో ఇవ్వడం చిన్నారుల సహజ లక్షణం. పసి హృదయాలు నిష్కల్మషమైన ప్రేమకు నిలయాలు. వారిలోని ఈ అద్భుతమైన దయాగుణాన్ని, మంచి మనసును గుర్తించి, పెంచి పోషించాల్సిన బాధ్యత పెద్దలదే. నేటి తీవ్రమైన పోటీ ప్రపంచంలో "నువ్వు మాత్రమే గెలవాలి, పక్కవాడి కంటే ముందే ఉండాలి" అని స్వార్థాన్ని నూరిపోయకుండా, "మన కోసమే కాదు, పరుల కోసం కూడా ఆలోచించాలి" అనే సేవాభావాన్ని, మానవత్వాన్ని పెద్దలు పిల్లలకు చిన్నతనం నుంచే అలవాటు చేయాలి. సాటి మనిషిని ప్రేమించడం నేర్పినప్పుడే ఆ బాల్యం పరిమళిస్తుంది.



ఆంక్షల వలయం కాదు... ఆప్యాయత కావాలి

నేటి కాలంలో చాలామంది తల్లిదండ్రులు పిల్లల చుట్టూ ఎప్పుడూ తిరుగుతూ, వారు ఏం తింటున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు, ఎలా కూర్చుంటున్నారు అని నిరంతరం గమనిస్తూ ఉంటారు. దీనిని మనస్తత్వ శాస్త్రంలో 'హెలికాప్టర్ పేరెంటింగ్' అంటారు. పిల్లల భద్రత ముఖ్యం. కాదనలేం, కానీ వారి ప్రతి అడుగును, ప్రతి శ్వాసను మనమే శాసించి, ఆంక్షల వలయంలో బంధిస్తే వారు సొంతంగా ఆలోచించే శక్తిని కోల్పోతారు. భవిష్యత్తులో చిన్న సమస్య వస్తేనే తట్టుకోలేక కుప్పకూలిపోతారు. పిల్లలు కోరుకునేది నిరంతర నిఘా కాదు, తప్పులు చేసినప్పుడు భుజం తట్టి సరిదిద్దే ఒక స్నేహపూర్వక హస్తం. వారికి కావాల్సింది గడగడలాడించే బాస్ కాదు, ప్రేమగా దారి చూపే గైడ్.

నేటి పెంపకంలో కనిపిస్తున్న పెద్ద లోపం పోలిక. పక్కింటి అబ్బాయికి అన్ని మార్కులు వచ్చాయి, నీకెందుకు రాలేదు?, నీ స్నేహితుడు అన్ని ఆటల్లో గెలుస్తున్నాడు, నువ్వేం చేస్తున్నావు? అంటూ నిరంతరం చేసే పోలికలు పిల్లల ఆత్మవిశ్వాసాన్ని నిలువునా దెబ్బతీస్తాయి. ప్రతి బిడ్డ ప్రత్యేకమైనవాడు. ఒకరికి చదువు అబ్బితే, మరొకరికి చిత్రలేఖనం, ఇంకొకరికి క్రీడల్లో రాణించే ప్రతిభ ఉంటుంది. ఐన్‌స్టీన్ అన్నట్లు, "చేపను తీసుకెళ్లి చెట్టు ఎక్కే పోటీలో పెడితే అది జీవితాంతం తను చేతకానిదానిలాగే భావిస్తుంది". పిల్లల సహజసిద్ధమైన సృజనాత్మకతను గుర్తించి, వారి ఆసక్తులకు అనుగుణంగా ప్రోత్సహించాలని ఆ చిన్ని హృదయాలు కోరుకుంటున్నాయి. పిల్లలను ఏ వయసులో ఎలా పెంచాలనే విషయానికి వస్తే, మన ప్రాచీన చాణక్య నీతి సూత్రం నేటికీ ఎంతో ఆదర్శవంతమైనది.

లాలయేత్ పంచవర్షాణి దశవర్షాణి తాడయేత్ ।
ప్రాప్తే తు షోడశే వర్షే పుత్రం మిత్రవదాచరేత్ ॥

ఈ శ్లోకం ప్రకారం పిల్లల పెంపకాన్ని మూడు ముఖ్యమైన దశలుగా చూడాలి:

1) ఐదేళ్ల వచ్చేంతవరకు రాచభోగాలు: పిల్లలకు ఐదేళ్ల వచ్చేంతవరకు వారిని ఎంతో ప్రేమగా, ఎలాంటి కోపతాపాలు లేకుండా మహారాజుల్లా చూసుకోవాలి. ఆ వయసులో వారికి కేవలం ప్రేమ, భద్రత, రక్షణ మాత్రమే అవసరం.

2. పదిహేనేళ్ల వరకు దాసునిలా పనిపాటలు: ఐదేళ్ల దాటినప్పటి నుండి పదిహేనేళ్ల వయసు వచ్చే వరకు పిల్లలకు క్రమశిక్షణ నేర్పించాలి. ఒక దాసుని లాగా ఇంట్లో చిన్న చిన్న పనులు, కష్టపడే తత్వాన్ని, బాధ్యతలను అలవాటు చేయాలి. సుఖాలకే అలవాటు చేస్తే కష్టం విలువ తెలియదు. కష్టం విలువ తెలిసినప్పుడే జీవితంపై గౌరవం పెరుగుతుంది.

3. పదహారేళ్ల తర్వాత స్నేహితునిలా: పిల్లలకు పదహారేళ్లు నిండిన తర్వాత (యవ్వనంలోకి అడుగుపెట్టాక) వారిని ఇక శాసించకూడదు, కొట్టకూడదు. వారితో ఒక మంచి స్నేహితునిలా వ్యవహరించాలి. వారి మనసులోని మాటలను, సమస్యలను పంచుకునే అంతటి చొరవను, స్వేచ్ఛను పెద్దలే కల్పించాలి.

స్క్రీన్ ప్రపంచం వర్సెస్ సజీవ ప్రకృతి

స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా, వీడియో గేమ్స్ నేటి బాల్యాన్ని ఇళ్లకే పరిమితం చేస్తున్నాయి. అయితే పిల్లలు వీటికి అడిక్ట్ అవ్వడానికి ఒక రకంగా పెద్దలే కారణం. తమ పనుల్లో బిజీగా ఉంటూ పిల్లలకు సమయం ఇవ్వలేక, వారి చేతికి ఫోన్లు ఇచ్చి దూరం పెడుతున్నారు. స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ల కంటే, మైదానాల్లో మట్టిలో ఆడుకోవడం, చెట్లు, పక్షులను చూడడం, ప్రకృతితో గడపడం పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఎంతో అవసరం. పెద్దలు ఇచ్చే విలువైన గ్యాడ్జెట్స్ కంటే, తల్లిదండ్రులు తమతో గడిపే నాణ్యమైన సమయాన్ని పిల్లలు ఎక్కువగా ప్రేమిస్తారు. వారి చిన్ని చిన్ని మాటలను ఓపిగ్గా వినే పెద్దలు వారికి కావాలి. పిల్లలు దేవుడిచ్చిన స్వచ్ఛమైన బహుమతులు. ఒక ప్రసిద్ధ విద్యావేత్త అన్నట్లు, పిల్లల "చిన్ని మనసులు ఏం కోరుకుంటున్నాయన్న అర్థం చేసుకున్నప్పుడే నిజమైన బాల్యం వికసిస్తుంది.

నేటి పిల్లలే రేపటి దేశ నిర్మాతలు, భవిష్యత్తు నవసమాజ శిల్పులు. వారు ఆశించేది కొంచెం ప్రేమ, కాస్త స్వేచ్ఛ, మరికొంత ప్రోత్సాహం. కేవలం వారికి వస్తువులు కొనిచ్చి మన బాధ్యత తీరిపోయింది అనుకోకుండా, వారి మనోభావాలను గౌరవిస్తూ, వారిలో నైతిక విలువలను పెంపొందిస్తూ, వారి పెదవులపై చిరునవ్వులను కాపాడటమే మనం ఆ చిన్నారులకు ఇచ్చే నిజమైన బహుమతి.

– భ్రమరాంబికా సాయిశ్రీ మిరియాల

శిథిలమైన ఆరు ప్రపంచ వింతలు

1) గ్రీస్‌లోని రోడ్స్ ద్వీపంలో సూర్యదేవుడైన హీలియోస్‌కు అంకితంగా నిర్మించారు **కొలోసస్ ఆఫ్ రోడ్స్ భారీ కాంస్యవిగ్రహం.** ఇది సుమారు 33 మీటర్ల ఎత్తు ఉండేదని భావిస్తారు. ACE 280 ప్రాంతంలో నిర్మాణం పూర్తయిన ఈ విగ్రహం సుమారు 54 సంవత్సరాల తర్వాత BCE 226లో సంభవించిన భారీ భూకంపానికి కూలిపోయింది. దాని శిథిలాలు అనేక శతాబ్దాల పాటు అక్కడే ఉన్నాయని ప్రాచీన రచనలు పేర్కొంటాయి. ACE 7వ శతాబ్దంలో మిగిలిన కాంస్యాన్ని తొలగించి ఇతర అవసరాలకు వినియోగించినట్లు చారిత్రక వివరాలు చెబుతున్నాయి.

2) గ్రీస్‌లోని ఒలింపియాలో ఉన్న **జ్యూస్ దేవుడివిగ్రహాన్ని** శిల్పి ఫీడియాస్ BCE 5వ శతాబ్దంలో రూపొందించాడు. బంగారం, ఏనుగు దంతాలతో అలంకరించిన ఈ విగ్రహం జ్యూస్ ఆలయంలో ఉండేది. ACE 4వ శతాబ్దంలో రోమన్ పాలనలో పాత మతపరమైన ఆచారాలపై ఆంక్షలు విధించడంతో ఆలయం ప్రాధాన్యం కోల్పోయింది. ఈ విగ్రహం తర్వాత కాన్‌స్టాంటినోపుల్‌కు తరలించబడింది. అక్కడ ACE 5వ శతాబ్దంలో సంభవించిన అగ్నిప్రమాదంలో నాశనమైంది.

అయితే, విగ్రహం అంతమైన కచ్చితమైన సమయం, పరిస్థితులపై చారిత్రక ఆధారాలు స్పష్టంగా లేవు.

3) ఈజిప్టులోని అలెగ్జాండ్రియా నగరంలో నిర్మించిన **దీపస్తంభం** ప్రాచీన సముద్రయాన చరిత్రలో ప్రముఖమైనది. ఫారోస్ ద్వీపకల్పంలో నిర్మించిన ఈ దీపస్తంభం నౌకలకు దారి చూపేది. ప్రాచీన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన నిర్మాణాల్లో ఒకటిగా పేరుపొందింది. ACE 10వ శతాబ్దం నుంచి 14వ శతాబ్దం మధ్య సంభవించిన వరుస భూకంపాల కారణంగా ఇది తీవ్రంగా దెబ్బతిని చివరకు శిథిలమైంది. ACE 1480 ప్రాంతంలో ఈజిప్టు పాలకుడు ఖైత్‌బే, ఆ దీపస్తంభం శిథిలాల నుంచి లభించిన రాళ్లను ఉపయోగించి అదే ప్రాంతంలో ఒక కోటను నిర్మించాడు. ప్రస్తుతం ఆ కోటను ఖైత్‌బే కోటగా పిలుస్తారు.

4) ప్రస్తుత టర్కీలోని బోడ్రమ్ ప్రాంతంలో ఉన్న **హాలికర్నాసస్ సమాధిని** కారియా పాలకుడైన మోసోలస్ (సమాధి) కోసం అతని భార్య ఆర్టెమీసియా నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. BCE 4వ శతాబ్దంలో నిర్మించిన ఈ సమాధి శిల్పాలు, అలంకరణలు, నిర్మాణ శైలి కారణంగా ప్రపంచ వింతల్లో స్థానం సంపాదించింది. అనేక శతాబ్దాల పాటు నిలిచిన ఈ నిర్మాణం ACE మధ్యయుగాల్లో సంభవించిన భూకంపాల వల్ల క్రమంగా శిథిలమైంది. ACE 15వ శతాబ్దంలో సెయింట్ జాన్ సైనిక మతసంఘానికి చెందిన వారు బోడ్రమ్ కోట నిర్మాణం, బలోపేతం కోసం సమాధికి చెందిన రాళ్లను ఉపయోగించారు. ఆ పురాతన నిర్మాణానికి చెందిన కొన్ని రాళ్లు నేటికీ ఆ కోటలో కనిపిస్తాయి.

5) ప్రస్తుత టర్కీలోని సెల్‌చుక్ సమీపంలో ఉన్న **ఎఫెసస్ ఆర్టెమిస్ ఆలయం** గ్రీకు దేవత ఆర్టెమిస్‌కు అంకితం చేయబడింది. BCE 6వ శతాబ్దంలో నిర్మించిన ఈ ఆలయం విస్తీర్ణం, స్తంభాలు, శిల్పకళకు ప్రసిద్ధి చెందింది. BCE 356లో హెరోస్ట్రాటస్ అనే వ్యక్తి తన పేరు చరిత్రలో నిలవాలనే ఉద్దేశంతో ఆలయానికి నిప్పు పెట్టినట్లు ప్రాచీన రచనలు పేర్కొంటాయి. అనంతరం ఆలయాన్ని తిరిగి నిర్మించారు. ACE 262లో గోత్‌ల దండయాత్ర సమయంలో అది మళ్లీ దెబ్బతిన్నది. ఆ తర్వాత ఆలయం క్రమంగా నిరుపయోగంగా మారింది. దాని రాళ్లను ఇతర నిర్మాణాలకు తరలించడంతో ప్రస్తుతం కొద్దిపాటి అవశేషాలు మాత్రమే మిగిలాయి.



6) ఇరాక్‌లోని బాబిలోన్ నగరానికి చెందినవిగా చెప్పబడే **హ్యాంగింగ్ గార్డెన్స్ ఆఫ్ బాబిలోన్** ప్రాచీన ప్రపంచంలోని ఏడు వింతల్లో అత్యంత రహస్యమైనది. అనేక అంతస్తుల్లో మొక్కలు, చెట్లు పెరిగేలా నిర్మించిన తోటలుగా ప్రాచీన గ్రీకు రచయితలు వీటిని వర్ణించారు. బాబిలోన్ రాజు నెబుకద్నెజర్ II తన భార్య కోసం వీటిని నిర్మించాడని ఒక ప్రసిద్ధ కథనం. అయితే, ఈ తోటలు బాబిలోన్‌లోనే ఉండేవా, అసలు అవి అక్కడ నిర్మించబడ్డాయా అనే విషయాలపై చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

ఇప్పటివరకు వాటి ఉనికిని నిర్ధారించే స్పష్టమైన పురావస్తు ఆధారాలు లభించలేదు. అందువల్ల అవి ఎలా నాశనమయ్యాయో కూడా కచ్చితంగా చెప్పలేం. ఒకవేళ అవి నిజంగా ఉండి ఉంటే, యుద్ధాలు, నగర పతనం, నీటి సరఫరా వ్యవస్థ దెబ్బతినడం వంటి కారణాలతో కాలక్రమంలో అంతరించి ఉండవచ్చని భావిస్తున్నారు.

ప్రపంచ ఏడు వింతల్లో ఈజిప్టులోని **గిజా మహా పిరమిడ్** మాత్రమే ఇప్పటికీ నిలిచి ఉంది. ఫారో ఖుఫు కోసం BCE 26వ శతాబ్దంలో నిర్మించిన ఈ పిరమిడ్ సుమారు 4,500 సంవత్సరాల చరిత్రను అధిగమించింది. మొదట సున్నపురాయి బాహ్యపొరతో మెరిసేలా కనిపించిన ఈ నిర్మాణంలో ఎక్కువ భాగం నేటికీ నిలిచి ఉన్నప్పటికీ, దాని అసలు బాహ్యరూపం మాత్రం మారిపోయింది.

మిగిలిన ఆరు వింతలు ధ్వంసమైనప్పటికీ, వాటి గురించి ప్రాచీన రచనలు, పురావస్తు అవశేషాలు, చారిత్రక ఆధారాల ద్వారా నేటికీ తెలుసుకోవచ్చు.

– జి.బి.విశ్వనాథ్

ప్రపంచ మధుమేహ రాజధానిగా భారత్


ప్రపంచ దేశాల్లో మధుమేహం లేదా డయాబెటిస్ అత్యధికంగా విస్తరించి ఉన్న దేశంగా భారత్ మరో చరిత్రను సృష్టించడంతో పాటు 'ప్రపంచ మధుమేహ రాజధాని భారత్' అనే ప్రతికూల ఖ్యాతిని మూటగట్టుకుంటున్నది. 'ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్' వివరాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 40 యేండ్లు దాటిన ప్రతి 8 మంది వయోజనుల్లో ఒక్కరు మధుమేహంతో బాధపడుతున్నారని తేలింది. 'డయాబెటిస్ రుగ్మత ఓ నిశ్శబ్ద విధ్వంసం'గా రూపాంతరం చెందుతున్నది. భారత్‌లో అత్యధికంగా 100 మిలియన్లకు పైగా మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2015 వివరాల ప్రకారం 60 శాతం మంది పిల్లల్లో షుగర్ లెవల్స్ సాధారణం కన్న అతిగా ఉన్నట్లు తేలింది. ప్రపంచవ్యాప్తంగా మధుమేహ రుగ్మత వల్ల మానవాళిపై అత్యంత సామాజిక ఆర్థిక భారం పడుతున్నది. భారత్‌లోని గోవా(26.4), పుదుచ్చేరి(26.3), కేరళ (25.5) రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో అత్యధికంగా మధుమేహం ఉన్నట్లు తేలగా, యూపీలో అత్యల్పంగా 4.8 శాతం మాత్రమే ఉన్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అందువల్లనే గోవా/కేరళ రాష్ట్రాలను 'భారత మధుమేహ రాజధానులు'గా పిలుస్తున్నాం. ఢిల్లీ మహానగరంలోనే 29.8 లక్షల మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నారని సమాచారం. దేశ మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో దాదాపు మూడవ వంతు పట్టణాల్లోనే ఉన్నారని, గ్రామీణుల్లో డయాబెటిస్ తక్కువగా ఉన్నట్లు గమనించారు.

అవరోధాల్ని ఛేదిద్దాం, అంతరాలను పూడ్చుదాం

మధుమేహ వ్యాధి వ్యాప్తి పెరగడం, ప్రమాదకరంగా మారడంతో దాని పట్ల ప్రజల్లో అవసర అవగాహనను కల్పించడానికి 1992 నుంచి ప్రతి ఏట నవంబర్ మాసాన్ని 'ప్రపంచ మధుమేహ మాసం (వరల్డ్ డయాబెటిక్ మంత్)'గా పాటించటం ఆనవాయితీగా మారింది. ప్రపంచ మధుమేహ మాసం 2025 ఇతివృత్తంగా 'మధుమేహ అదుపుకు సత్వర చర్యలు (ఎర్లీ ఆక్షన్ ఆన్ డయాబెటిస్)' అనే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. కృత్రిమ ఇన్సులిన్‌ను కనుగొన్న ఫ్రెడ్రిక్ బాంటింగ్ 'ప్రపంచ డయాబెటిస్ దినం' పాటిస్తున్నాం. మధుమేహ వ్యాధికి గల కారణాలు, వ్యాధి లక్షణాలు, నియంత్రణ మార్గాలు, చికిత్స విధానాల పట్ల అవగాహన కలిగిస్తూ 'మధుమేహ నిశ్శబ్ద విధ్వంసాన్ని' ఆపడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

మధుమేహానికి ఊతం ఇవ్వగల కారణాలు

భారత్‌లో మధుమేహం కోరలు చాచడానికి ప్రధాన కారణాలుగా ఆర్థిక/పోషకాహార మార్పులు, స్థూలకాయం, అధిక కాలరీలు/ కొవ్వులు/ షుగర్స్ కలిగిన



ఆహారాలను లొట్టలేసుంటూ తినడం, ఇన్సులిన్ నిరోధకత, శారీరక శ్రమ లోపించడం, సంపన్న జీవనశైలిని కొగిలించుకోవడం, అధిక పని భారం, మానసిక ఒత్తిడి పెరగడం, ఫాస్ట్/జంక్ ఫుడ్ తినడం, పొగ/ఆల్కహాల్ తాగడం లాంటి పలు అంశాలు దోహదపడుతున్నాయి.

మధుమేహ భూతాన్ని తరమడానికి జీవనశైలిలో సానుకూల మార్పులు చేసుకోవడం ప్రధానం. శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, క్రమం తప్పకుండా శారీరక శ్రమ, పొగ/ఆల్కహాల్ మానుకోవడం, గంటల తరబడి కూర్చొని నిశ్చల స్థితిలో పని చేయడాన్ని తప్పించడం, వైద్యుల సలహాలను తీసుకోవడం, షుగర్ పరీక్షలను చేయించుకోవడం లాంటి మార్పులు చేసుకోవాలి.

మధుమేహ వ్యాధి లక్షణాలు

మధుమేహం మూడు రకాలుగా కనిపిస్తుంది. టైప్ 1 డయాబెటిస్, టైప్ 2 డయాబెటిస్, గెస్టేషనల్ (గర్భిణి స్త్రీల్లో) డయాబెటిస్ అనే మూడు రకాల మధుమేహ వ్యాధిగ్రస్తులు కనిపిస్తారు. టైప్ 1 మధుమేహం చిన్నతనంలోనే రావచ్చు. దీనిని నిరోధించలేం. నియంత్రించగల టైప్ 2 డయాబెటిస్ వ్యాధి 40 యేండ్లు దాటిన వారిలో అధికంగా కనిపిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో 90 శాతం మంది టైప్ 2 డయాబెటిస్ బారిన పడ్డారని తెలుస్తున్నది. శరీరానికి అవసరమైన ఇన్సులిన్ విడుదల కాకపోవడం లేదా అవసరానికి మించి షుగర్స్ తినడం వల్ల మధుమేహం ప్రారంభమవుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు గుండె జబ్బులు, స్ట్రోక్, కాళ్లు చేతి భాగాల తొలగింపు, బీపీ,పుండ్లు మానకపోవడం, దాహంగా ఉండడం, తరుచుగా మూత్రం రావడం, బరువు తగ్గడం, బలహీనంగా ఉండడం, అలసట, మానసిక ఉద్రిక్తతలు, కంటి చూపు మందగించడం, నాడీమండలం ప్రభావితం కావడం, మూత్ర పిండాలు చేడు పోవడం, కంటి చూపుపై ప్రభావం పడడం, వినికిడి సమస్యలు ఉత్పన్నం కావడం, కాళ్ల ఇబ్బంది, అల్జీమర్స్ వ్యాధి రావడం, చర్మ/చిగుర్లలో ఇన్‌ఫెక్షన్స్ లాంటి తీవ్రమైన జబ్బులు లేదా వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. ఒకసారి డయాబెటిస్ నిర్ధారణ అయితే జీవితకాలం దానిని పెరగకుండా అదుపులో ఉండే విధంగా నియంత్రించుకోవడమే ఏకైక మార్గం.

ఇలాంటి జీవనశైలి రుగ్మతలు దరికి చేరకుండా చూసుకోవడమే ఉత్తమం. చాప కింద నీరులా 'సైలెంట్ కిల్లర్' రూపంలో ప్రపంచ మానవాళిని కుదిపేసేందుకు సిద్ధంగా ఉన్న మధుమేహాన్ని దగ్గరకు రాకుండా చూసుకోవడానికి సిద్ధంగా ఉందాం, డయాబెటిస్‌ను కట్టడి చేద్దాం.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

స్వేచ్ఛకు ప్రతీక.. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ

న్యూయార్క్ హార్బర్ ప్రవేశద్వారం వద్ద గంభీరంగా నిలబడి ఉన్న ఈ చారిత్రాత్మక "స్టాట్యు ఆఫ్ లిబర్టీ" ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో, భద్రత కోసం, అవకాశాలు కొరకు తమ తమ జీవితాల్లో నూతన అధ్యాయం మొదలు పెట్టడం కోసం వచ్చే అనేక మంది వలసదారులకు స్వాగతం పలుకుతూ ఉంటుంది. అమెరికాలో సుమారు ఐదు సంవత్సరాలు పాటు 1861-65 మధ్య కాలంలో జరిగిన అంతర్యుద్ధం (సివిల్ వార్) ముగింపుతో, బానిసత్వం నిర్మూలనతో 1865లో తిరిగి నూతన దేశంగా నిర్మితమైన అమెరికాకు బహుమతిగా ఇవ్వాలనే ఆలోచనకు, ఈ స్టాట్యు ఆఫ్ లిబర్టీ విగ్రహ నిర్మాణానికి తొలి బీజం పడింది. దేశ సార్వభౌమత్వం నిలబడటానికి, బానిసత్వం నిర్మూలనతో స్వేచ్ఛ, సమానత్వం అందరికీ అందించడంలో అమెరికా సఫలీకృతమైన సందర్భంగా ఈ విగ్రహం ఏర్పాటు చేయాలనే ఆలోచన మెదిలింది.. ఫ్రాన్స్ కు చెందిన చరిత్రకారుడు ఈ.ఆర్.డి.లాబౌలే అమెరికాలో ఈ పరిణామాలు సున్నితంగా పరిశీంచి, అమెరికా ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ వ్యవస్థపై ప్రగాఢ విశ్వాసం విశ్వాసం వ్యక్తం చేశారు.. 1886లో అమెరికా శత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒక మంచి బహుమానం అందించాలనే ఉద్దేశం లాబౌలేకు 1876లో కలిగింది.. ఇరుదేశాలు ఫ్రాన్స్-అమెరికా మధ్య స్నేహం, ప్రజాస్వామ్య వ్యవస్థలు మరింత బలోపేతం చేయడానికి ఒక గిఫ్ట్ ఇవ్వాలని నిర్ణయించాడు. అదే సమయంలో ఫ్రాన్స్ లో కూడా కొన్ని అస్థిరత పాలనలు జరుగుతున్నాయి. ఈయన ఇచ్చే బహుమతి భవిష్యత్తులో ఫ్రాన్స్ లో కూడా మంచి ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడుతుంది అనే ప్రగాఢ విశ్వాసంతో ముందుకు కదిలాడు. తాను నిర్మించే మాన్యుమెంట్ మంచి సౌందర్యవంతమైనదిగానే కాకుండా, ఒక మంచి సందేశాత్మక నిర్మాణంగా ఉండాలని కోరుకున్నాడు.. ఈ ఆలోచన, అప్పటికే భారీ విగ్రహాలు తయారు చేయడంలో నిపుణత కలిగిన ఫ్రెడరిక్ ఆగస్ట్ బార్తోల్డితో పంచుకున్నాడు.. ఈ విధంగా లాబౌలే, బార్తోల్డి ఇద్దరి ఆలోచనలతో నిర్మితమైన స్టాట్యు ఆఫ్ లిబర్టీ విగ్రహం 1886 నాటికి వాస్తవరూపం ధరించింది.



ఇక లాబౌలే ఆలోచనలకు జీవం పోసే దిశగా తన శిల్ప నిర్మాణానికి మేధోమథనం చేయడానికి బార్తోల్డి సిద్ధమైనాడు. ఒక స్త్రీమూర్తి పోడవైన లూజుగా ఉండే వస్త్రాలు ధరించి, తన కుడి చేతిలో టార్చి లైట్ పట్టుకుని, ఎడమ చేతిలో అమెరికా స్వాతంత్ర్యం ప్రకటన పలకం పట్టుకునే విధంగా, కాళ్ళ వద్ద సంకెళ్లు పగులగొట్టినట్లు (బ్రోకెన్ చైన్) బానిసత్వం నుండి విముక్తి కలిగే అర్థం స్ఫురించే విధంగా తన విగ్రహాన్ని ఊహించి, తదనుగుణంగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాడు. విగ్రహ సైజ్, భౌతిక రూపం కంటే, ఆ విగ్రహం చూడటం ద్వారా అందులోని ఆశయాలు పలువురిని ఆలోచింప చేయడానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.

ఈ విగ్రహం తయారీలో ప్రముఖ ఇంజనీర్ గుస్టావ్ ఈఫిల్ ప్రముఖ పాత్ర పోషించారు. హార్బర్ వద్ద వీచే ప్రచండ గాలులు, అక్కడ వాతావరణం తట్టుకునే విధంగా తయారు చేసారు. దాదాపు తొమ్మిది సంవత్సరాలు సంవత్సరాల నిరంతరం కృషితో ప్యారిస్‌లో విగ్రహం తయారు చేసారు. విగ్రహం పూర్తి రూపం సంతరించుకునే సమయంలో తల, చేతులు, వివిధ రకాల విడి భాగాలు చూడటానికి ప్రజలకు వీలు కల్పించారు.1884లో తయారైన విగ్రహం అమెరికా వారికి ఫ్రాన్స్‌లో అందించారు. ఇలా తయారైన పూర్తి విగ్రహాన్ని 214 విడి విడి భాగాలుగా ప్యాక్ చేసి, ఫ్రాన్స్‌కు చెందిన 'ఐజర్' వెసల్ ద్వారా బయలుదేరి, జూన్ 17, 1885 న్యూయార్క్ హార్బర్‌కి చేరుకుంది.. శోభాయమానంగా తయారైన పెడస్టల్‌పై, లాబౌలే ఆలోచనలకు అనుగుణంగా, బార్తోల్డి సృజనాత్మతకతతో, అత్యంత ప్రతిష్టాత్మకంగా తయారైన స్టాట్యూ ఆఫ్ లిబర్టీ, అక్టోబర్ 28, 1886లో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అప్పటి అమెరికా అధ్యక్షుడు గ్రోవర్ క్లీవ్ లాండ్ చేతులు మీదుగా కొద్దిమంది ప్రజానీకం సమక్షంలో, కొందరు అధికారులు, అతిథులు సమక్షంలో ఫ్రెంచ్ వారు అందించిన విగ్రహాన్ని ఆవిష్కరించారు. నావికాదళం ఊరేగింపులు, పేరేడ్‌లు హార్బర్ వద్ద, న్యూయార్క్ నగరంలో సందడిగా సాగింది. ఈ చారిత్రాత్మక ఘట్టం ఫ్రాన్స్-అమెరికా మధ్య స్నేహ బంధానికి మైలురాయిగా నిలిచిపోయింది. పురుషులతో సమానంగా మహిళలకు, సమాజంలో అందరికీ సమానత్వం, స్వేచ్ఛ ఉండాలనే ఆకాంక్షలు వ్యక్తం చేశారు. జాతీయ భావానికి, సామాజిక, రాజకీయ హక్కులు కోసం ఈ విగ్రహం దిశానిర్దేశం చేసేదిగా నిలిచింది. ఆ విధంగా న్యూయార్క్‌లో ఏర్పాటు చేసిన స్టాట్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహం ఎందరో వలసదారులకు సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన కల్పించేందుకు ఉపయోగపడుతుంది. సమానత్వం సౌభ్రాతృత్వం సహనం శాంతి సామరస్యం స్వేచ్ఛ వంటి అంశాలు బోధించే దిక్సూచిగా ఉంది. ముఖ్యంగా పేదరికం, నిరక్షరాస్యత నిర్మూలనకు, వివక్షతలను పారదోలడానికి ప్రతీకగా ఈ విగ్రహం నిలబడింది. ఎంతోమంది తమ సొంత ఊళ్లను వదిలి, ఉద్యోగ ఉపాధి అవకాశాలతో తమ జీవితాలను మెరుగు పరచుకోవడానికి సూచికగా విగ్రహం చేతిలోని టార్చ్‌లైట్ వెలుగు పంచే సూచికగా విరాజిల్లుతోంది. ఈ విగ్రహంపై అమెరికా కవయిత్రి ఎమ్మా లాజరస్ అనేక కవితా దీపాలు వెలిగించింది.

స్టాట్యూ ఆఫ్ లిబర్టీ కేవలం స్వేచ్ఛకు మాత్రమే చిహ్నంగా కాకుండా, తరచి తరచి చూస్తే అనేక అంశాలు బోధపడుతూ ఉంటాయి. ముఖ్యంగా చేతిలోని టార్చ్ లైట్ జ్ఞానోదయం కలిగించే సూచికగానే కాక, అనేక ఆలోచనలు కలిగించే ఆయుధంగా కనపడుతుంది. కింద భూభాగం నుండి టార్చ్ చివరి వరకు మొత్తం 93 మీటర్లు ఎత్తు కలిగిన స్టాట్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహం నేటికి ప్రపంచానికి అనేక అంశాల్లో స్ఫూర్తిని నింపుతోంది. భారత్‌లో పర్యటించే వారు తాజ్ మహల్‌ను చూసి ఎంత మురిసిపోతారో, అమెరికా వెళ్ళిన వారు స్టాట్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహం చూసి అంతగా సంబరపడిపోతారు.

– ఐ.ప్రసాదరావు

ఆటలతో ఆరోగ్యం.. కళలతో సృజనాత్మక వికాసం

"శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అన్న సనాతన ఆర్యోక్తి మానవ జీవితంలో సమస్త ధర్మాచరణకు, ఉన్నత లక్ష్యాల సాధనకు శారీరక దారుఢ్యమే ప్రప్రథమ సాధనమని తేటతెల్లం చేస్తోంది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో సూక్తిసుధాకరమైన కావ్యాలు, సంభాషణలు కూడా "దేహమును పెంచకున్న జ్ఞానము నిలువదు, జ్ఞానము లేకున్న దేహము బరువగును" అంటూ విద్యార్థి సమగ్ర వికాసానికి దేహదారుఢ్యానికి గల అవినాభావ సంబంధాన్ని స్పష్టం చేశాయి. విద్యాభ్యాసమంటే పాఠ్యపుస్తకాల్లోని అక్షరాలను కంఠస్థం చేయడం, పరీక్షల పత్రాలపై సమాధానాలను గుమ్మరించి అంకెల మార్కులను, ర్యాంకులను పోగేసుకోవడం కాదు. విద్య అనేది మేధస్సుతో పాటు దేహాన్ని దృఢపరచి, భావోద్వేగాలను సమతుల్యం చేసి, సామాజిక స్పృహను పెంపొందించే ఒక నిరంతర సంస్కార యజ్ఞం.

ప్రాచీన కాలపు భారతీయ గురుకుల విద్యావిధానాన్ని పరిశీలిస్తే, అక్కడ వేదాలు, ఉపనిషత్తులు, గణిత శాస్త్రాల అధ్యయనంతో పాటు ధనుర్విద్య, గదాయుద్ధం, మల్లయుద్ధం, ఈత, లలిత కళల సాధన.. లాంటి కఠిన శారీరక కార్యకలాపాలు విద్యార్థి నిత్యకృత్యంలో అంతర్భాగంగా ఉండేవి.

స్వామి వివేకానందుడు యువతను మేల్కొలుపుతూ "భగవద్గీత చదవడం కన్నా ఫుట్‌బాల్ మైదానంలో ఆడుకోవడం ద్వారా మీరు స్వర్గానికి మరింత చేరువవుతారు" అని ప్రబోధించడం వెనుక గల పరమార్థం కూడా ఇదే. ఉక్కులాంటి నరాల పటుత్వం, ఇనుప కండరాల పుష్టి, గుండెల నిండా చెదరని మనోధైర్యం లేనిదే ఏ గొప్ప ఆదర్శాన్ని ఆచరణలో నిలబెట్టలేమని, నిర్వీర్యమైన దేహంతో మహత్తర ఆలోచనలను మోయలేమని ఆయన ప్రగాఢంగా విశ్వసించారు.

నేటి యాంత్రిక పోటీ ప్రపంచంలో తరగతి గదుల నాలుగు గోడల మధ్య ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్న బాల్యానికి ఆటపాటలు, లలిత కళారూపాలు సంజీవని లాంటి ప్రాణవాయువును అందిస్తాయి. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, సహజాత భావవ్యక్తీకరణకు సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, జానపద కళారూపాలు కల్పించే ప్రేరణ అనన్య సామాన్యమైనది. పాటలు పాడడం, సంగీత నాద మాధుర్యాన్ని ఆస్వాదించడం, నృత్యం చేయడం వల్ల మనసులోని ఒత్తిడి కరిగిపోయి నూతనోత్తేజం వెల్లివిరుస్తుంది.

నాటకాల్లో విభిన్న పాత్రలను పోషించేటప్పుడు, వేదికపైకి ఎక్కి



సంభాషణలు పలికేటప్పుడు విద్యార్థిలోని బిడియం, భయం, జంకు పటాపంచలై అద్భుతమైన వాక్పటిమ, ధీరత్వంతో కూడిన ఆత్మవిశ్వాసం వేళ్లూనుకుంటాయి. ఇతరుల ముందు తమ భావాలను నిర్భయంగా, స్పష్టంగా వెల్లడించే నేర్పు విద్యార్థులకు లభిస్తుంది. మన పల్లెల్లో నిక్షిప్తమైన జానపద ఆటలు, కోలాటాలు, బతుకమ్మ పాటలు, తోలుబొమ్మలాటలు, యక్షగానాలు, గిరిజన కళారూపాలు.. మొ॥ విద్యార్థులకు తమ పూర్వీకుల సంస్కృతీ సంప్రదాయాల వైభవాన్ని కళ్లకు కట్టినట్లు పరిచయం చేసి, వారిని మూలాలతో అనుసంధానిస్తాయి. ఆధునిక విజ్ఞాన సముపార్జనతో పాటు స్థానిక కళలను, మట్టి పరిమళం వెదజల్లే సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించడం ద్వారా నేటి తరం భవిష్యత్తు తరాలకు అమూల్యమైన సాంస్కృతిక వారసత్వ సంపదను సగర్వంగా అందించ గలుగుతుంది.

చారిత్రక, శాస్త్రీయ దృక్పథాన్ని పరిగణనలోకి తీసుకునే నూతన జాతీయ విద్యావిధానం-2020 కంఠస్థ విద్యకు స్వస్తి పలికి, క్రీడలు, కళలు, ప్రయోగాత్మక అభ్యాసం కలగలిసిన సమగ్ర విద్యకు పెద్దపీట వేసింది. పరీక్షల్లో మార్కులు సంపాదించడం మాత్రమే కాకుండా అనుభవపూర్వకంగా నేర్చుకోవడం, సృజనాత్మకంగా ఆలోచించడం, సంక్లిష్ట సమస్యలను సమయస్ఫూర్తితో పరిష్కరించుకోవడం వంటి నైపుణ్యాలను పెంపొందించడం నూతన విద్యావిధానంలోని మౌలిక లక్ష్యం. ఈ ఆదర్శాల సాధనకు క్రీడలు, సమూహ కార్యక్రమాలు ప్రధాన సాధనాలుగా ఉపకరిస్తాయి.

పాఠశాల విద్యలో క్రీడలను కేవలం ఏదో ఏడాదికోసారి నిర్వహించే వార్షికోత్సవాలకో, జాతీయ క్రీడా దినోత్సవాలకో పరిమితం చేయకుండా నిత్య విద్యా బోధనా ప్రక్రియలో అంతర్భాగం చేయాల్సిన చారిత్రక బాధ్యత విద్యారంగంపై ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) జారీ చేసిన అంతర్జాతీయ మార్గదర్శకాల ప్రకారం 5-17 యేళ్ల వయస్సు గల బాలబాలికలు, కౌమార దశలోని వారు ఆరోగ్యకరమైన పెరుగుదల కోసం ప్రతిరోజూ కనీసం 60 ని॥ వ్యాయామం లేదా ఆటల్లో నిమగ్నం కావాలి. అంతేకాకుండా, ఎముకలు, కండరాలను బలోపేతం చేసే దృఢత్వ కార్యకలాపాలను వారానికి కనీసం మూడు రోజులైనా తప్పనిసరిగా ఆచరించాలని వైద్య పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

నిత్యం వ్యాయామం చేయడం వల్ల శరీరంలో రక్తప్రసరణ మెరుగై, మెదడుకు ప్రాణవాయువు సమృద్ధిగా అంది జ్ఞాపకశక్తి, గ్రహణ సామర్థ్యం రెట్టింపు అవుతాయి. అయితే, నేటి డిజిటల్ యుగపు వ్యసనాలు, స్మార్ట్‌ఫోన్ల తెరల ముందు కరిగిపోతున్న సమయం ఆధునిక బాల్యాన్ని ప్రమాదకరమైన మాయాజాలంలో బంధిస్తున్నాయి. కంప్యూటర్ వీడియో గేమ్‌లు,

సామాజిక మాధ్యమాల ముందు గంటల తరబడి నిశ్చలంగా కూర్చుండి పోవడం వల్ల పిల్లల్లో స్థూలకాయం, చిన్న వయసులోనే బాల్య మధుమేహం, రక్తపోటు, కంటిచూపు మందగించడం, నిద్రలేమి, తీవ్రమైన మానసిక కుంగుబాటు వంటి సమస్యలు పెను సవాళ్లుగా మారుతున్నాయి. డిజిటల్ తెరలు విజ్ఞాన సమాచారాన్ని అందించగలవేమో గానీ, ఆటస్థలంలో స్నేహితులతో కలిసి పరిగెత్తినప్పుడు లభించే ప్రాకృతిక అనుభూతిని, శారీరక చురుకుదనాన్ని, సమూహ బలాన్ని ఎన్నటికీ భర్తీ చేయలేవు. భారత క్రీడారంగ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, ఒలింపిక్ వేదికపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన కరణం మల్లేశ్వరి, పి.వి. సింధు, పరుగుల రాణి పి.టి. ఉషల విజయగాథలను పరిశీలిస్తే, వారిలోని అచంచల సంకల్ప బలానికి, పరాజయాల నెదుర్కొనే గుండె నిబ్బరానికి మైదానంలో చిందించిన స్వేదమే పునాది అని స్పష్టమవుతుంది. ఆటస్థలం అనేది సమానత్వాన్ని, నాయకత్వ లక్షణాలను, సమష్టి సహకారాన్ని, ఓటములను హుందాగా స్వీకరించి మళ్లీ గెలుపు కోసం పోరాడే సమచిత్తాన్ని నేర్పే సజీవ విశ్వవిద్యాలయం.



ఈ విద్యా సంస్కరణలు క్షేత్రస్థాయిలో సఫలం కావాలంటే పాఠశాలలు, విద్యాసంస్థల నిర్వహణలో సమూలమైన ప్రక్షాళన జరగాలి. పట్టణాల్లో అపార్ట్‌మెంట్ల ఇరుకు గదుల్లో నడిచే పాఠశాలలకు స్వస్తి పలికి, ప్రతి పాఠశాలలోనూ అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి ఆటస్థలాలు, శారీరక వ్యాయామానికి అనువైన మైదానాలు, క్రీడా పరికరాలు సమకూర్చడం తప్పనిసరి నిబంధన కావాలి. ప్రతిరోజూ విద్యార్థులకు ఆటల కోసం పాఠశాల కాలపట్టికలో ప్రత్యేక సమయాన్ని కేటాయించాలి. శిక్షణ పొందిన వ్యాయామ ఉపాధ్యాయులను (పీఈటీ) నియమించడంతో పాటు వివిధ క్రీడల్లో సహజ ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రాథమిక దశలోనే గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందించాలి. పాఠశాలల మధ్య, మండలాల స్థాయిలో నిరంతరం క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందించవచ్చు. క్రీడల్లో విజేతలకు బహుమతులు అందించడమే కాకుండా క్రమశిక్షణతో పాల్గొన్నవారిని, పట్టుదల ప్రదర్శించినవారిని, జట్టు స్ఫూర్తిని చాటినవారిని కూడా గుర్తించి అభినందించాలి. అప్పుడు ఆటల్లో పాల్గొనడం అనేది కేవలం పతకాలు, ట్రోఫీల కోసం మాత్రమే కాకుండా ఉన్నతమైన వ్యక్తిత్వ వికాసానికి రాజమార్గమవుతుంది.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య క్రీడా సౌకర్యాల్లో నేడు నెలకొన్న తీవ్రమైన వ్యత్యాసాలను తక్షణమే రూపుమాపాల్సిన అవసరం ఉంది. గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో ఆర్థిక స్తోమత లేక మరుగున పడిపోతున్న అపార క్రీడా ప్రతిభను వెలికితీయాలి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు, అట్టడుగు వర్గాల బాలబాలికలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన క్రీడా శిక్షణ, సమతుల్య పౌష్టికాహారం ప్రభుత్వం తరఫున ఉచితంగా అందాలి. ముఖ్యంగా బాలికలు మైదానాల్లోకి వచ్చి నిర్భయంగా ఆడుకోవడానికి అవసరమైన ప్రోత్సాహం, సురక్షితమైన వాతావరణం, ప్రత్యేక వసతులు కల్పించాలి. దివ్యాంగ విద్యార్థుల కోసం వారి శారీరక అవసరాలు, సామర్థ్యాలకు అనుగుణంగా ప్రత్యేక క్రీడాంశాలను అందుబాటులోకి తీసుకురావాలి. ప్రతిభ ఉన్న పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా క్రీడలకు దూరం కాకుండా ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, క్రీడా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు స్కాలర్‌షిప్పుల రూపంలో తోడ్పాటునందించాలి.

పిల్లలు ఆటలకు, కళలకు వెచ్చించే సమయాన్ని చదువుకు నష్టం కలిగించే వృథా ప్రయాసగా భావించే పెద్దలు సంకుచిత వైఖరిని పెద్దలు విడనాడాలి. సమయపాలనతో చదువు, ఆటలు రెండింటినీ సమన్వయం చేసుకోవడం పిల్లలకు నేర్పాలి. పిల్లల నైరూప్య ఆసక్తులను గుర్తించి ప్రోత్సహించాలే తప్ప, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఇంజినీరో, డాక్టరో కావాలనో; లేక క్రికెట్ స్టార్‌గానో, ఒలింపిక్ విజేతగానో అవతరించాలనే అపరిమితమైన అంచనాలు, మానసిక ఒత్తిడి వారిపై రుద్దకూడదు. పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగడానికి తోడ్పడడమే తల్లిదండ్రుల ప్రథమ కర్తవ్యం కావాలి. విద్యార్థులు కూడా తమ అమూల్యమైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. చదువుకు నిర్దిష్ట సమయాన్ని కేటాయించినట్లే ఆటలకు, వ్యాయామానికి సమయం కేటాయించాలి. పరీక్షల సమయంలోనూ శరీరానికి అవసరమైన విశ్రాంతి, వ్యాయామం, తగిన నిద్రను నిర్లక్ష్యం చేయకూడదు. ఆరోగ్యకరమైన సంప్రదాయ ఆహారం, తగినంత నీరు, క్రమబద్ధమైన జీవనశైలి.. శారీరక దృఢత్వానికి పునాదులవుతాయి.

పోటీల్లో పాల్గొనేటప్పుడు క్రీడా నిబంధనలను గౌరవించడం, ప్రత్యర్థులను ఆదరించడం, గెలిచినప్పుడు విర్రవీగకపోవడం, ఓడినప్పుడు కుంగిపోకుండా తిరిగి పోరాడే గుణాన్ని అలవరచుకోవాలి. చదువుతో పాటు ఆటపాటలకు, లలిత కళలకు ప్రాధాన్యం ఇవ్వడం అనేది విద్యార్థులకు కల్పించే ఏదో అదనపు సౌకర్యం మాత్రమే కాదు; అది జాతి సమున్నత భవిష్యత్తు కోసం చేసే శాశ్వత పెట్టుబడి.

గ్రంథాలయాలు, పుస్తకాలు జ్ఞానాన్ని అందిస్తే, ఆటలు ఆ జ్ఞానాన్ని నిజ జీవిత సవాళ్లలో ఆచరణాత్మకంగా ఉపయోగించేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసాన్ని, క్రమశిక్షణను, సహనాన్ని పెంపొందిస్తాయి. తరగతి గది ఆలోచనలకు పదును పెడితే, ఆటస్థలం ఆ ఆలోచనలను ఆచరణలో పెట్టే కార్యదక్షతను నేర్పుతుంది; లలిత కళలు హృదయానికి ఆర్ద్రతను, సృజనాత్మక సౌందర్యాన్ని చేకూరుస్తాయి. ఒకవైపు విద్యార్జనలో రాణిస్తూనే మరోవైపు శారీరకంగా ఉక్కు పిడికిలి వంటి దృఢత్వంతో, మానసికంగా ప్రశాంతంగా, సామాజికంగా బాధ్యతాయుతంగా ఎదిగినప్పుడే విద్యార్థి జీవితం సార్థకమవుతుంది. మార్కుల పట్టికలోని అంకెలతోనే పిల్లల భవితను కొలవడం మాని, వారి ఆరోగ్యం, ఆనందం, సృజనాత్మకత, నైతిక విలువలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాలలు, తల్లిదండ్రులు, పాలకులు సమన్వయంతో కృషి చేసి ప్రతి విద్యార్థికి ఆటపాటల విస్తృత అవకాశాలు కల్పించాలి. చదువుతో విజ్ఞానం, ఆటలతో ఆరోగ్యం, కళలతో సృజనాత్మకత, విలువల మేళవింపుతో కూడిన ప్రవర్తన అలవడినప్పుడే దేశానికి సమర్థులైన ఆదర్శ పౌరులు లభిస్తారు, సమాజం సుసంపన్నమవుతుంది.

– రామకిష్టయ్య సంగనభట్ల

ఇంటిని తూర్పు వైపు పెంచి కట్టుకోవచ్చా?

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్స్: 9885446501/9885449458



సి.శ్రీనివాస్, కడప

ప్రశ్న: ఐదు సంవత్సరాల క్రితం ఇల్లు నిర్మించుకున్నాం. ప్రస్తుతం బాగానే ఉన్నది. తూర్పున ఖాళీ స్థలం వదిలాం. అందువల్ల ఇప్పుడు ఈ ఇంటిని తూర్పు పది అడుగులు పెంచి కట్టాలని అనుకుంటున్నాం. అలా చేయవచ్చా?

జవాబు: మీకు ఉన్నటువంటి సందేహమే చాలా మందికి ఉంటుంది. అందువల్ల సమాధానం చెప్పేముందు మన ప్రాచీన వాస్తు గ్రంథాలలో ఉన్న వివరాలు కొన్ని తెలుసుకోవటం అవసరం.

శ్లో॥ ఇచ్ఛేద్యది గృహవృద్ధిం తత్సమంతా
ద్విపర్దయే త్తుల్యం ।
ఏకోద్దేశే దోషః ప్రాగ ధనాప్యుత్తరే కుర్యాత్ ।
ప్రాగ్భవతి మిత్రవైరం మృత్యుభయం
దక్షిణేన యదివృద్ధిః
అర్థ వినాశః పశ్చాదుదగ్
వృద్ధిర్మనస్తాపః(బృహత్ సంహిత)

తా॥ కట్టబడిన ఒక గృహాన్ని పెంచి కట్టాలని అనుకుంటే, ఆ గృహాన్ని నాలుగు వైపుల సమానంగా పెంచుతూ కట్టాలి. కానీ ఏదైనా ఒక వైపుకు మాత్రమే పెంచి కట్టకూడదు. కేవలం తూర్పు దిక్కుకు పెంచి కట్టినట్లయితే మిత్రులతో వైరం కలుగుతుంది.

దక్షిణ దిక్కుకు మాత్రమే పెంచి కట్టినట్లయితే మృత్యు భయం కలుగుతుంది. కేవలం పశ్చిమ దిక్కుకు మాత్రమే పెంచి కట్టినట్లయితే ధన నాశనం అవుతుంది. ఈ వివరాలు 'బృహత్ సంహిత', 'వాస్తు రాజవల్లభము' అనే ప్రసిద్ధ గ్రంథాల్లో పేర్కొన్నారు.

శ్లో॥ హర్మ్యప్యాపి సమృద్ధయే గృహపతి
ర్వృద్ధిం యదాపి హతే ।
పశ్చాదర్ధవినాశి దక్షిణ దిశః శత్రోర్భయం
వర్ధతే ॥ (వాస్తు రాజవల్లభము)

తా॥ నాలుగు దిక్కులకు సమానంగా గృహం పెంచాలి. ఏదైనా ఒక దిక్కుకు గానీ, రెండు దిక్కులకు గానీ, మూడు దిక్కులకుగానీ పెంచి కట్టడం



శుభదాయకంగా ఉండదు. తూర్పు దిక్కుకు మాత్రమే పెంచి కడితే వైరం కలుగుతుంది. ఉత్తర దిక్కుకు మాత్రమే పెంచి కడితే మనస్తాపం కలుగుతుంది. పశ్చిమ దిక్కుకు మాత్రమే పెంచి కడితే ధన నాశనం కలుగుతుంది. దక్షిణ దిక్కుకు పెంచి కడితే శత్రుభయం కలుగుతుంది. అయితే, పైన పేర్కొన్న విషయాలు, ప్రాచీన కాలం నాటి అంటే గ్రంథస్థ కాలం నాటి గృహ నిర్మాణ పద్ధతులకు సరిపడే నియమాలుగా భావించవచ్చు. కాలగతిలో మారినటువంటి ప్రస్తుత గృహ నిర్మాణ క్రమ పద్ధతుల వల్ల పైన పేర్కొన్న నియమాలలో మార్పులకు వెసులుబాటు ఉన్నది. కానీ ఏ గృహాన్ని అయినా ఎట్టి పరిస్థితులలోను పశ్చిమ దిక్కుకు గానీ, దక్షిణ దిక్కుకు గానీ పెంచి కట్టకూడదు.

గృహ నిర్మాణ క్షేత్రాన్ని బట్టి వాస్తుకు అనుకూలమైన వెసులుబాటు వున్నప్పుడు మాత్రమే గృహాన్ని తూర్పు దిక్కుకు గానీ, ఉత్తర దిక్కుకు గానీ పెంచి కట్టుకోవచ్చు. గృహం చక్కని ఫలితాలు ఇస్తున్నప్పుడు ఇలాంటి మార్పులు చేయటానికి బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. మీరు సమగ్రమైన కొలతలతో ఇంటి ప్లానును పంపించినట్లయితే ఇంటిని పెంచి కట్టుకోవచ్చో లేదో చెప్పే అవకాశం ఉంటుంది.

ఒకప్పుడు బాగుండేవాళ్లం..

బి.కామాక్షి, అరక్కోణం

ప్రశ్న: పూర్వం మా ఇంటి బాధ్యతలు మా తాతయ్య గారు చేపట్టినప్పుడు ఎటువంటి సమస్యలు లేకుండా ఇల్లు అష్ట ఐశ్వర్యాలతో కళకళలాడేది. తరువాత కాలంలో నాన్నగారు కొంత స్థలాన్ని ఇంటివెనక కొన్నారు. అప్పటివరకు నైరుతికి ఉన్న మార్గం ఈశాన్యానికి మార్చటం జరిగింది. ఆ స్థలం కొన్న తరువాత అప్పులు అయ్యాయి. పదిహేను సంవత్సరాల క్రితం అన్నయ్య చనిపోయాడు. మేనత్తలు విడిపోయారు. మీరు అన్నట్లు బుద్ధుడ వేధ ప్రకారం స్వగృహంలో నీరు భూమి లోపలి నుండి వర్షాకాలంలో తమంతట తామే పైకి వస్తోంది. దీనికి పరిష్కారం అర్థం కావటం లేదు. మీరూ ఏదైనా పరిష్కారం తెలుపగలరని ఆశిస్తున్నాం.

జవాబు: మీ గృహం ప్లాను చూసాను. సమస్య చాలా తీవ్రంగా ఉంది. మీ సమస్యకు పరిష్కారం పత్రికా ముఖంగా ఇవ్వడం కుదరదు. నేను మీ ప్రాంతానికి వచ్చినప్పుడు కలవండి. అవసరమైన సలహాలు, సూచనలు తెలియచేస్తాను.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే,
రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : .....
పుట్టిన తేది : .....
జన్మ నక్షత్రం: .....తల్లి పేరు: .....
చిరునామా:.....

వేగంగా కరిగిపోతున్న హిమనీనదాలు

గత దశాబ్ద కాలంలో ప్రపంచ వ్యాప్తంగా హిమనీనదాలు అత్యంత వేగంగా కరిగిపోయాయి, 1976 నుండి జరిగిన మొత్తం మంచు నష్టంలో దాదాపు 41 శాతం కేవలం ఈ చివరి దశాబ్దంలోనే సంభవించింది. వరల్డ్ గ్లేసియర్ మానిటరింగ్ సర్వీస్, ప్రపంచ వాతావరణ సంస్థ నివేదికల ప్రకారం, చరిత్రలోనే అత్యధికంగా మంచు కరిగిన అత్యధిక 10 సంవత్సరాలలో 8 సంవత్సరాలు 2010 తర్వాతే నమోదయ్యాయి. 2023లోనే రికార్డు స్థాయిలో 548 గిగాటన్నుల మంచు కరిగిపోయింది, ఇది సముద్ర మట్టాన్ని ఒక్క ఏడాదిలోనే 1.5 మి.మీ. పెంచింది. 2025 హైడ్రోలాజికల్ సంవత్సరంలో సుమారు 408 గిగాటన్నుల మంచు కరిగి సముద్రంలో కలిసింది.

గత దశాబ్దంతో పోలిస్తే హిమాలయాల్లో హిమనీనదాలు కరిగే వేగం బాగా పెరిగింది. దీనివల్ల భారత్‌లో సుమారు 200 హిమనద సరస్సులు అధిక ప్రమాదకరమైనవిగా 56 అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు అధ్యయనాలు తెలియచేస్తున్నాయి.

హిమానీనదాలు, వాటి ప్రాముఖ్యత

హిమానీనదం అంటే శీతల ప్రాంతాలలో లేదా పర్వతాలపై వేల సంవత్సరాల పాటు మంచు కరగకుండా పేరుకుపోయి, దట్టంగా తయారైన భారీ మంచు దిమ్మ లేదా ప్రవహించే మంచు నది. పర్వత ప్రాంతాలు లేదా ధ్రువాల్లో ఉష్ణోగ్రత 0C. కన్నా తక్కువగా ఉన్నప్పుడు పడే మంచు కరగకుండా అలాగే ఉండిపోతుంది. ప్రతి సంవత్సరం పడే కొత్త మంచు పొరల బరువు కారణంగా కింద ఉన్న మంచు గట్టిపడి, స్ఫటికీకరణ చెంది సాంద్రత గల గ్లేసియర్ మంచుగా మారుతుంది. నేచర్ జర్నల్ ఏప్రిల్ 2026 సంచికలో ప్రచురించిన అధ్యయనం ప్రకారం, ఉత్తరాఖండ్‌లోని గర్వాల్ హిమాలయాల్లోని అలకనంద బేసిన్‌లో 219 హ్యాంగింగ్ గ్లేసియర్‌లను గుర్తించారు. ఈ గ్లేసియర్‌లు సుమారు 71.7 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. వీటిలో సుమారు 2.39 క్యూబిక్ కిలోమీటర్ల మంచు ఉందని అంచనా. ఇందులో సుమారు 0.74 క్యూబిక్ కిలోమీటర్ల మంచు అత్యంత సున్నితమైన 'హ్యాంగింగ్ ఐస్ మాస్'గా ఉంది. సమతుల్యత కోల్పోవడం వల్ల అవి అకస్మాత్తుగా భారీ హిమసంపాతాల రూపంలో కూలిపోవచ్చు. అధ్యయనం ప్రకారం, అస్థిరంగా ఉన్న ఈ మంచులో సుమారు మూడింట ఒక వంతు అలకనంద బేసిన్ ఎగువ ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉంది. ఒకవేళ ఈ భాగం విరిగిపోతే, అలకనంద నది వెంబడి సంభవించే వరద భారీ విధ్వంసానికి కారణం కావచ్చు. బద్రీనాథ్, మాన ప్రాంతంలో ఒక వేలాడే హిమానీనదం విరిగిపోతే, అది 50 మీటర్లకు పైగా (సుమారు 15 అంతస్తుల భవనం ఎత్తు) మంచు, శిథిలాల ప్రవాహానికి కారణం కాగలదని ఈ అధ్యయనం వెల్లడిస్తోంది.

మూత్ర విసర్జనతో ప్రమాదం

'రీజినల్ ఎన్విరాన్‌మెంటల్ చేంజ్' పత్రికలో ప్రచురితమైన ఖిమ్ లాల్ గౌతమ్, సహచరుల నేతృత్వంలో జరిపిన శాస్త్రీయ పరిశోధన, అధ్యయనం ప్రకారం, ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌లో జరిగే కాలానుగుణ కార్యకలాపాలు హిమానీనదంపై ఎలా ప్రభావం చూపుతాయో స్పష్టం చేస్తుంది. 37C వేడితో విసర్జించే మానవ మూత్రం వల్ల ఒక పర్వతారోహణ సీజన్‌లో సుమారు 154 టన్నుల మంచు కరిగిపోతుందని అంచనా. ఈ క్యాంప్‌కు వచ్చే పర్వతారోహకులు, గైడ్‌లు ఎత్తైన ప్రదేశాలలో డీహైడ్రేషన్‌ను నివారించడానికి అధిక మొత్తంలో సేవించే నీటి కారణంగా, ప్రతిరోజూ 6,000 లీటర్లకు పైగా మూత్రాన్ని విసర్జిస్తారు. ఈ అధ్యయనం ప్రకారం, ఎవరెస్ట్ పర్వతాన్ని సందర్శించే పర్వతారోహకుల కార్యకలాపాల వల్ల ప్రతి ఏటా సుమారు 2,500 టన్నుల హిమానీనద మంచు, హిమపాతం కరిగిపోయే అవకాశం ఉంది.

ఈ విశ్లేషణ ప్రకారం, ఈ ప్రభావం కేవలం వేడి చేయడానికి, వంట చేయడానికి ఉపయోగించే ఇంధనం వల్ల మాత్రమే కాకుండా, పర్వతారోహకులు విసర్జించే మూత్రంలోని వేడి వల్ల కూడా కలుగుతుంది. నేపాల్ భూ నిర్వహణ మంత్రిత్వ శాఖకు చెందిన ఒక సీనియర్ సర్వేయింగ్ అధికారితో కూడిన ఒక అంతర్జాతీయ పరిశోధన బృందం, ఇటీవల 'రీజనల్ ఎన్విరాన్‌మెంటల్ చేంజ్' అనే అంతర్జాతీయ విద్యా పత్రికలో, ఎవరెస్ట్ పర్వతం నేపాల్ వైపున ఉన్న బేస్ క్యాంపులు గల ఖుంబు హిమానీనదంపై తమ విశ్లేషణను ప్రచురించింది.

వసంతకాల పర్వతారోహణ సమయంలో, వేలాది మంది పర్వతారోహకులు, గైడ్‌లు, సహాయక సిబ్బంది ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు తరలివస్తారు. ఇక్కడ కేఫ్‌లు, హైస్పీడ్ ఇంటర్నెట్, వేడి నీటి స్నాన సౌకర్యాలు, వేడి నేలలు గల టెంట్లు కూడా అందుబాటులో ఉంటాయి.



పరిశోధకుల ప్రకారం, 2023 వసంత కాలంలో సుమారు 50 రోజుల పాటు బేస్ క్యాంప్‌లోని 1,600 టెంట్ల నిర్వహణకు 824 సిలిండర్ల ద్రవీకృత పెట్రోలియం గ్యాస్, 18,935 లీటర్ల కిరోసిన్, 5,130 లీటర్ల గ్యాసోలిన్ వినియోగించబడ్డాయంటే దాని ప్రభావం..

ఏ మేరకు ఉంటుందో మనం ఊహించుకోవచ్చు. వంట, ఆహార పదార్థాలను వేడి చేయడం, విద్యుత్ ఉత్పత్తి కోసం ఉపయోగించే ఇంధనాన్ని, మానవ మూత్రం నుండి బదిలీ చేయబడిన వేడితో కలపడం ద్వారా, మొత్తం 849,174 మెగాజౌల్స్ ఉష్ణ శక్తి ఉత్పత్తి అయినట్లు అంచనా వేసారు. ఈ శక్తి 2,492 టన్నుల హిమానీనద మంచు, హిమాన్ని కరిగించడానికి సరిపోతుంది. 2,500 టన్నుల మంచు, హిమం నీరుగా కరిగినప్పుడు, అది ఒక అంతర్జాతీయ ప్రమాణాల ఒలింపిక్ స్విమ్మింగ్ పూల్‌తో సమానమైన పరిమాణం. అయితే, ఖుంబు హిమానీనదం కరగడానికి కేవలం మానవ మూత్రం మాత్రమే ప్రధాన కారణం కాదు. జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన ప్రకారం, ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వద్ద మానవ కార్యకలాపాల వల్ల కరుగుతున్న మంచులో మానవ మూత్రం వాటా కేవలం 6 శాతం మాత్రమే కాగా మిగిలిన 94 శాతం మంచు కరగడానికి పర్వతారోహకులు వాడే ద్రవీకృత పెట్రోలియం గ్యాస్, కిరోసిన్, పెట్రోల్ ప్రధాన కారణం అని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. అలాగే, ఈ ప్రాంతంలో హిమానీనదాలు భారీగా క్షీణించడానికి ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న గ్లోబల్ వార్మింగ్ అత్యంత ముఖ్యమైన కారణం అని తేల్చారు. ఇందుకు 26 ఆగస్టు 2026న నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదను ఒక ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఈ వరద వల్ల గ్రామాలకు గ్రామాలే కొట్టుకుపోగా 1,200 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.

ఆందోళనకర విషయం

20వ శతాబ్దంలో తీవ్రమైన హిమానీనదాల కరిగిపోవడం అనే దృగ్విషయం, భూగ్రహాన్ని మంచు రహితంగా మారుస్తోంది. కార్బన్ డయాక్సైడ్, ఇతర హరితగృహ వాయువుల ఉద్గారాలకు మానవ కార్యకలాపాలే ప్రధాన కారణం. పునఃస్ఫటికీకరించబడిన (recrystalized) ఈ భారీ మంచు రాశులు ఎలా పరిణామం చెందుతాయనే దానిపై సముద్ర మట్టాలు, ప్రపంచ స్థిరత్వం ఆధారపడి ఉంటాయి. వాతావరణ మార్పు అనివార్యంగా ముందుకు సాగుతున్నందున, అర్ధ శతాబ్దానికి పైగా భూమిపై ఉన్న హిమానీనదాలు నిశ్శబ్దంగా అంతర్ధానమవుతున్నాయి.

2019లో స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ విశ్వవిద్యాలయం నేతృత్వంలో జరిగిన ఒక అంతర్జాతీయ ఉపగ్రహ, క్షేత్రస్థాయి అధ్యయనం ప్రకారం, 1961 నుండి 2016 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా 9,600 బిలియన్ టన్నుల కంటే ఎక్కువ (9.6 ట్రిలియన్ టన్నులు లేదా 9,625 గిగాటన్నులు) హిమానీనద మంచు కరిగిపోయింది. ఇంత భారీ మొత్తంలో మంచు కరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు 27 మిల్లీమీటర్లు పెరిగాయి. అంతేకాదు, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 335 బిలియన్ టన్నుల మంచు కరిగిపోతోంది. దీనివల్ల ప్రతి సంవత్సరం సముద్ర మట్టం దాదాపు ఒక మి.మీ పెరుగుతోంది. అలాస్కాలోని హిమానీనదాలు అత్యధికంగా మంచును కోల్పోగా (3,000 బిలియన్ టన్నులకు పైగా), గ్రీన్‌లాండ్, ఆండీస్ పర్వత ప్రాంతాలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్, తాజా శాస్త్రీయ పరిశోధనల ప్రకారం 2100 నాటికి ప్రపంచంలోని హిమానీనదాలలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ భాగం కరిగిపోయే ప్రమాదం ఉందన్న హెచ్చరిక తీవ్ర ఆందోళనకరంగా మారింది.

మంచు కరిగి నీరు సముద్రాల్లో చేరడం వల్ల సముద్ర మట్టాలు పెరగడంతో తీరప్రాంత నగరాలు, దీవులు మునిగిపోవడం, కొండలపై ఉండే మంచు సరస్సులు ఒక్కసారిగా బద్దలై వరదలు రావడం, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయి. గంగా, బ్రహ్మపుత్ర వంటి అనేక జీవనదులకు హిమానీనదాలే ప్రధాన ఆధారం. ఇవి పూర్తిగా కరిగిపోతే భవిష్యత్తులో తీవ్రమైన తాగునీటి, సాగునీటి కొరత ఏర్పడుతుంది. సూర్యరశ్మిని పరావర్తనం చెందింపచేసి భూమిని చల్లబరిచే మంచు కరిగిపోతే, భూమి వేడిని ఎక్కువగా గ్రహించి గ్లోబల్ వార్మింగ్ మరింత తీవ్రమవుతుంది. పర్యవసానంగా చల్లని వాతావరణంలో బతికే అనేక విలక్షణమైన జంతువులు, మొక్కల జాతులు అంతరించిపోతాయి. ఈ సమస్యను అదుపు చేయడానికి గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను అదుపు చేయడం ఒక్కటే పరిష్కారం.

విధ్వంసం కారకులు, కారణాలు

ఆధునిక మానవుడు వ్యవసాయం, పట్టణీకరణ, మౌలిక సదుపాయాల కోసం భూగోళంపై మంచు లేని భూభాగంలో దాదాపు 75 శాతం గణనీయంగా మార్చేశాడు. సహజ వనరుల అధిక వినియోగం, సాగు భూమి విస్తరణ, ఆవాసాల విధ్వంసం కారణంగా 1970 నుండి 2022 వరకు ప్రపంచవ్యాప్తంగా పర్యవేక్షించబడుతున్న క్షీరదాలు (Mammals), పక్షులు, సరీసృపాలు (Reptiles), ఉభయచరాలు (Amphibians) జనాభాలో సగటున 73 శాతం క్షీణత ఏర్పడింది. ఇది సుమారు 10 లక్షల జాతులను విలుప్త (అంతరించిపోవడం) ప్రమాదంలో పడేసిందని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం పేర్కొంది.

పారిశ్రామిక రసాయనాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చమురు చిందటం, వ్యవసాయ వ్యర్థాల వల్ల గాలి, నేల, నీటి వ్యవస్థలు నిరంతరం ప్రభావితమవుతున్నాయి. ఇవి నిర్జీవ ప్రాంతాలను, విషపూరిత వాతావరణాలను సృష్టిస్తున్నాయి. శిలాజ ఇంధనాలను మండించడం వల్ల భారీ మొత్తంలో గ్రీన్‌హౌస్ వాయువులు విడుదల కావడంతో ఇవి చరిత్రలో ఎన్నడూ లేనంత వేగంగా భూమిని వేడెక్కించి, వాతావరణ సరళిని దెబ్బతీస్తాయని ఐక్యరాజ్యసమితి అధ్యయనం పేర్కొంది.

అంతేకాదు, మానవులు వినోదం, ఆనందం ద్వారా హిమానీనదాల వేగవంతమైన విధ్వంసానికి కూడా కారణమవుతున్నారు. మంచు కరగడానికి ప్రధాన కారణం ప్రపంచవ్యాప్త గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు అయినప్పటికీ, సాహస క్రీడలు, వ్యక్తిగత ప్రతిష్ట కోసం ఔత్సాహికుల తపన కూడా ఈ విధ్వంసాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా వేగవంతం చేస్తుంది.

– యేచన్ చంద్రశేఖర్

– ఎలా పొందాలో తెలుసుకుంటే, అనంతమైన శక్తి మనిషికి అందుబాటులో ఉంది.

– ఆడమ్స్ బెక్

– చుట్టూ చేరే మనుషుల్నిబట్టి అతడెలాంటివాడో తెలుస్తుంది.

– మనుషుల్ని యథాతథంగా అంగీకరించాలి. ఫలానా రకంగా ఉంటేనే అంగీకరిద్దాం అని కాదు.

– ఫ్రాంజ్ స్కూబర్ట్

పుస్తక సమీక్ష

ఆసుపత్రి పాలన, నిర్వహణపై కరదీపిక

ఆసుపత్రులలో పాలన-నిర్వహణ, రోగుల హక్కులు, బాధ్యతలను కె.వి.జగదీశ్వరరావు, వైద్య చికిత్సలు పొందుతున్న బాధిత రోగులకే కాకుండా, ఆసుపత్రుల యాజమాన్యాలకు, వైద్యులకు ఉపయుక్తంగా, సంక్లిష్ట సమాచార దిక్సూచి, అందచేయటం అభినందనీయం. రోగులకు సంబంధించిన హక్కులు సంరక్షిస్తూ, రాజ్యాంగ హామీలు, సంబంధిత చట్టాలు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రూపొందించిన, రోగుల హక్కుల చార్టర్ సులభగ్రాహ్యంగా అవగాహన కల్పించటంలో రచయిత జగదీశ్వరరావు కృతకృత్యత సాధించారు. వైద్య రంగంలో అడుగుపెట్టే యువకులు, విద్యార్థులకు, కార్పొరేట్ ఆసుపత్రులపై చెలరేగుతున్న అపోహలు, అనుమాన అమానవీయ ప్రచారాలు ఎంతవరకు సహేతుకమో, నిజాలు తెలియాలంటే ఈ పుస్తకం కరదీపికగా ఉపయోగిస్తుంది. ఆరోగ్య సంరక్షణ ఒక పరిశ్రమగా, ఆసుపత్రులు వైద్యాలయాలుగా విలసిల్లుతున్న ప్రస్తుతంలో విద్యా, విజ్ఞానాత్మకంగా రచయిత జగదీశ్వరరావు, తమ దృష్టిని ఈ విధంగా ప్రాథమిక సమాచారంపై అవగాహన కల్పించటానికి విజ్ఞాన సముపార్జన అందించటానికి తెలుగు చదువరులకు ఎంతైనా ఉపకరిస్తుంది. ఆసుపత్రుల అభివృద్ధి, సంస్థాగత నిర్మాణం, విధులు, బాధ్యతలు, కమిటీలు, సేవలు, నాణ్యతా ప్రమాణాలు, నర్సింగ్ సేవలు, వ్యర్థాల నిర్వహణ, రోగుల హక్కులు, ఆసుపత్రుల సామాజిక నిబద్ధత ఎన్నో ప్రధాన అంశాలకు సమర్థనీయంగా మార్గదర్శకం అందించారు.

(ఆసుపత్రి పాలన-నిర్వహణ; రచన: కె.వి.జగదీశ్వరరావు; వెల: రూ.200/-లు; ప్రతులకు: కె.వి.జగదీశ్వరరావురావు, ప్లాట్ నం.36, 2వ అంతస్తు, బాలాజీ పార్క్ టౌన్, హైదరాబాద్-500 090)

సహజ కవిత్వం

కవయిత్రి గడ్డం సులోచన తన జీవనయానంలో ఎదురయ్యే అనుభవాలను, వివిధ సందర్భాలను అద్భుతమైన కవితాత్మతో తీర్చిదిద్దగల సహజ కవయిత్రి. 'నడిపించిన వాక్యం'లో 53 కవితలు ఆమె మదిలో భావాలకు సహజసుందరంగా, మానవీయ స్పందనతో అర్థవంతంగా ఆలోచింపచేస్తాయి. తెలంగాణ గ్రామీణ వాతావరణంలోని రైతుబతుకు కష్టనష్టాలయినా, ఆడబిడ్డ ఆత్మీయత అయినా, బడిపిల్లలు గురించి రాసినా, బాల్యస్మృతులైనా, ఈ సంపుటిలోని కవితలు సామాజిక స్పృహ, సున్నిత భావాలతో పలకరిస్తాయి. ఒక వడగళ్లవానలో పంట నాశనమైన సందర్భాన్ని "బంగారువన్నె గింజలన్నీ వర్రెల్లోకి జారిపోయి, ఆశల కొమ్మలన్నీ విరిగి" వేదనాయుత భావనను అక్షరీకరిస్తాయి. "సముద్రమంత ప్రేమ దాహానికి ఒక్కచుక్క పనికిరాదు", సమాజంలోని మహిళ అనుభవిస్తున్న ఒంటరితనం, విషాదం, నిస్సహాయత్వం 'ఆమె'లో ప్రతిబింబింపచేసి హృదయాన్ని కదిలిస్తారు. స్వామీ వివేకానంద, తెలుగుజాతి వరం-సురవరం, మన జాడ-గురజాడ, ప్రజాకవి దాశరథి, అందెశ్రీ వందనం, మన జానకమ్మ, అగ్నివీరునికి అక్షరనివాళి కవయిత్రి రచనా ఔన్నత్య భావాల విలువలకు అద్దం పడుతున్నాయి. 'పిల్లలిప్పుడు రెక్కలు పట్టుకొన్న సీతాకోక చిలుకలు' యుద్ధ భయాలు దగ్ధ జీవితాలు రక్తపు వార్తలతో మేల్కొనే ఉదయాలు, లోకమంతా మమతల గోరింటలతో మందార మనసులై పూస్తే ఎంత బాగుండు.." అంటూ కవయిత్రి అభిలసించడం, బిక్కుబిక్కుమంటున్న గుండెచప్పుళ్లకు ఇంటిలోనైనా భద్రత ఉందా? అని ప్రశ్నించటం, ఆమె కవిత్వం, సమాజపు హృదయ స్పందనను ఆత్మీయంగా ఆవిష్కరిస్తోంది. కవయిత్రికి అభినందనలు.

(నడిపించిన వాక్యం(కవిత్వం)-రచన: గడ్డం సులోచన; వెల: రూ.120/-లు; ప్రతులకు: గడ్డం సులోచన, 9-6-225, దుర్గాభవానీ నగర్, చంపాపేట్, హైదరాబాద్-500 059)

అద్భుత కథామాలిక 'అనగనగా ఒక కథ'

'అనగనగా ఒక కథ' పేరిట రచయిత్రి మాలాకుమార్ రచించిన కథామాలలో 21 కథలున్నాయి. మాలాకుమార్ కథలలో పాత్రలు కల్పితమైనా, నిజ జీవితంలోని మనుషులు, సంఘటనలు, కలలు, కన్నీళ్లు, బంధాలు తాను చూసిన జీవితాన్ని కథలలో ప్రతిబింబింపచేసారు. దానికితోడు ఆమె జీవితయానంలో ఎన్నో అనుభవాలు, హృదయాన్ని తాకే అనుభూతులు చోటు చేసుకొని కథల రూపంలో వ్యక్తీకరించబడటం విశేషాంశం. 'కావమ్మ గారి వ్లాగ్' వంటి కథలలో హాస్యం, వినోదం చిలికించి రాయటం రచయిత్రి కథా కౌశల్యాన్ని స్పష్టం చేస్తోంది. 'మనసే బంగారం' కథలో చిరిగిన కొంగులో పైసా లేకపోయినా మానవతా విలువలు ప్రస్ఫుటింపచేసారు. కుటుంబ బాంధవ్యాలు, సానుకూల దృక్పథం, హాస్యం, ప్రేమ, విలువలు ప్రతీ కథలో రూపుదిద్దుకున్నాయి. రచయిత్రి అధునాతన సాంకేతికతా అంశాలు ఆలంబనగా చేసుకొని కథలు సృష్టించటం అభినందనీయం.

'అమ్మ ఎంత కఠినం', అద్భుతమైన కథ. యువతరం భవిష్యత్ జీవితాల కోసం పెద్దలు వ్యవహరించే కాఠిన్యం సృష్టించే ఆలోచనలను రచయిత్రి ప్రదర్శింపచేసారు. కాలంతో పాటు, నడవటం లక్ష్యంగా బాంధవ్యాలు చెదిరిపోకుండా, సమాజంలోని కుటుంబాల జీవన స్థితిగతులు అవలోకించి కథలు సృష్టించిన మాలాకుమార్ విశేషకల్పనా ప్రజ్ఞ గల సృజనాత్మక రచయిత్రిగా అభినందనీయురాలు.

(అనగనగా ఒక కథ(కథా మాల)-రచన: శ్రీమతి మాలాకుమార్; వెల:రూ.225/-లు; ప్రతులకు: శ్రీమతి మాలాకుమార్, 8-3-315/7, ప్లాట్ నం.6, మారుతీనగర్, యూసఫ్‌గూడా, హైదరాబాద్-45)

– జయసూర్య



వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి
ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1.
ఫోన్ : 98494 53449, 94409 27795

మేషం



ఈ వారం మీరు చెల్లించవలసిన చెల్లింపులకు గాను వత్తిడి అధికమవుతుంది. అన్యాయమైన ప్రవర్తన కలిగిన వారి వలన స్వల్పమైన ఒడిదుడుకులను ఎదుర్కొంటారు. బంధుప్రీతి స్నేహితులకు మీ పరిధులను మించి సహాయ సహకారాలను అందించడం వంటి అంశాల వలన ఈ వారం మీ వ్యక్తిగత ప్రయోజనాలు మరుగున పడతాయి. మీ సమకాలీకులు మీకన్నా.... ఊహించని గొప్ప స్థాయిలో ఉంచటం మిమ్మల్ని ఆలోచింప చేస్తుంది.

వృషభం



ఈ వారం కుటుంబసభ్యులతో కలిసి సంతోషంగా గడుపుతారు. ముఖ్యమైన వ్యవహారాలు విజయ వంతంగా పూర్తి చేస్తారు. ప్రమోషన్స్, పెండింగ్ వ్యవహారాలు పరిష్కారదశకు వస్తాయి. మీ శత్రువర్గం మీపై చేసే నిందలు, ఆరోపణలు నిజాలు కావని అందరూ గ్రహిస్తారు. ఊహించని ప్రయాణాలు చేస్తారు. వినోద కార్యక్రమాలు ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. రహస్య ఋణాలు, రహస్య కార్యాచరణలను ఈ వారం గ్రహస్థితి సూచిస్తోంది.

మిథునం



ఈ వారం కుటుంబ వ్యవహారాలు కొంత చికాకు కలిగిస్తాయి. వివాదాలకు దూరంగా వుండండి. ముఖ్యమైన వ్యక్తులను కలుసుకుని కీలకమైన వాగ్దానాలు తీసుకుంటారు. స్థిరాస్థి వివాదాల పరిష్కారానికి గాను మధ్యవర్తులను ఆశ్రయిస్తారు. వృత్తి వ్యాపారాలు అనుకూలంగా వుంటాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. కుటుంబంలోని ఒకరికి ఉన్నతమైన అవకాశాలు కలిసి వస్తాయి. శత్రువర్గం యొక్క బలహీనతలు తెలిసి వస్తాయి. నిత్యం నాగసింధూరం ధరించండి.

కర్కాటకం



ఈ వారం నూతన కార్యక్రమాలు ప్రారంభించడానికి గాను ఏర్పడిన అవాంతరాలు తొలగిపోతాయి. శుభవార్తలకు సంబంధించిన తీపి కబురు ఆనందం కలిగిస్తుంది. విందు, వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. సంతానం పైన ఎక్కువగా దృష్టిని కేంద్రీకరిస్తారు. బ్యాంక్ ఋణాలు మంజూరవుతాయి. విదేశాలలోని మీ స్నేహితులకు లేక ఆప్తులకు మాట సహాయమే తప్ప ఆర్థిక సహాయాన్ని అందించరు. పరిపరి విధాలుగా ఆలోచనలను సాగిస్తారు.

సింహం



ఈ వారం కుడిచేతితో చేసే పని ఎడమ చేతికి తెలియ నివ్వరు. సేవా కార్యక్రమాలలో పాలుపంచు కుంటారు. ఇష్టంలేని వ్యక్తులకు దూరంగా ఉంటారే తప్ప వాగ్వివాదాలకు దిగరు. స్వార్థంలేని లౌకిక ప్రపంచంలో నెగ్గడం కష్టమని భావించే విధంగా కొన్ని సంఘటనలు చోటు చేసుకుంటాయి. న్యాయ స్థానాలను ఆశ్రయిస్తారు. వృత్తి, ఉద్యోగాది వ్యవహారాలను, కుటుంబ వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించగలుగుతారు.

కన్య



ఈ వారం ఇతరుల బాధ్యతలను కూడా మీరే నెత్తిన వేసుకుని కార్యక్రమాలను జరుపుతారు. కుటుంబంలో స్వల్పమైన విభేదాలు ఏర్పడే సూచనలున్నాయి. నిలకడలేని ఆర్థిక వ్యవహారాలు చికాకు కలిగిస్తాయి. పీసా, పాస్పోర్ట్ వంటి వ్యవహారాలు సానుకూల పడతాయి. ఎన్ని మెలకువలు పాటించినప్పటికీ మానసిక, శారీరక వత్తిడి నుండి తప్పించుకోలేరు. సౌందర్యసాధక చిట్కాల పట్ల ఆకర్షితులవుతారు. భవిష్యత్తు ప్రణాళికల గూర్చి దీర్ఘంగా ఆలోచనలు చేస్తారు. ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు.

తుల



ఈ వారం కొత్త మిత్రులు వరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. చిన్న నాటి మిత్రుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. పనులలో ఆటంకాలు తొలగు తాయి. ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. గృహం, వాహనాలు కొనుగోలు చేస్తారు. వస్తులాభం పొందుతారు. సంతాన విద్యాభివృద్ధి బాగుంటుంది.

వృశ్చికం



ఈ వారం ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. నూతన ఒప్పందాలు కలిసి వస్తాయి. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. సమస్యలు తీరి ప్రశాంతత లభిస్తుంది. అనుకోని అతిథుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. వృత్తి వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి. స్పెక్యులేషన్లో నష్టం రాకపోవడమే వరోక్ష లాభంగా పరిణమిస్తుంది. క్రయ, విక్రయాలు గతంలో కన్నా ఎక్కువగా సాగిస్తారు. జరిపే చర్చలు, సంప్రదింపులు ఈవారం ఫలవంతంగా ఉంటాయి. వైద్యున్ని మార్పు చేసి లాభపడతారు.

ధనుస్సు



ఈ వారం తేలికగా సాగుతాయనుకున్న కార్యక్రమాలు తప్ప క్లిష్టమైన, నూతనమైన విషయ వ్యవహారాలను పరిగణలోనికి తీసుకోకండి. వృత్తి, ఉద్యోగాల పరంగా చిట్టిపొట్టి చికాకులు తప్పక పోవచ్చు. ఋణాలు లభిస్తాయి. సహోదర వర్గంతో స్వల్పమైన విభేదాలు చోటు చేసుకుంటాయి. ముఖ్యమని మీరు భావించిన అంశాలు సానుకూల బాటలో ఉండటం మీకు సంతృప్తిని కలిగిస్తుంది. రాజకీయాలకు, వివాదాలకు అయినంత దూరంగా ఉంటారు. ప్రశాంతత కోసం ధ్యాత్మికతపైన దృష్టిని సారిస్తారు.

మకరం



ఈ వారం ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. పాత బాకీలు వసూలవుతాయి. మిత్రబృందంలోని ఒకరు మీతో శతృత్వం పెంచుకునే సూచనలున్నాయి. జీవితభాగస్వామి సలహాలను పాటిస్తారు. రెండు, మూడు విధాలుగా ఆశించిన కార్యక్రమాలను పురోభివృద్ధిలో నడిపించడానికి కావలసిన సహాయ సహకారాలు లభిస్తాయి. సంఘంలో గౌరవానికి లోటు ఉండదు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

కుంభం




ఈ వారం నూతన పరిచయాలు పెరుగుతాయి. పెట్టుబడులకు లాభాలు పొందుతారు. అప్రయత్న కార్యసిద్ధి. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. దూరపు బంధువులను కలుసుకుని ముఖ్యవిషయాలు చర్చిస్తారు. ఇంటర్వ్యూలకు హాజరువుతారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు హోదాలు దక్కుతాయి. రాజకీయ కళారంగాల వారికి యోగదాయకంగా ఉంటుంది. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. కుటుంబ సభ్యులతో కలిసి విందు, వినోదాలలో పాల్గొంటారు. వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు.


మీనం




ఈ వారం ప్రజా సంబంధాలను వృద్ధి చేసుకోగలుగుతారు. లలిత కళల పట్ల అభిరుచిని కనబరుస్తారు. చిన్నతరహా పరిశ్రమల వారికి చిరు వ్యాపారస్తులకు సాఫ్ట్వేర్ రంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది. అనుకున్న విధంగా నిర్ణయాలను అమలు చేయగలుగుతారు. శుభప్రదమైన ఖర్చులను గ్రహస్థితి సూచిస్తోంది. ఎదుటివారు చెప్పేది ఆసాంతం వినడం, విసుగు, కోపాలకు దూరంగా ఉండటం వలన లాభపడగలుగుతారు. అవసరాలకు తగినంత ధనాన్ని సమకూర్చుకోగలుగుతారు. నిత్యం ఆరావళి కుంకుమతో మహాలక్ష్మీదేవిని పూజించడం చెప్పదగిన సూచన.

ఈ వారం కార్టూన్స్


కండక్టర్ లు వెళ్తూ.. 'అల్లం-వెల్లుల్లి' అమ్మే
కొడిని పట్టుకోవాలంటే తీక్ష్ణ పెట్టి కాపు కాస్తున్నారా?


ముప్పయ్యేళ్లు గా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా... ఇంటి,ఆదాయ పన్నులు కడుతున్నా..
పాతిక సార్లు ఓటు వేసాను.. ఎన్నో ఎన్నికలకు ఎన్నికల అధికారిగా పనిచేసా...
ఇప్పుడు "సర్" కోసం నా ఉనికిని ప్రూవ్ చేసుకోవాలా??


కొంచెం ఓపికగా
వుండి డాక్టర్..!!



కో పాన్యీ అనే ఈ ఊరు థాయ్‌లాండ్‌లో ఉంది. నీటిపై తేలియాడటం ఈ గ్రామ ప్రత్యేకత. నీటిపై ఉన్నందువల్ల పర్యాటక ప్రాంతంగా ప్రఖ్యాతికెక్కింది.







